


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | గురువారం 29-10-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:74 | పేజీలు:4 | వెల: రూ.1/-


# దుబ్బాకలో భారీ మెజార్టీతో గెలుస్తాం

**కాంగ్రెస్, బిజెపిలకు డిపాజిట్లు కూడా దక్కవు**

**కెసిఆర్ అభివృద్ధి చేస్తున్నారు కాబట్టి ప్రజలు వెన్నంటి ఉన్నారు**

**దుబ్బాక ప్రచారంపై కెసిఆరే నిర్ణయం తీసుకుంటారు**

**బిజెపి డబ్బుపై సమాధానం చెప్పాల్సిందే**

**మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కేటీఆర్**

హైదరాబాద్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల్లో గతంలో కన్నా ఎక్కువ మెజార్టీతో టిఆర్ఎస్ గెలవబోతున్నదని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బిజెపి కుట్రలు, కాంగ్రెస్ ఎత్తులు పనిచేయవన్నారు. సిఎం కెఇసార్ ప్రచారంపై త్వరలోనే స్పష్టత ఇస్తామని అన్నారు.

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. దుబ్బాక చైతన్యాల గడ్డ..రామలింగారెడ్డి విప్లవాల నుంచి వచ్చారు. గతంలో తాను దుబ్బాకలో ఎన్నికల ప్రచారం నిర్వహించాను. అక్కడి ప్రజల నాడీ తనకు బాగా తెలుసు. దుబ్బాకలో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగే తీర్పు వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు డిపాజిట్లు కోల్పోయినా ఆశ్చర్యం లేదన్నారు. ఈ ఉప ఎన్నికలో గతంలో కంటే అధిక మెజార్టీ టీఆర్ఎస్ పార్టీ సాధిస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి చేస్తున్నారు కాబట్టే.. ఏ ఎన్నికల్లో అయినా ప్రజలు టీఆర్ఎస్ పార్టీని ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఆ పార్టీది కచ్చితంగా వాట్సాప్ యూనివర్సిటీయే అని ఎద్దేవా చేశారు. గోబెల్ బతికి ఉంటే బీజేపీ దగ్గర పాఠాలు నేర్చుకునే వారని అన్నారు. బీజేపీ తీరు సమాజంలో తక్కువ.. సామాజిక మాధ్యమంలో ఎక్కువ అన్నట్టు ఉందన్నారు. వాట్సాప్ యూనివర్సిటీ నడుపుతూ తప్పుడు సందేశాలు పంపుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో అన్నింటికీ డబ్బులు తామే ఇస్తున్నామని చెప్పుకుంటున్న బీజేపీ నేతలు.. రఘునందన్ రావు ఇంట్లో దొరికిన డబ్బు మాత్రం తమది కాదంటున్నారు. కానీ ఆ నగదుకు సంబంధించిన సాక్ష్యాలు బయటపడిన విషయం అందరికీ తెలుసు అని కేటీఆర్ చెప్పారు. దుబ్బాకలో తమకు ప్రత్యర్థులు ఎవ్వరూ లేరు అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి దుబ్బాకలో మిగిలేది గుండు సున్నా మాత్రమే అని పేర్కొన్నారు. బీజేపీ నేతలు సీఎం కేసీఆర్‌పై పరుష పదజాలం ఉపయోగిస్తున్నారు. తాము మాట్లాడక పోవడం తమ చేతకాని తనం కాదు.. సమయం వచ్చినప్పుడు ప్రధాని, కేంద్ర మంత్రుల మీద అంత కంటే ఎక్కువ స్థాయిలో మాట్లాడగలమని కేటీఆర్ చెప్పారు. కిషన్ రెడ్డి కొద్దిగా హుందాగా మాట్లాడుతున్నారు. ఆయన తన పార్టీ లోని నేతలకు హుందాతననీ నేర్పాలి అని సూచించారు. దుబ్బాకకు బీజేపీ, కేంద్రం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేయాలని టీఆర్ఎస్ పార్టీని అడగడం సరికాదన్నారు. నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్న తెలంగాణకు కేంద్రం నుంచి ఒక్క పైసా నిధులైనా అదనంగా తెచ్చారా? అని ప్రశ్నించారు. కేంద్రం నిధుల వాటాపై చర్చ పెడుదామని హరీష్ రావు సవాల్ చేస్తే బీజేపీ నేతలు పారిపోయారు. దుబ్బాకలో సీఎం కేసీఆర్ ప్రచారంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రచారం చేసే విషయంపై కేసీఆరే స్వయంగా నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. దుబ్బాకలో తన ప్రచారం అవసరం లేదని అనుకుంటున్నాను. హరీష్ రావు అయినా, తాను అయినా కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తామని తెల్చిచెప్పారు. జిల్లా మంత్రి హరీష్ రావు నాయకత్వంలో దుబ్బాకలో ముందుకెళ్తున్నామని తెలిపారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికలో సీఎం కేసీఆర్ ప్రచారం చేయకున్నా బ్రహ్మాండమైన మెజారిటీ సాధించాం అని గుర్తు చేశారు. పార్టీలోకి మంచి వారిని తీసుకుంటామన్నారు. త్వరలోనే పార్టీలోకి మరిన్నిచేరికలు ఉంటాయని కేటీఆర్ స్పష్టం చేశారు.

# వరంగల్ 9మంది హత్యల కేసులో కోర్టు సంచలన తీర్పు

# హంతకుడికి ఉరిశిక్ష ఖరారు

**నెలరోజుల్లోపే ఛార్జిషీటు దాఖలు చేసిన పోలీసులు**

**కోర్టు తీర్పుపై సర్వత్రా హర్షం..పోలీసులకు అభినందన**

వరంగల్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన వరంగల్ గొర్రెకుంట తొమ్మిది మంది హత్య కేసులో జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందుతుడు సంజయ్ కుమార్ యాదవ్‌కు ఉరిశిక్ష విధిస్తూ వరంగల్ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జయ్‌కుమార్ తీర్పు ప్రకటించారు. గత మే 21న తొమ్మిది మందికి ఆహారంలో విషం కలిపి సజీవంగానే సంజయ్ బావిలో పడేశాడు. తెల్లారి వరుసగా 9 మంది మృతదేహాలను పోలీసులు బయటకు తీశారు. 25 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేశారు. 57మంది మంది వాంగ్మూలం నమోదు చేశారు. ఒక హత్యను కప్పిపుచ్చుకునేందుకు తొమ్మిది మందిని దారుణంగా హత్య చేసిన నిందితుడికి కోర్టు ఉరిశిక్ష విధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అంతకుముందు తెలంగాణలో సంచలనం సృష్టించిన తొమ్మిది మంది హత్య కేసులో నిందితుడిపై నేరం రుజువైంది. అతడు నేరస్థుడని కోర్టు నిర్ధారించింది.



ఈ ఏడాది మే 20న వరంగల్ నగర శివారులోని గొర్రెకుంట బావిలో 9మందిని హత్య చేసిన కేసులో విచారణ పూర్తయింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిందితుడిపై అభియోగాలను నిరూపించారు. దీంతో నేరం రుజువైనట్లు వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రకటించారు. అయితే నిందితుడికి శిక్ష ఖరారు చేయాల్సి ఉంది. నిందితుడిపై 7 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటన జరిగిన నెల రోజుల్లోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం గమనార్హం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరంగల్ హత్యలను సీడీఆర్ (కాల్ డేటా రికార్డింగ్) ఆధారంగానే పోలీసులు ఛేదించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రవీందర్ అప్పట్లో మీడియాకు వివరాలు తెలిపారు. నగర శివారులో గోనె సంచులు తయారు చేసే కేంద్రంలో మక్సూద్, అతడి భార్య పనిచేసేవారు. ఈ క్రమంలోనే బిహార్‌కు చెందిన సంజీవ్ కుమార్ యాదవ్‌కు ఆ కుటుంబంతో పరిచయం ఏర్పడింది. మక్సూద్ భార్య నిషా అక్క కూతురు రఫీకా (31)తో పరిచయం ఏర్పడింది. అప్పటికే భర్తతో విడిపోయి ముగ్గురు పిల్లలతో ఒంటరిగా ఉంటున్న రఫీకాకు సంజీవ్ దగ్గరయ్యాడు. అనంతరం గీసుకొండ మండలం జాన్‌పాక ప్రాంతంలో రెండు గదుల ఇంటిని కిరాయికి తీసుకుని ఆమెతో సహజీవనం చేశాడు.

అయితే తన కుమార్తెతో కూడా నిందితుడు చనువుగా ఉండడాన్ని రఫీకా గమనించి సంజయ్‌ను నిలదీసింది. పలుమార్లు అతడితో గొడవ పడింది. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి తన కుమార్తెతో సన్నిహితంగా ఉండడంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో రఫీకాను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. పెళ్లి విషయాన్ని పెద్దలతో చెప్పేందుకు వెళ్దామని రఫీకాను మాత్రమే తీసుకుని సంజీవ్ యాదవ్ మార్చి 6న విశాఖ వైపు వెళ్లే గరీభ్ రథ్ రైలు ఎక్కాడు. దారిలో మజ్జిగ ప్యాకెట్లు కొని అందులో నిద్రమాత్రలు కలిపి ఆమె అపస్మారక స్థితిలో ఉన్న సమయంలో రైల్లోంచి తోసేశాడు. అనంతరం తిరిగి గీసుకొండ చేరుకున్నాడు. అయితే, తన అక్క కూతురు గురించి మక్సూద్ భార్య నిషా నిలదీసింది. ఆమె గురించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పింది. దీంతో మక్సూద్ కుటుంబాన్ని కూడా హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో మే 16 నుంచి 20వ తేదీ వరకు రోజూ వారు పనిచేసే గోనె సంచుల తయారీ కేంద్రాన్ని సందర్శించేవాడు. చుట్టు పక్కల ప్రదేశాలను పరిశీలించాడు. మే 20వ తేదీన మక్సూద్ మొదటి కుమారుడైన షాబాజ్ పుట్టిన రోజు అని తెలుసుకుని ఆ రోజే చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం 18వ తేదీన వరంగల్ చౌరస్తాలో ఓ మెడికల్ షాపులో సుమారు 60 నిద్రమాత్రలు కొనుగోలు చేశాడు. 20వ తేదీ రాత్రి వారితో ముచ్చటించాడు. అనుకూలంగా ఉన్న సమయంలో మక్సూద్ కుటుంబం తయారు చేసుకున్న భోజనంలో నిద్రమాత్రలు కలిపాడు. తాను ఇక్కడికి వచ్చిన విషయాన్ని బయటకు చెబుతారన్న ఉద్దేశంతో ఈ కుటుంబానికి సంబంధం లేని శ్యాం, శ్రీరాం తయారు చేసుకున్న భోజనంలోనూ నిద్రమాత్రలు కలిపాడు. వారంతా నిద్రలోకి జారుకున్నాక అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య వరకు మత్తులో ఉన్న ఎండీ మక్సూద్(50), ఆయన భార్య నిషా(45), కుమార్తె బుస్రా (20), బుస్రా కుమారుడు(3), షాబాద్(22), సోహైల్(20), బిహార్‌కు చెందిన కార్మికులు శ్యామ్(22), శ్రీరామ్(20), వరంగల్ వాసి షకీల్ ను గోదాము పక్కనే ఉన్న బావిలో పడేసి ఇంటికెళ్లి పోయాడు. మొత్తం ఈ కేసు ఛేదించేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. గోదాం, గొర్రెకుంట ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలు ఈ కేసులో కీలకంగా మారాయి. వాటిని ఆధారంగా చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంట్లోంచి వెళ్లడం దగ్గర నుంచి మళ్లీ చేరుకునే వరకు అందులో నమోదయ్యాయి. దీంతో నిందితుడిని జాన్‌పాక్‌లోని తన ఇంటిలో అదుపులోకి తీసుకున్నామని అని రవీందర్ వెల్లడించారు.

# భూ సమస్యలకు ఇక శాశ్వత పరిష్కారం

**ధరణి పోర్టల్‌ను నేడు ప్రాంభించనున్న సిఎం కెసిఆర్**

**సాంకేతిక సమస్యలను అధిగమించేలా చర్యలు**

హైదరాబాద్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా కేసీఆర్ సర్కార్ తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 29న గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ధరణి ప్రజలకు అందుబాటులోకి రానుంది. దశాబ్దాలుగా పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారానికి ధరణి వేదిక కానుంది. దశాబ్దాలుగా పీటముడిగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా తెలంగాణ సర్కార్ అన్ని జాగ్రత్తలు తీసుకుంది. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, భవిష్యత్తులో స్థిరాస్తుల విషయంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ధరణి పోర్టల్‌తో చెక్ పెట్టింది. దీనిపై పూర్తి స్థాయిలో కసరత్తు చేసిన ప్రభుత్వం ఈనెల 29న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే ధరణి పోర్టల్ కు కావాల్సిన సాఫ్ట్వేర్, హార్డ్‌వేర్ పరికరాలు అన్ని మండల కేంద్రాలకు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అందజేసిన ప్రభుత్వం దీని నిర్వహణ కోసం రెవెన్యూ సిబ్బందికి, ఉన్నతాధికారులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. ఇందులో భాగంగా చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ స్వయంగా తాసిల్దార్‌లకు ధరణీ పని తీరును మంగళవారం జరిగిన సదస్సులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మొత్తానికి మున్సిపల్, పంచాయతీ రాజ్, రెవెన్యూ చట్టాలతో సంస్కరణ జోరు పెంచిన సర్కార్ ధరణి పోర్టల్ ద్వారా దేశంలోనే భూ సమస్యల పరిష్కారానికి ట్రెండ్ సెట్టర్‌గా నిలవాలని భావిస్తోంది. దాదాపు యాభై రోజులుగా నిలిచిపోయిన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ గురువారం నుంచి తిరిగి ప్రారంభం కానుంది. అదే రోజు వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు కూడా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి అనుమతిస్తే రెండింటినీ గురువారమే ప్రారంభిస్తారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు చేయాల్సిన తహసీల్దార్లకు ఇప్పటికే ధరణిపై శిక్షణ ఇచ్చారు. వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు చేపట్టే సబ్ రిజిస్ట్రార్లకు ఎలాంటి శిక్షణ అవసరం లేదు. గతంలో రెవెన్యూ కార్యాలయాల్లో కొనసాగిన అవినీతికి చెక్ పెట్టే విధంగా, సులభతర విధానంలో ధరణి పోర్టల్ అందుబాటులోకి వస్తుంది. భూ సమస్యలు పరిష్కరించే దిశగా ఈ పోర్టల్ ఉండనుంది. వ్యవసాయ భూములు తాసిల్దార్ కార్యాలయంలో,వ్యవసాయేతర ఆస్తులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరుగనున్నాయి. వ్యవసాయ భూములకు పచ్చరంగు పట్టాదారు పాసు బుక్కు, వ్యవసాయేతర ఆస్తులకు మెరున్ కలర్ పాస్‌బుక్ ఇవ్వనుంది. నిర్వహణలో తలెత్తే సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ తో పాటు, ప్రతి జిల్లాలో టెక్నికల్ సపోర్ట్ టీం అందుబాటులో ఉండనుంది. రాష్ట్రవ్యాప్తంగా 474 తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్లు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదాలో వ్యవసాయ భూములకు రిజిస్ట్రేషన్ చేస్తారు. వెనువెంటనే రికార్డుల్లో మ్యుటేషన్ చేపడతారు. దీనికోసం ధరణికి శ్రీకారం చుడుతున్నారు.

వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా వాణిజ్య అవసరాల కోసం మార్చే అధికారం కూడా తహసీల్దార్లకే కట్టబెట్టడంతో పై నాలుగు రకాల డాక్యుమెంట్ల నమోదుతో పాటు నాలా అధికారంతో వారు బాధ్యతలు చేపట్టనున్నారు. రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో కొనుగోలుదారుల నుంచి తీసుకునే ఆధార్ కార్డులోని వివరాలే రిజిస్ట్రేషన్‌కు ప్రామాణికం కానున్నాయి. ఆధార్ కార్డులోని ఫొటోయే భూమిపై ఇచ్చే పట్టాదార్ పాస్ పుస్తకం తొలిపేజీలో ముద్రిస్తారు. దాంతో ఆధార్ కార్డు కీలకంగా మారింది. ఇక రిజిస్ట్రేషన్ అనంతరం కొనుగోలుదారుల చిరునామాకే పట్టాదారు పాస్‌పుస్తకం చేరనుంది.

# కరోనా కట్టడిలో విఫలం ఎలా అయ్యాం

**కిషన్ రెడ్డివి తప్పుడు ఆరోపణలు**

**వరదలపై బెంగుళూరు కానరాలేదా: కెటిఆర్**

హైదరాబాద్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడిలో తెలంగాణ విఫలం అయిందని కిషన్ రెడ్డి ఏ ఆధారంతో మాట్లాడారని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కరోనా కట్టడిలో తెలంగాణ ముందుందని కొన్ని సంస్థలు పొగిడాయి. కరోనా కట్టడికి కేంద్రం రూ. 7 వేల కోట్లు కేటాయించిందని బండి సంజయ్ మాట్లాడారు.. అది అబద్ధం అని కిషన్ రెడ్డే చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. కరోనా కట్టడికి బీజేపీ పాలిత రాష్ట్రాలు ఎలాంటి చర్యలు తీసుకున్నాయని ప్రశ్నించారు. హైదరాబాద్ వరదల గురించి మాట్లాడుతున్న బీజేపీ నేతలు.. బెంగళూరు వరదల గురించి ఎందుకు మాట్లాడటం లేదని కేటీఆర్ అడిగారు. ఆర్థిక వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ఘోరంగా దెబ్బతీసిందని కేటీఆర్ అన్నారు. కరోనాకు ముందు నుంచే దేశంలో ఆర్థిక మందగమనం ఉందన్నారు. 24 నెలలుగా ఆర్థిక పరిస్థితి కేంద్రంలో బాగా లేదు.. దీనికి కరోనానే కారణం కాదు.. చాలా కారణాలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు జీడీపీ జీరో అని ఆర్థిక మంత్రి చెప్పడం సరికాదన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం అత్యధిక వ్యవసాయ రుణాలు మాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇది తాము కొట్టుకుంటున్న డబ్బా కాదు.. ఆర్బీఐ నివేదికలోని పొందుపరిచిన అంశాలు అని తెలిపారు. ఇప్పటి వరకు రూ. 27 వేల కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేశామని తెలిపారు. రైతుబంధు ద్వారా మరో రూ. 28 వేల కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అని పేర్కొన్నారు. నేరుగా రైతుల ఖాతాల్లోకి రూ. 56 వేల కోట్లు జమ చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యల రేటు గణనీయంగా తగ్గిందన్నారు. రాష్ట్ర జీఎస్డీపీలో వ్యవసాయం పాత్ర 300 రెట్లు పెరిగిందన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం కూడా రెట్టింపు అయిందని తెలిపారు. రైతు బంధు పథకంతో సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం దక్కిందని ఆర్బీఐ నివేదిక పేర్కొందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# రైతులను ముంచేలా వ్యవసాయ బిల్లులు

**చేగుంటలో భారీ రైతు రోడ్ షో**

**బిజెపిపై మండిపడ్డ మంత్రి హరీష్ రావు**

మెదక్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): రైతులకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవసాయ బిల్లులను తెచ్చిందని మంత్రి హరీష్‌రావు అన్నారు. మీటర్లు పెట్టడం కుదరదని సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారని పేర్కొన్నారు. బీజేపీ బిల్లులకు వ్యతిరేకంగా దేశమంతా అట్టుడుకుతోందన్నారు. చేగుంట మండల కేంద్రంలో టీఆర్ఎస్ రోడ్ షో, రైతు బహిరంగ సభను ఏర్పాటు చేశారు. దీంతో రైతన్నలతో చేగుంట నిండిపోయింది. టీఆర్ఎస్‌కే తమ మద్దతు, ఓటు అంటూ రైతులు నినదించారు. ఈ ర్యాలీలో మంత్రి హరీష్ రావు ప్రసంగించారు. ఈ సంర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రైతులను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీలను తరిమి కొట్టాలన్నారు. కేంద్ర బిల్లులకు వ్యతిరేకంగా త్వరలో టీఆర్ఎస్ ఉద్యమం మొదలవుతుందన్నారు. కేంద్రం తెచ్చిన అగ్రికల్చర్ బిల్లులకు వ్యతిరేకంగా త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా టీఆర్ఎస్ పార్టీ ఉద్యమం చేస్తుందని మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. కేంద్ర వ్యవసాయ బిల్లుల వల్ల రైతులకు తీరని నష్టం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న అగ్రికల్చర్ బిల్లులను కేంద్రం తెచ్చింది. సబ్సిడీ లేకుండా బిల్లు ఇవ్వాలని మే 17న కేంద్రం రాష్ట్రానికి లేఖ రాసింది. బావుల వద్ద మీటర్లు పెడితే రూ. 2500 కోట్లు ఇస్తామన్నారు. బావుల దగ్గర మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని జూన్ 2న కేంద్రానికి సీఎం కేసీఆర్ లేఖ రాశారని హరీష్ రావు గుర్తు చేశారు. రైతులను మోసం చేస్తున్న బీజేపీని 300 మీటర్ల లోతులో పాతిపెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పంటలు ఎండిపోయేవి. ముత్యం రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ. 30 వేలు ఇస్తేనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చేవారని గుర్తు చేశారు. విదేశీ మక్కలను దిగుమతి చేసుకుంటే.. ఇక్కడి మక్కలు ఎవరు కొంటారు? అని ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనాల కోసం భారతీయ జనతా పార్టీ పని చేస్తుందని మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ నేతలకు కార్యకర్తలు లేక పక్క మండలాలు, జిల్లాల నుంచి తీసుకువస్తున్నారని తెలిపారు. తిన్నది అరగక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చంద్రబాబు పదవీ కాలంలో బీజేపీ నాయకులు అన్నారని మంత్రి గుర్తు చేశారు. వ్యవసాయం దండగా కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారని తెలిపారు. కాలిపోయే మోటార్లు కావాలా? బావుల వద్ద మీటర్లు కావాలా? నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ కావాలో నిర్ణయించు కోవాల్సిందే రైతులే అని మంత్రి హరీష్ రావు అన్నారు.

# వరదబాధితులకు బిజెపి మొండి చేయి

**కేంద్రం పైసా సాయం విదిల్చలేదు**

**హబ్సిగూడలో వరదసాయం పంపిణీలో మేయర్ బొంతు**

హైదరాబాద్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): నగర వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్రం ఒక్క పైసా కూడా సాయం చేయలేదని మేయర్ బొంతు రామ్మోహన్ స్పష్టం చేశారు. వరద బాధితులకు కేంద్రం సాయం చేసిందని కిషన్ రెడ్డి చెప్పే మాటల్లో నిజం లేదు అని తేల్చిచెప్పారు. నగర ప్రజలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 550 కోట్లు తక్షణ సాయం కింద విడుదల చేశారని తెలిపారు. వరద ప్రాంత ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హబ్సిగూడలో ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, మేయర్ బొంతు రామోహన్ కలిసి వరద బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ బొంతు రామ్మోహన్ మాటాడుతూ.. ముంపునకు గురైన ప్రతి ఇంటికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు రూ. 50 వేల చొప్పున, పూర్తిగా ఇల్లు కూలిపోయిన వారికి రూ. లక్ష చొప్పున సాయం అందిస్తామని బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. ప్రభుత్వం బాధిత ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వరద ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి సహాయం అందేలా చూస్తామని అన్నారు. సహాయక చర్యలు చేపడుతూ,నగదు పంపిణీ చేస్తున్న సిబ్బంది సేవలుఅభినం దనీయమన్నారు. నగదు పంపిణీని వేగవంతంగా పూర్తిచేసే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. వరదలతో ఇబ్బందులకు గురైన ప్రతి కుటుంబానికీ న్యాయం జరిగేలా చూస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని వరద ముంపు ప్రాంతాలను పరిశీలించామన్నారు. ఈ మేరకు ప్రతి కుటుంబానికి తోడ్పాటు అందించే విధంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కేసీఆర్ రిలీఫ్ కిట్స్, దుప్పట్లు అందజేశామన్నారు. అదేవిధంగా తక్షణ ఆర్థిక సహాయంలో భాగంగా ప్రతి బాధితుడికి రూ. పదివేలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వారికి తక్షణ సహాయంగా నగదు అందించడం జరుగుతుందని అన్నారు. వరద ముంపు ప్రాంతాలను మంత్రి కేటీఆర్ స్వయంగా పరిశీలించారని తెలిపారు. వరద ముంపునకు గురైన బాధితులను కలిసి భరోసా కల్పించి, వారికి సహాయం అందజేశారని చెప్పారు. అదేస్ఫూర్తితో ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించే విధంగా ఇంటింటికీ వెళ్లి రూ.పదివేలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సహాయ కార్యక్రమం కొనసాగుతుంది. పలు ప్రాంతాల్లోని వరద బాధితులకు రూ.పదివేల నగదు పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం బాధిత కుటుంబాలకు అందేలా చూస్తామన్నారు. ప్రతి కుటుంబానికి న్యాయం చేసేవిధంగా చూస్తామన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

# దుబ్బాక ఉప ఎన్నికకు ప్రత్యేక పరిశీలకుడు

**సీనియర్ పోలీస్ అధికారి సరోజ్‌ను నియిమించిన ఇసి**

హైదరాబాద్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికను పర్యవేక్షించేందుకు తమిళనాడుకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సరోజ్ కుమార్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. మొత్తం వ్యవహారాన్ని స్పెషల్ ఆఫీసర్ సమీక్ష చేయనున్నారు. కమలం-కారు మధ్య నోట్ల కట్టల వ్యవహారం తీవ్ర రాజకీయం దుమారం రేపింది. ఇరుపార్టీలు ఆరోపణలు-ప్రత్యారోపణలతో ఎన్నికల ప్రచారం వేడెక్కించారు. మరోవైపు బీజేపీ, టీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాయని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో దుబ్బాక ఉప ఎన్నికకు ప్రత్యేక పరిశీలకుడిని సీఈసీ నియమించింది. నోట్ల కట్టల కలకలంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రతి విషయాన్ని ఆయన పరిశీలించి ఇసికి ఎప్పటికప్పుడు నివేదిక అందచేస్తారు. మరోవైపు దుబ్బాక ఉప ఎన్నిక పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావర ణంలో జరిపేందుకు వీలుగా కేంద్ర బలగాలను దించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను టీపీసీసీ కోరింది.

# ఢిల్లీలో మళ్లీ పెరిగిన కరోనా కేసులు

**-స్కూళ్లను మూసేస్తూ ఆదేశాలు**

న్యూఢిల్లీ,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): కోవిడ్19 నేపథ్యంలో ఢిల్లీలో స్కూళ్లను తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు మూసివేస్తున్నట్లు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి మనీష్ శిసోడియా తెలిపారు. రెగ్యులర్‌గా క్లాసులు నిర్వహించేందుకు విద్యార్థులు తల్లితండ్రులు ఆసక్తిగా లేరని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లను మూసివేయనున్నట్లు ఆయన చెప్పారు. దేశరాజధానిలో మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఢిల్లీలో కొత్తగా 4853 కేసులు నమోదు అయ్యాయి. దీంతో నగర ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు శీతాకాలం సమీపిస్తున్న తరుణంలో నగర కాలుష్యం కూడా ఎక్కువైంది. దీంతో కరోనా కేసుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు స్కూళ్లను తెరవరాదు అంటూ ఢిల్లీ సర్కార్ ఆదేశించింది. ఐపీ యూనివర్సిటీ కింద ఉన్న కాలేజీల్లో సీట్ల సంఖ్య 1330కి పెంచినట్లు మంత్రి శిసోడియా తెలిపారు.

# ప్రశాతంగా తొలిదశ పోలింగ్ ప్రారంభం

పాట్నా,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): బీహార్ శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఆరు జిల్లాల్లోని 71 స్థానాలకు బుధవారం పోలింగ్ జరుగుతోంది. అక్కడక్కడ చెదురుముదురు ఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగుతోంది. లఖీసరాయ్ జిల్లాలోని బల్యాడ గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. గ్రామంలోని ఆట స్థలంలో మ్యూజియం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పోలింగ్ కేంద్రం 115 పరిధిలోని గ్రామస్తులంతా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రిసైడింగ్ అధికారి మహ్మద్ ఇక్రాముల్ హక్ తెలిపారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి, బీహార్ మంత్రి కుమార్ సిన్హా స్పందిస్తూ.. మంచి పాలన కొనసాగుతున్నా కొందరి ప్రోద్బలంతో అక్కడక్కడా ఎన్నికలు బహిష్కరణ పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

# టి శాట్‌ను అభినందిస్తూ కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీ నుంచి రాష్ట్రంలో ఆన్‌లైన్ బోధన ప్రారంభమైన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం టీశాట్ ఛానెల్స్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నది. దీంతో టీశాట్ యాప్ డౌన్‌లోడ్‌లు 10 లక్షలకు చేరాయి. ఈ సందర్భంగా టీశాట్ సీఈవో శైలేష్ రెడ్డితో పాటు వారి సిబ్బందిని మంత్రి కేటీఆర్ అభినందించారు. టీశాట్ యాప్ డౌన్‌లోడ్‌లు 10 లక్షలకు చేరిన సందర్భంగా శైలేష్ రెడ్డి ట్వీట్ చేయగా, దాన్ని కేటీఆర్ రీట్వీట్ చేశారు. విద్యార్థుల్లోకి టెక్నాలజీని చేరవేయడంలో ఇది ఒక ముందడుగు అని శైలేష్ రెడ్డి పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో విద్యార్థులు తమ చదువును అభ్యసించేందుకు టీ శాట్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన స్పష్టం చేశారు.





కేవలం కాయలు మాగితేనే
ఘుమ ఘుమలాడే
మధుర రసాల పండ్లైనపుడూ...!
ఆ పండ్లనే మాగపెడితే
మరెంతో గొప్ప ఫలాలు రావా... అనీ
తలంచాడో ఓ అత్యాశా ప్రబుద్ధుడు !!
జీవన వైశాల్యంలో ఏదైనా సరే
మొదటి సగం
ముందుకు పోయే వక్రరేఖ,
మరో సగం తిరోగమన వక్రరేఖ !
రెండూ కలిసి జీవిత చక్రం !!

-మునిమడుగుల రాజారావు.
7013577140.

బాల గేయం

## మూసీనది

ముచికుందుని మునిపేరున
శుచిగా వెలసిన "మూసీ"
ముచ్చటగా ఎన్నాళ్లకు
ఇచ్చోటను పారుతోంది!
గండిపేట నిండిపోగ
గంగలాగ పారుతోంది!
॥ము॥

దశాబ్దాల తరబడిగా
దండిగాను పేరుకున్న
మూసీనది కంపునెల్ల
'ఈసీ' యని నెట్టుతోంది!

మూసియనగ మహానగర
మురికి కాలువన్న పేరు
మాసిపోవగా నిర్మల
మహానదిగ పారుతోంది
॥ము॥

వాయుగుండ వర్షధార
సాయంతో ఉప్పొంగుతు
రాదారుల ముంచెత్తుతు
గోదారిగ పారుతోంది!
మున్నెన్నడు కాంచనట్టి
మున్నెరుగ పారుతోంది!
రాకపోకలన్ని నిలిపి
రాజసంగ పారుతోంది!



– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## బాల కెరటాలు

బాలల్లారా...పిల్లల్లారా
భావి భారత పౌరుల్లారా
విరిసే పూల మొగ్గల్లారా
ఆకాశంలో తారల్లారా
స్వేచ్ఛగా ఎగిరే పక్షుల్లారా

గాంధీ బోసి నవ్వుల్లారా
చాచా నవ్వుల పువ్వుల్లారా
సర్వేపల్లికి వారసులారా
ఆజాద్ ఆశయ సాధకులారా
భగత్ విప్లవ జ్యోతుల్లారా

అల్లూరి నిప్పు కణికల్లారా
గురజాడ అడుగు జాడల్లారా
వీరేశం అభ్యుదయ భావాల్లారా
వివేకుడి చైతన్య దీపికల్లారా
అబ్దుల్ కలాం కలల కూనల్లారా

ఉప్పెనలా...ఉరకండి
మెరుపుల్లా మెరవండి
కెరటాల్లా.. కదలండి
రేపటి ఉజ్వల భారత్ కోసం



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## విగతజీవులై పోతున్నారు

అతడొక వెలుగులు పంచే సూర్య కిరణం.
అతడి జీవితంలో వెలుతురు కరువై...
చిమ్మచీకట్లు కమ్ముకున్న జీవితాన్ని చీదరించుకొని...
చితిమంటలను ఎక్కుతున్నాడు.
అతడొక సమాజానికి మార్గదర్శి.
జవాబుదారై దారి చూపడం తప్ప
ప్రశ్నించడం ఎరగని వాడు.
విద్యాబుద్ధులతో విలువైన సంపదను అందించేవాడే తప్ప
అవినీతి మరకలు అంటని వాడు.
ఇపుడు కన్న పిల్లాపాపలను
సాకడానికి చిల్లిగవ్వలేక సావు సంకెళ్లను వెతుకుతున్నాడు.
విధి వెక్కిరించి వింతనాటకం ఆడుతుంటే,
ఆకలి కేకల దోబూచులాటలో ఆయువు విడుస్తున్నాడు.
బతుకు బండిని లాగలేకవిలువైన జీవితాలను
నెలరాల్చుకుంటున్నారు.
సరస్వతి పుత్రులై అక్షర సంపదను అందించి
తలరాతలను మార్చిన గురువు
బతుకు నేడుగుడ్డి దీపమై పోయే....
గురువే బ్రహ్మ,గురువే విష్ణువు
గురువే మహేశ్వరుడు అన్న మాట
మరిచిపోయిందేమో ఈ సమాజం...?



-అశోక్ గోనె
9441317361

## పట్టుదల ఉంటే కానిది లేదు

రామాపురంలో రామయ్య లక్ష్మమ్మ దంపతులు ఉండేవారు. వీరికి ఏకైక సంతానం రవి. ఈ దంపతులు ఇంట్లోనే కిరాణం కొట్టు పెట్టుకుని జీవనం కొనసాగించేవారు. ఒక్కగానొక్క కొడుకని గారాబనీ చేసేవారు. ఇది అలుసుగా తీసుకొని రవి బడికి వెళ్ళకుండా స్నేహితులతో అల్లరి చిల్లరగా తిరిగే వాడు. ఒకరోజు కాంతం మాస్టారు రామయ్య ఇంటికి వచ్చాడు . ఆ సమయంలో రవి ఇంట్లో లేడు . మాస్టార్ గారు తమ ఇంటికి వచ్చినందుకు సంతోషించి ,మీరు రావడానికి గల కారణాలను అడిగారు. మాస్టర్ గారు రవి బడికి రావడం లేదని, హోం వర్క్ చేయడం లేదని, రేపటినుండి బడికి పంపించమని చెప్పి వెళ్లిపోయారు .రవిని గారాబం చేయడం వల్లే ఇలా అయ్యాడని ఎంతో బాధపడ్డారు ఆ దంపతులు. రాత్రి భోజనాలయ్యాక రామయ్య రవి ని పిలిచి మాస్టర్ గారు ఇంటికి వచ్చిన సంగతి చెప్పి బుద్ధిగా చదువుకోమని సుతిమెత్తగా మందలించాడు .అయినా రవి లో మార్పు రాలేదు.

ఒకరోజు రామయ్య దంపతులు పట్నం నుండి కిరాణం సరుకులు తీసుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు . రవికి ఇది ఊహించని పరిణామం. అనాథ గా మారిన రవి ఇంట్లో నుండి బయటకు రావడం లేదు. కాంతం మాస్టారు రవి ని ఓదార్చి ,ధైర్యం చెప్పి మీ తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలని హితవు చెప్పారు నువ్వు బాగా చదివి ప్రయోజకుడివి అవ్వాలనేది వారి కోరిక. మాస్టర్ గారి మాటల్లో రవిలో మార్పులు తెచ్చాయి. మరుసటి రోజు నుండి ప్రతి రోజూ పాఠశాలకు వెళుతూ బాగా చదివి మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. పదవ తరగతిలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొంది కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నా డు.

నీతి: నిరంతర శ్రమ పట్టుదల విజయానికి సోపానం



-యాదవరనీ రేవంత్ గౌడ్
7 వ తరగతి. శ్రీ చైతన్య స్కూల్
సిద్దిపేట. 9441762105

# బాల వికాసం

ప్రసిద్ధ బాలల రచయిత
డా॥ వి.ఆర్.శర్మ కలం నుండిజాలువారిన
ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక
కాల్పనిక నవల 'బాలవర్ధన్'.
ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

బాలవర్ధన్ అడిగిన దానికి కులకర్ణి మొదట అసలే ఒప్పుకోలేదు. "ప్లీజ్ తాతా! మాఅమ్మానాన్నలకు సంబంధించిన చిన్న ఆధారమేదో ఇన్నాళ్ళకు దొరికింది. ఓ సారి వెళ్ళి మాంధాత గారిని కలిసి, మాట్లాడితే మరేమైనా తెలియవచ్చునని మనసు చెప్తోంది."

"ఫోన్‌లో మాట్లాడొచ్చు కదా? ఎంతసేపైనా మాట్లాడు. అన్ని విషయాలూ తెలుసుకో."

"ప్లీజ్ తాతా! ఫోన్‌లో మాట్లాడితే మాట మాత్రమే తెలుస్తుంది. ఆయన ఫీలింగ్, ఆత్మ, ఉద్దేశ్యం,

అవగాహన, ఆలోచనల వంటివి నాకు తెలుసుకోవాలని ఉంది. అది ఫోన్ ద్వార సాధ్యం కాదు. ప్లీజ్ తాతా ఒప్పుకో! మీ అమ్మాయి కదా! మీకు మాత్రం తెలుసుకోవాలని ఆత్రత ఉండదా!" బాలవర్ధన్ బతిమాలుతూ కన్విన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నాడు.

"నువ్వు పిల్లవాడివి. నువ్వేంచేయగలవు? నీకేదైనా ఐతే ?...."

"నేనేదో చేయడానికి వెళ్ళట్లేదు. కేవలం తెలుసుకోవడానికే వెళ్తున్నాను తాతా! పిల్లలు అనే తేలిక భావం మీకు కూడానా తాతా! పదమూడేళ్ళ మాలవత్ పూర్ణ అత్యంత ప్రమాదకరమైన ఎవరెస్టు శిఖరం ఎక్కింది కదా. మలాలా యూసఫ్‌జాయ్ పన్నెండేళ్ళ వయస్సులోనే ఉగ్రవాదుల తూటాలను ఎదిరించి గెలిచింది. పదమూడేళ్ళ గ్రేటా థున్‌బెర్గ్ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కోసం ఎలా ఉద్యమాలు



చేస్తున్నదో మీకు తెలియదా!? ఈ నాటి చిన్న చిన్న పిల్లలు కూడా ఎన్నో విజయాలు సాధిస్తున్నారు."

"నిజమే!" శ్రీదత్త వాళ్ల మాటల్లో కలుగ జేసుకుంటూ అంది. "పూర్వం కూడా పిల్లలు ఎన్నో గొప్ప గొప్ప పనులు చేశారు కదండి. బాలకృష్ణుడు ఎన్ని సాహసాలు చేయలేదు! లవకుశులూ, ప్రహ్లాదుడూ, ధృవుడూ, మార్కండేయుడూ, శాలివాహనుడూ, అభిమన్యుడూ, బాలచంద్రుడూ వీళ్ళంతా పిల్లలుగానే గొప్పగొప్ప పనులూ, సాహసాలూ చేశారు కదా! ఏం ఫరవా లేదు! వెళ్ళి రానివ్వండి. మన అమ్మాయి, అల్లుని గురించి ఏమైనా తెలుస్తుందేమో చూద్దాం!" అని భర్త వైపు ఒప్పుకొమ్మన్నట్టుగా చూసింది.

"సరే!" అన్నాడు కులకర్ణి చివరికి ఒప్పుకుంటున్నట్టుగా. కానీ నిన్ను ఒక్కణ్ణి పంపించలేను. నేను కూడా రావాలంటే నాకు మరో పది రోజులపాటు అఫీషియల్ టూర్లున్నాయ్. నేను వాటికి వెళ్ళక తప్పదు." అని, కొంత సేపు ఆలోచించి తరువాత చెప్పాడు "రామును కూడా నీతో తీసుకెళ్ళు. కారులోనే వెళ్లి రండి. రాము కారును చాలా బాగా జాగ్రత్తగా నడుపుతాడు. తనది సేఫ్ డ్రైవింగ్. రాత్రి ప్రయాణం వద్దు. తినేసి, మధ్యాహ్నం బయల్దేరితే సాయంత్రంకల్లా అక్కడికి చేరుకోవచ్చు. నేను కూడా ఓసారి మాంధాత గారితో మాట్లాడుతాను" అంటూ తన ఫోన్ బాలవర్ధన్‌కు ఇస్తూ "మాంధాత గారి నంబర్ ఫీడ్‌చేసి ఇవ్వు" అన్నాడు.

మాంధాతతో కొంతసేపు మాట్లాడి ఫోన్ కట్ చేసి, శ్రీదత్త వైపు చూస్తూ చెప్పాడు "మాంధాత అమ్మా నాన్నలు చిత్తూరు వాళ్ళట. వ్యాపారం కోసం ఎప్పుడో నాగ్‌పూర్ వెళ్ళి స్థిరపడ్డారట. అంటే మాంధాత మన తెలుగువాడే. చాలా దెగ్గరితనంగా మాట్లాడాడు. వీళ్ళకు ఫోన్‌లో లొకేషన్ పంపించి పికప్ చేసుకుంటానన్నాడు. నాకు పెద్ద భారం దిగిపోయినట్టయింది. కానీ..."

"మళ్ళీ ఈ కానీ ఏమిటోనని బాలవర్ధన్ సందేహిస్తుండగానే అన్నాడు కులకర్ణి "నాగరత్న, సూర్యవర్ధన్‌లకు కూడా చెప్పాలి. వాళ్ళ అంగీకారం కూడా తీసుకోవాలి" అని, నాగరత్నానికి ఫోన్ చేశాడు. విషయం కూల్‌గా, కన్విన్స్ చేస్తూ చెప్పాడు. "మీకు సరైనదిగా అనిపిస్తే పంపించండి నాన్నా!" అంది నాగరత్న. ఆమె పక్కనే

ఉండి వీళ్ళ మాటలు వింటున్న సూర్యవర్ధన్ కూడా ఒప్పుకున్నాడు. బాలవర్ధన్‌తో మాట్లాడుతూ "నీ పరీక్షలు దగ్గర పడుతున్నాయి కదా" అన్నాడు. ఫరవాలేదు నాన్నా! నేను కవర్ చేసుకుంటాను." అంటూ భరోసా ఇచ్చాడు బాలవర్ధన్. చివరికి "జాగ్రత్తగా వెళ్ళిరండి. తాతయ్య దగ్గర అవసరమైన డబ్బులు తీసుకెళ్ళు" అని చెప్పారు వాళ్ళు.

14

వాళ్ళు నాగ్‌పూర్ చేరుకునే సరికి రాత్రి ఎనిమిది కావచ్చింది. మాంధాత షేర్ చేసిన లొకేషన్‌లో చూసుకుంటూ, సందేహం వచ్చినప్పుడు ఫోన్ చేసి అడుగుతూ వచ్చారు. మాంధాత నివాసం యూనివర్సిటీ క్యాంపస్‌కు దగ్గర్లోనే ఉంది.

ఎంతో స్నేహ పూర్వకంగా వాళ్ళను రిసివ్ చేసుకున్నాడు మాధాత. "ముందు స్నానాలు చేసి రిలాక్స్ కండి," అంటూ రెండు బాత్‌రూములు చూపించాడు. వాళ్ళు ఉండడానికి చూపించిన గదిలో తమ బ్యాగులు పెట్టుకుని, స్నానాలు పూర్తిచేసుకుని, నైట్ డ్రెస్‌లు మార్చుకొని హాల్‌లోకి వచ్చారు. వాళ్ళు వచ్చేసరికి డైనింగ్ హాల్‌లో డైనింగ్ టేబుల్‌మీద భోజనాలు ఏర్పాటు చేస్తున్న తన భార్యను వాళ్ళకు పరిచయం చేశాడు మాంధాత "ఈమె నర్మద, మా ఆవిడ" అంటూ. "మా కొడుకూ, కోడలూ, మనుమరాలూ, మనుమడూ న్యూయార్కులో ఉంటారు" అని కూడా చెప్పాడు.

వేడి వేడి చపాతీలు, అన్నం, ఆలుగడ్డ వేపుడు, టమాట పప్పు తింటూ "అమ్మా! చాలా అద్భుతంగా ఉన్నాయ్! మిమ్మల్ని బాగా కష్ట పెట్టాము ఈరోజు" అన్నారు వాళ్ళు."అయ్యో! ఈ మాత్రానికేనా. మాకోసం మేము ఎలాగూ చేసుకోవాలి. ఇందులో ప్రత్యేకంగా మీకోసం కష్ట పడ్డదేం లేదయ్యా!" అంటూ కొసరి కొసరి వడ్డించిందా తల్లి.

తినడం పూర్తి చేసిన తరువాత వాళ్ళు ముగ్గురూ హాల్లోకి వచ్చి సోఫాల్లో కూర్చున్నారు.

"నాకు ఆస్తమా, చాలా ఇబ్బంది పెట్టేది. మన డాక్టర్ గారిచ్చిన హోమియో మందులు, డాక్టర్ వెన్నెల గారి ఆయుర్వేద మందులు కలిపి వాడుతున్నాను. చాలా తగ్గినట్టు అనిపిస్తున్నది." అని వాళ్ళతో చెప్పాడు మాంధాత.

"ఇలా ఆ రెండు రకాల మందులు కలిపి వాడవచ్చా సర్?" సందేహం వ్యక్తం చేశాడు రాము.

"ఆ...ఏం పర్లేదు. వాడుకోవచ్చని చెప్పారు ఆ డాక్టర్లిద్దరూ" అని చెప్పి, "అది సరే, బాలవర్ధన్! మీ అమ్మానాన్నల గురించి ఇన్నేళ్ళయినా ఏమీ తెలియలేదని రాజేశ్వర్ డాక్టర్‌గారు చెప్పారు" అన్నాడు ఆ సంభాషణకు ఉపోద్ఘాతంగా.

"ఔనంకుల్! ఏమీ తెలియలేదు. వాళ్ళు ఏమైపోయారోననే ఆలోచన నన్ను నిలువనియ్యడం లేదు. అందుకే వాళ్ళ గురించి ఏచిన్న సమాచారమైనా తెలుస్తుందేమో అనే ఆశతో మీ దగ్గరికి వచ్చామంకుల్.

**బాలవర్ధన్**

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

9




మా నాన్న తన డైరీలో మీ పేరే రాసుకున్నారంకుల్. దాన్ని ఈమధ్యనే నేను చూశాను. లక్కీగా, డాక్టర్ రాజేశ్వర్ అంకుల్ ద్వారా మీ అడ్రస్ దొరికింది" అంటూ తమ రాకకు కారణాన్ని చెప్పాడు బాలవర్ధన్.

"దాదాపు పదిహేనేళ్ళ కిందటి సంగతి అది. నేను మరిచేపోయాను దాన్ని. మొన్న డాక్టర్ గారితో మాట్లాడుతుండగా ఆదిలాబాద్ అంటే హఠాత్తుగా గుర్తుకు వచ్చింది. డాక్టరు గారితో ఆ సంగతి చెప్పాను."

"మా నాన్న ఏమైనా చెప్పారా అంకుల్?! ఎక్కడికి వెళ్ళాలనుకు న్నారో...అలాంటి దేమైనా?..."

"అలాంటిదేం చెప్పలేదు. కానీ మాయ అనే వాడి గురించి ప్రచారంలో ఉన్న కథల గురించి అడిగాడు. అవి వాస్తవాలా కట్టు కథలా అని అడిగాడు. మాయ అనే వాడు వాస్తవమా కల్పితమా అని అడిగాడు. ఒకవేళ

ఉంటే, వాడుండే పాతాళలోకం లోని మాయాదుర్గం లోనికి వెళ్ళే దారి ఏదని అడిగాడు. బహుశా అక్కడికి వెళ్ళాలని కానీ భావించాడేమో!" ఊహిస్తున్నట్టు చెప్పాడు మాంధాత.

"కానీ, నేను అలాంటిదేమీ లేదని చెప్పాను. అవన్నీ కట్టుకథలని నా అభిప్రాయమని చెప్పాను. కానీ మీనాన్న జనంలో ప్రచారంలో ఉన్న సంగతులు చెప్పమని అడిగాడు."

బాలవర్ధన్‌తో బాటు రాము, నర్మద మాంధాత మాటల్ని శ్రద్ధగా వింటున్నారు.

"మన దేశానికి దాదాపు నట్టనడుమ వింధ్యా, సాత్పూరా పర్వతాలు తూర్పు పడమరలుగా వ్యాపించి ఉన్నాయ్. అవి అత్యంత ప్రాచీన కాలంలో లక్షల సంవత్సరాలకు పూర్వం ఏర్పడిన పర్వతాలు . హిమాలయాలకంటే ఎంతో ప్రాచీనమైన పర్వతాలు. భారత,రామాయణాల వంటి పురాణ ఇతిహాసాల్లో వాటి ప్రసక్తి కనిపిస్తుంది. మన దేశంలోని నదులన్నీ పడమర నుండి తూర్పుకు ప్రవహిస్తే, ఈ పర్వతాల నడుమ ప్రవహించే నర్మద, తపతి వంటి నదులు తూర్పు నుంచి పడమరకు ప్రవహిస్తాయి."

"ఔను!" మధ్యలో కల్పించుకుంటూ మాట్లాడింది నర్మద."ఆ నర్మదా నది పుట్టిన చోట అమర్‌కంటక్ అనే పుణ్యతీర్థం ఉందట. అలాగే 'అగస్త్యుడు రాడు, వింధ్యుడు లేవడు' అనే సామెత ఉంది. దానికి సంబంధించిన ఓ చిత్రమైన కథ కూడా ఉంది."

"నిజమే!" ఔనన్నట్టు తలఊపి, మళ్ళీ తాను చెప్పడం కొనసాగించాడు మాంధాత. "ఆ ప్రాంతాల్లో చరిత్రలోనూ, కథల్లోనూ ప్రసిద్ధమైన ఉజ్జయిని లాంటి క్షేత్రాలూ, నగరాలూ ఉన్నాయ్. ఆ సాత్పూరా పర్వతాల అరణ్యాలు చీమలు దూరని చిట్టడవులు. కాకులు దూరని కారవులు, దుర్గమాలు. అనేక అద్భుతాలకూ, రహస్యాలకూ పుట్టినిళ్ళు!

అలాంటి చోట, మధ్యప్రదేశ్‌లో ఇక్కడికి సుమారు నూటయాభై కిలోమీటర్ల దూరంలో 'చిన్ద్వర' అనే జిల్లా ఉంటుంది. ఆ జిల్లాలో జిల్లా కేంద్రానికి సుమారు యాభై కిలోమీటర్ల దూరంలో 'తామియా' అనే ఓ హిల్ స్టేషన్ ఉంది. చుట్టూ నిటారుగా ఉన్న కొండలు, దట్టమైన అడవులు, విశాలమైన లోయ...ఇప్పుడు ఇదో అందమైన పర్యాటక స్థలం. సముద్ర మట్టానికి మూడువేల ఏడువందల అరవై అయిదు అడుగుల ఎత్తున ఉన్న ఆ తామియా కొండ శిఖరాలనుంచి కనిపించే ఆ సూర్యాస్తమయ, సూర్యోదయ దృశ్యాలు చూడడం అది ఓ అనిర్వచనీయమైన, అలౌకిక అనుభవం! దానితోబాటే మన మనసులను తనలోకి లాక్కునే అక్కడి పాతాళ్ కోట్ లోయ!.." అందరినీ తన మాటలతో ఆ ప్రకృతి పారవశ్యంలోకి తీసుకొని పోయాడు మాంధాత. కొన్ని క్షణాలు ఆగి మళ్ళీ చెప్పాడు "అక్కడ్నుంచే ఉందట పాతాళ లోకానికి మార్గం!"

"పాతాళ లోకానికి మార్గమా!?" వింటున్న బాలవర్ధన్, రాము కళ్ళల్లో నమ్మలేని ఆశ్చర్యం! సంభ్రమం!

"మన పురాణ కథల్లో, మన జానపద కథల్లో పాతాళ లోకం గురించి ఎన్నో కథలు ఉన్నాయి. అలాంటి లోకం ఉందని గ్రీకు, రోమన్, ఈజిప్ట్ వంటి నాగరికథలకు సంబంధించిన మైథాలజీలో కూడా ఉంది. పాశ్చాత్య ప్రాచీన సాహిత్యంలో కథలున్నాయ్. ఆ పాతాళ లోకానికి వెళ్ళే మార్గాలు మన దేశంలో నాలుగు ప్రాంతాల్లో ఉన్నాయని ప్రచారంలో ఉంది. వాటిలో ముఖ్యమైన మార్గం పాతాళ్ కోట్ లోయ లోంచి ఉందని జనం విశ్వసిస్తారు." చెప్పడం ఆపి, లేచి నీళ్ళుతాగి వచ్చాడు మాంధాత.

అది ఓ హిస్టరీ ప్రొఫెసర్, ఓ తెలుగు లెక్చరర్ కలిసి



చెప్తున్న పాఠంలా వింటున్నారు వాళ్ళు. రామాయణంలో రావణుని సోదరుడు అహిరావణుడు రామ లక్ష్మణులను ఈ మార్గంనుంచే పాతాళానికి ఎత్తుకుపోతే హనుమంతుడు ఈ మార్గం నుంచే వెళ్ళి, విడిపించి తెచ్చాడని ఓ కథ ఉంది. రావణుని కొడుకు మేఘనాథుడు శివుణ్ణి ఇక్కడే పూజించి యుద్ధానికి వెళ్ళేవాడని ఓ కథ ఉంది. ఇవన్నీ తరాలనుంచి ప్రజలలో ప్రచారంలో ఉన్న కథలు. ఆధునిక కాలంలో బ్రిటీషు వాళ్ళకు దొరకకుండా ఒక మరాఠా రాజు తన సైన్యంతో ఈ లోయలో మహదేవ్ గుహ దగ్గర దాగి ఉన్నాడట.

"అలాంటి కథల పునాదిగా ఈ ఆధునిక కాలంలో పుట్టి ప్రచారానికి వచ్చిన కథే ఈ 'మాయ' అనే వాడి కథ! నిజానికి ఈ మాయ అనే వాడి పేరే ఆప్రాంతం వాళ్ళకు తెలియదు. ఈ కథ అక్కడి పాతకాలపు వాళ్ళకు అసలే తెలియదు. ఈ కథకూ ఆ చోటికీ ఎలాంటి సంబంధం లేదు. రెండువేల ఒకటి తరువాత ఎవరో ఈ నాగరిక ప్రపంచానికి చెందిన వాళ్ళు పుట్టించి, ప్రచారం చేసిన కథ ఇది. పాతాళ లోకం ఉందని, పాతాళ్ కోట్ నుంచి పాతాళానికి మార్గం ఉండేదనే కొందరి నమ్మకాలను ఆధారం చేసుకొని ఎవరో అల్లిన అభూత కల్పన అది. బహుశా హిమాలయాల్లో కనిపించే యతి కథకు ఇది మరో రూపం కావచ్చు. నెట్లూ, యూట్యూబులు ల్లాంటివి ఈకథకు రకరకాల కల్పనలు, మసాలాలు కలిపి మరింత ఊపిరి పోశాయ్. నిజానికి పాతాళ్ అనే సంస్కృత పదానికి లోతైనది అనే అర్థం ఉంది. అది లోతైన ప్రాంతం అని అర్థం చేసుకోవాలి అంతే.

ఆ పాతల్ కోట్ లోయలోంచి నాగ్‌పూర్, చిన్ద్వర, ఇంకా అనేక ప్రాంతాలకు ఎన్నో రహస్య సొరంగ మార్గాలు ఉండేవని, భూకంపాల వల్ల, మరికొన్ని మనకు తెలియని కారణాల వల్ల అవి ఎవరికీ కనిపించకుండా మూసుకొని

**పదమూడేళ్ళ మాలవత్ పూర్ణ అత్యంత ప్రమాదకరమైన ఎవరెస్టు శిఖరం ఎక్కింది కదా.**

**మలాలా యూసఫ్‌జాయ్ పన్నెండేళ్ళ వయస్సులోనే ఉగ్రవాదుల తూటాలను ఎదిరించి గెలిచింది.**

**పదమూడేళ్ళ గ్రేటా థున్‌బెర్గ్ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కోసం ఎలా ఉద్యమాలు చేస్తున్నదో మీకు తెలియదా!?**

పోయాయని చెప్పుకుంటారు. మహదేవ్ గుహ ఉన్న ప్రాంతాలలోనే పాతాళానికి మార్గం పూర్వం ఉండేదని జనం చెప్పుకుంటారు...

మీ నాన్న ఆరోజు నన్ను ఆ మాయ అనే వాడి గురించీ, పాతాళంలో వాడుండే పాతాళ దుర్గం గురించీ ఒకటికి రెండు సార్లు అడిగి చెప్పించుకున్నాడు. అవన్నీ కల్పనలే అని, ఈ కథ అక్కడి వాళ్లకు తెలియదని, అక్కడివాళ్ళు ఏమాత్రం నమ్మరని, నేను ఎంత చెప్పినా వినిపించుకోకుండా... బహుశా ఆ కథలే నిజమని నమ్మి అక్కడికే వెళ్ళాలనుకున్నాడేమో! నాకు అలా అనిపిస్తోంది. అక్కడికి వెళ్ళి, ఆ అడవిలో..." తరువాత విషయం ఊహించడం ఇబ్బందిగా అనిపించి చెప్పడం ఆపేశాడు మాంధాత.

వాళ్ళ నడుమ అక్కడ కొన్ని క్షణాలు నిశ్శబ్దం కమ్ముకుంది....

"అంకుల్ !" అంటూ ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఏదో అడగబోతున్నట్టు మాంధాత ముఖంలోకి చూస్తూ ఆగాడు బాలవర్ధన్. "చెప్పు!" తల ఊపాడు మాంధాత.

"ఇప్పుడు కూడా ఆ ప్రాంతానికి వెళ్ళడం సాధ్యం కాదా? ఇప్పుడు ఆ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చారని అన్నారుగా?" ప్రశ్నించాడు బాలవర్ధన్.

"తామియా హిల్ స్టేషన్‌కు వెళ్ళొచ్చు. అక్కడ కొన్ని వ్యూ పాయింట్లు చూడ్డానికి అవకాశాలు కల్పించారు. అక్కడి అడవిలో కొన్ని ప్రాంతాలు టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్నాయి. కనుక కొన్ని ప్రాంతాలకు అధికారిక అనుమతులు ఉంటేనే వెళ్ళే అవకాశం ఉంటుంది. ఆ లోయలో కొన్ని ఆదివాసీ గ్రామాలున్నాయి, చాలా చిన్నవి. సుమారు ఓ ఎనిమిది వరకు ఉంటాయేమో! వాటిలో చివరి ఊరి వరకు మట్టి తోవ ఉంది. కారులో కొంత కష్టపడుతూ వెళ్ళి చూసి రావచ్చు."

"మహదేవ్ గుహ?"

"వెళ్ళి రావచ్చు! కానీ చాలా కష్టం. సుమారు నాలుగు వేల అడుగుల దూరం కిందికి వాలుగా దిగుతూ నడవాలి. కాలి బాటలో రాళ్ళూ రప్పలలో, అడవిలో జాగ్రత్తగా చాలా కష్టపడుతూ నడవాలి. జంతువుల భయం ఉండక పోయినా కొండెంగలు, పాములు ఉంటాయ్. పొదలూ, ఎగుడు దిగుళ్ళూ , చిన్న చిన్న లోయలూ, సెలయేళ్ళూ ఉంటాయి. తోవలో మంచినీళ్ళు కూడా దొరకవు. వెళ్ళి రావడానికి ఓ ఆరేడు గంటలు నడవాలి. కొత్తవాళ్ళు వెళితే అడవిలో తప్పిపోయే ప్రమాదం ఉంటుంది. కనుక ఓ గైడును తీసుకొని వెళ్ళాలి." అని చెప్పి, "కొంపదీసి నువ్వు అక్కడికి గానీ వెళ్ళాలని ఆలోచిస్తున్నావా?" అనుమానంగా అడిగాడు మాంధాత.

"ఇప్పుడు అలాగే అనిపిస్తోందంకుల్! మా నాన్న అక్కడికి గానీ వెళ్ళాడేమో అనే అనిపిస్తోంది. ఇప్పుడు ఇంకా అక్కడే ఉంటాడనుకునేంత మూర్ఖుణ్ణి కాదు. కానీ ఎందుకో అక్కడికి వెళ్ళి చూడాలనే ఓ బలమైన భావన. నామనసుకు మాత్రమే వినిపిస్తున్న ఏదో పిలుపు!...ఐనా, గతంలో లాగా ఇప్పుడు భయపడేలా లేదని, జాగ్రత్తగా ఉంటే వెళ్ళి చూసి రావచ్చని, అదో పర్యాటక ప్రదేశంగా మారిందని అన్నారుగా అంకుల్?" అన్నాడు బాలవర్ధన్ అక్కడికి వెళ్ళి తీరాలని నిర్ణయించుకున్నట్టు.

"కట్టుకథలను పక్కకు పెడితే చూడాల్సిన ప్రాకృతిక ప్రదేశమే అది. అనిర్వచనీయమైన ఆనందం, భయం ఏక కాలంలో కలిగించే భయద సౌందర్యసీమ అది. రామూ! నువ్వేమనుకుంటున్నావ్? వెళ్తారా? అక్కడికి?" అడిగాడు మాంధాత. రాముకూ వెళ్ళి రావాలనే ఉంది. ఏవో! తన మిత్రుడి గురించి ఏమైనా తెలుస్తుందేమో అనే చిన్న ఆశ. ఔనన్నట్టు తన ఊపాడు మాంధాత ప్రశ్నకు జవాబుగా.

"నేను రెండు సార్లు వెళ్ళొచ్చాను. అక్కడ జగన్నాథ్ అని నాకు తెలిసిన ఒకతను ఉన్నాడు. తామియా హిల్ స్టేషన్ లో ఓ మోటల్ నడుపుతున్నాడు. మీకు ఓ గది ఏర్పాటు చేయమని చెప్తాను. మీరూ మీ పెద్దవాళ్ళకు చెప్పండి. ఒంటి గంటకల్లా తినేసి మీరు బయలు దేరితే, సాయంత్రం కల్లా అక్కడికి చేరుకోవచ్చు. అక్కడ అద్భుతమైన సూర్యాస్తమయాన్ని చూడొచ్చు. ఓకేనా?" అని వాళ్ళ సమాధానం కోసం ఆగాడు. వాళ్ళు సరే అన్నట్టు తల ఆడించగానే తన ఫోన్ తీసుకుని జగన్నాథ్‌తో మాట్లాడాడు.

మధ్యాహ్నం ఒంటిగంటకల్లా వాళ్ళు నాగ్‌పూర్ దాటుతున్నారు...

(సశేషం..)



-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

## గుడిసె మురిసిన వేళ.!

నా విద్యార్థులంతా
మీరు మా అయ్య లెక్క అంటరు.!

గట్లనే గీ అమ్మాయి గూడ...నా బిడ్డ
బిడ్డంటే బడి గలిపిన బంధం.!

ఆరు నుండి పది దాక
నా చేతుల్ల మెదిలింది
ఆల్ రౌండర్ ప్రతిభతో
అదర గొట్టేది..

మా ఇంటికత్తరా....
మీరు అని నారాజు పడేది.

ఎందుకురాను అని
గావురంగా ఎక్కిరించే వాడిని.

ఓరోజు....
చెప్పక చెయ్యకనే వాల్లింటికి పోయిన...

సారు అచ్చిండన్న సంబురంతో...
స్వాగతం పలికింది.

చేతుల అంతో ఇంతో కొత్తలున్న
మోతుబరుల ఇండ్ల నడుమ
పిట్టగూడు లెక్క
వాల్ల గడ్డి గుడెసె.!

అలికి ముగ్గు బెట్టిన
ఒక్కటే అర్ర
నులక మంచం వాల్చి
కూసోండి సార్ అంది.

ఊసిపోతున్న దర్వాజ
లేసిపోతున్న పైకప్పు
ఉన్న ఆ ఒక్క అర్రలనే
తల్లైదుగురి పడక.!

మూలకున్న కుండల
చెంబునిండ నీళ్లు ముంచి
చేతికందించి తాగమంది.

మినరల్ నీళ్ళకలవాటు పడ్డ పానానికి
మట్టికుండ చల్లదనం తడి
చాన్నాల్లకు తగిలింది.!

పాఠం జెప్పేటప్పుడు
వేదికల మీద మాట్లాడే టప్పుడో
ఆగుడిసె గురించి కదిపేటోన్ని.

ఈ అయిదేండ్లల్ల
వర్షం కురవకుండా
వరుకు కప్పుకున్నది గాని
దాని రూపు రేఖ మారలే.

ఇయ్యాల ఆ గుడిసె
మురిసి పోతాంది.!
తన గుడ్డి దీపం కింద చదివి
బాసర ట్రిబుల్ ఐటీలో
సీటుకొట్టిన బిడ్డ"మానస"ను చూసి.

డబుల్ బెడ్రూం ఓట్ల గుర్రమా
ఓపారి గీ గడ్డి గుడెసెను జర చూడు.!

*(గడ్డి గుడిసెలో గుడ్డి దీపం కింద చదివి ట్రిపుల్ ఐటి సీటు పొందిన నా స్టూడెంట్ నిజ జీవన చిత్రం)*



-చిలువేరు అశోక్
9492443141

## రాత - గీత

### పొలిటికల్ ఎకానమీ

గ్లోబల్ విలేజీలో
ఐ.ఎమ్.ఎఫ్.
అప్పుల అంగడి
భారత 'రాజకీయ'
అభివృద్ధి గంపలో
కరిమింగిన వెలగ ఫం(పం)డు



### బడ్జెట్



గరీబోని గారడీ చూసి
గలగలా నవ్వా.. కాసేపు!
అసెంబ్లీలో అంకెల గారడీ చూసి
అయోమయంలో పడ్డా.. ఎంతోసేపు!!



రాత–శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత–వర్చస్వి

## యువతరమా! ఒక్కసారి...

అబద్ధాల గాజు మేడలో నివిశిస్తూ
సత్యమనే రాయి ఎటునుంచి తగిలి
అద్దం బద్దలౌతుందోనని నిత్యం శంకిస్తూ
'ఇన్ సెక్యూర్డ్'గా బ్రతుకుతున్నారు!

లేని సుగుణాల గంధాన్ని పైపైన అద్దుకుని
నేను ప్రత్యేకమనే 'ఇల్యూషన్'లో విహరిస్తూ
అందచందాలను "మేకప్" మందంతో కాలుస్తూ
"లుక్ కల్చర్"ను నమ్ముకుంటున్నారు!

మానవతా వృక్షం పై నుంచి మకాం మార్చిన పక్షులై
కృతకమైన హావభావాల గుత్తేదారులై
మాటల్ని, నవ్వుల్ని పెదవులకే పరిమితం చేస్తూ
"షో ఆఫ్"లతో కాలం గడుపుతున్నారు!

సుఖాల ఎండ మావుల వెంట తిరిగి తిరిగి వేసారి.
సునాయాస ధనార్జనకి పథకాల పాచికలు విసురుతూ
తలచిందే జరగాలని అహంతో హూంకరిస్తూ
'సెల్ఫిష్‌నెస్'కి 'మ్యానిఫెస్టేషన్'గా జీవిస్తున్నారు!

వరద వంటి యవ్వనం శాశ్వతమని భ్రమిస్తూ
ఓటమి ఒత్తిడికి తాళలేక ప్రాణాల్నీ అర్పిస్తూ
తప్పుల్ని తెలివిగా ఇతరులపై తోసేస్తూ
వ్యసనాలను సైతం "ప్రిస్టేజ్ సింబల్'గా మారుస్తున్నారు!

ఒక్కసారి తప్పిదాన్ని ఒప్పుకుని ప్రశాంతత నొందండి
ఒక్కసారి నిజం చెప్పి 'గిల్టీనెస్' నుండి ముక్తులవండి
ఒక్కసారి ధైర్యంగా భయాల కెదురొడ్డి నిలవండి
ఒక్కసారి "డ్రామా'ల నొదిలి నిజాయితీ రుచి చూడండి!

ఒక్కసారి క్షమిస్తే కలిగే తృప్తి ననుభవించండి
ఒక్కసారి పెద్దల మాటల చద్దన్నం మూట విప్పి తినండి
ఒక్కసారి నిన్నటి తరం త్యాగాల నర్థం చేసుకోండి
ఒక్కసారి మన జాతి "ఫిలాసఫీ"ని ఒంట బట్టించుకోండి!

ఒక్కసారి వెనక్కెళ్ళి మన సంస్కృతీ వేళ్ళకు నీళ్ళు పోయండి
ఒక్కసారి మనిషిదనపు తత్వాల సారాన్ని మీలోకి ఒంపుకోండి
ఒక్కసారి కరుణపొంగే గంగానదులై ప్రవహించండి
ఒక్కసారి 'హ్యూమలియేషన్' విడిచి
హ్యూమక్స్‌గా వ్యవహరించండి
యువతరమా! ఒక్కసారి.. ఒకే ఒక్కసారి..



– ఎస్. కాశింబి
సెల్: 90522 16044

## నగర నిర్వేదం...

నగరమంటే
కొత్త నిర్వచనాలు వెతకాలిప్పుడు.....!
నగరమంటే
ఏరులైపారే కన్నీటివరద....
నగరం
ఎంత తోడిపోసినా వొడువని
కన్నీళ్ళ వలపోత....
మునిగి పోయిన
ఇసిరెలు చూసి ఏడవడం కాదు....
నిండా మునిగిన బతుకులను
అద్దద్దుల బట్టి తెచ్చే
పాతాళ గరిగెలు కావాలిప్పుడు....
కొట్టుకుపోతున్న భవిష్యత్తును
గట్టుకుచేర్చే సారథి కావాలిప్పుడు.....
నగరమెందుకు
ఒంటరిదయిందో
చెప్పగలిగిన 'కాలజ్ఞాని' కావాలిప్పుడు....
సౌందర్యలేపనాలతో
మభ్యపెట్టడంకాదు....
సహజ గాంభీర్యాన్ని కోల్పోయిన
నగరాన్ని వెతికి తీసుకురావాలిప్పుడు....
విలాసాలతో విలసిల్లే నగరం
విలాపాలకుగల
'నగ్న సత్యాలు' కావాలిప్పుడు...
నగరం గుండెమీద
'మెట్రోపాలిటన్' పచ్చబొట్టును
వికృతంగా మార్చిందెవరో
కనిపెట్టాలిప్పుడు.......

–డాక్టర్ మడత భాస్కర్
8919328582

## ఓ సైనికా వందనం

ఓ వీర జవాను
నువ్వో చైతన్య దీప్తివి
మా గుండెలు వరదలై పొంగినవి
నరనరాల్లో జీర్ణించుకున్న
శాంతి క్రాంతి మదురూహల
భారతీయ స్వప్నానివి, తత్వానివి
విశ్వాసంగ మాటలు నిశ్వాసించావు
దేశ రక్షణకు తాపత్రయ పడ్డావు
పెను చీకట్లో నాగు పామై
కాటు వేయ వచ్చిన పీఢిరి గద్ధకు
బుద్ధి చెప్పిన గరత్మంతుడవు
భూ మాత సాక్షి గా బూడి దైనా
చిరంజీవివి నీవు.
నువ్వెప్పుడూ ఆకాశం లో
మెరుస్తున్న నక్షత్రానివి.
నీ మాటల తూటాలు
గాల్వాన్ లోయల్లో గరిజిస్తున్నవి
శయ్యక్ నదిలోనీ నీడ శత్రువుకు
సింహ స్వప్నమైంది.
మహారాణప్రతాపుని వీరాశ్వం
చేతక్ ధీరత్వానివి నీవు.
పార్థుని పాశుపతాస్త్రం నీవు.
శాంతి లో రగులుతున్న బడబాగ్నివి
నిఘంటువులు చెప్పని
నిస్వార్థ త్యాగధనుడవు
దుఃఖం ఎంత ముంచుకొచ్చినా
మా సంతోషానివి నీవు
దేశ రక్షణ కవచానివి నీవు
ఓ సైనికా నీకు సదా వందనం.



– పి.బక్కారెడ్డి
9705315250

## క'న్నీటి' సుడిగుండాలు

రోజుల తరబడి కురిసే వాన
నెత్తుటి పైరులకు
నీటి ధారలతో ఉచ్చు పేనింది .

వ్యవసాయజూదం
ఏడాదంతా గుదిబండ.

పంట చేతిని తాకితే
చావును గెలిచిన వీరునోలె
సంబురమే.

కుండపోత వానకు
చేను చెరువయ్యింది
పంటకు ఊపిరాడకుండా

అలలు పాడెయై
పంటను భుజాన మోస్తున్నవి .

చెరువు పొలాలను
పరామర్శించిన నాయకులు
పత్రికలలో వరాలిచ్చి
చేతులు కడుగుకున్నరు.

బతుకు ఇంటి
చీకటి దర్వాజా నుండి
నడక నేర్వడం ఆరంభించినప్పటి నుండి
కష్టాల పోటీ రోజూ ఉండేదే !

సమస్యల గాయాలు
మనసుకు అతికినపుడు
నవ్వుల అయోడిన్ తో మాన్పుతూ

కన్నీటి సుడిగుండాలు రేగినప్పుడు
ఓదార్పు రుమాలుతో అద్దడం
కొత్తేమి కాదు.

జీవితంలోకి
సంతోష సూర్యుని ఆహ్వానించినా
అంధకార బందిఖానా లోనే
మగ్గిపోతున్నడు.

సహాయం
బలిసిన భూకామందులకు కాదు
సన్నకారు రైతులకు కావాలిప్పుడు.



–సముద్రాల.కుమారస్వామి
సెల్ :9705476138.

## నగరం మునిగింది

హైదరబాదు తడిసింది వాన నీటిలో
హైదరబాదు మునిగింది జోరు వానలో
గుండె గుబులయింది,గొంతు కలుక్కమంది
ఎక్కడివారక్కడే నిల్చుండిపోయి
ఎర్రిచూపులు చూసారు
వెర్రెత్తిన గంగపై చేసేదేదిలేక
దిక్కుతోచకున్నారు
ఇంటిలోన నీరు,ఇంటి బయటనీరు
రోడ్డుపైన నీరు రాటుదేలినట్లుగా
వీధివీధిలను, కాలనీలను
కనికరము లేకుండా ముంచెత్తేను.

మురిగినీరు మరిగిమరిగి
నిల్వగా నుండేను
కార్లు,స్కూటర్లు ,పచారు సామాన్లు
లెక్కలేకుండా వాననీట తేలేను
అడుగడుగు వేసుకుంటు,
నీటతేలినవాటిని బితుక్కుమంటు
మనుజులు తెచ్చేను
నిద్రలేని రాత్రుళ్లు నగరవాసులు గడిపేను

మనుజులు చేసే తప్పులకు
ప్రకృతి నవ్వింది
గాలి,నీరు,భూమి,ఆకాశము,అగ్ని
వాటి దారికి అడ్డు వేయకూడదండి
కాదంటే..
ఇప్పుడు వాన..రేపు అగ్ని,వాయువు
నగరం "గరమే–మనిషి జీవనం "రణమే"



– విశ్వనాథ నరసింహం
సెల్: 9490971589

## నగర జీవనం

ఆకాశం చిల్లుపడ్డాక
నగరం
ఇప్పుడొక కాగితప్పడవ!

నీళ్ళది
సందు దొరికితే చాలు
మెలికలు తిరిగే పాము నడక!

చెరువులు
పొట్ట చించుకుంటే
పడేది మన కాళ్ళమీదే!

పాపంలా
పేరుకపోయిన మురికి
గడప దాటి లోపలికొచ్చింది!

నగర జీవనం
ఎంత ప్రలోభ పెట్టినా
అది మేడిపండు ఛందమే!

నిందలెవరి మీద
మోపినా
బురద అంటింది మన పాదాలకే!

పల్లెను
గాలికొదిలేయడం మానేస్తే
నగరాలన్నీ రహదారి బంగ్లాలే!

దూరాలు
బతుకు భారాలు చెదిరి పోవాలంటే
పల్లె జీవనం కాంతివంతం కావాలి!!



–కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

## రైతుగోస

భారీ వర్షాలతో రైతన్న అతలాకుతలం
ఆరుగాలాల కష్టం కన్నీటి మయం
చేతికొచ్చిన పంట చేజారిపాయే
దిక్కుతోచని రైతు తల్లడిల్లే
పంట పెట్టుబడి అప్పుల మయం
పంటలన్నీ ఇప్పటికీ నీటి మయం
చెరువులు కాలువలన్నీ గండీల మయం
పంట పొలాలన్నీ
ఇసుకమయం
రైతు గోస వర్ణనాతీతం
రైతు గోడు పాలకులకు కనిపించదు
రైతు కన్నీటిని తుడవనే తుడవరు
ఎద్దు ఏడిస్తే ఎవుసం దండగ
రైతు ఏడిస్తే రాజ్యం దండగ
రైతే దేశానికి వెన్నెముక
రైతును మరిస్తే ఉండదు అన్నమిక
బాధలు ఉన్న రైతుకు భరోసా కావాలి
ప్రభుత్వాలు రైతులకు చేయూత నివ్వాలి



–యాదవరనీ చంద్రకాంత్ గౌడ్
9441762105

## నానీలు

పండ్లనిచ్చే
అక్షరాల చెట్టు బడి
రాకపోకల
చదువు పక్షులకై

బడి చెట్టు
ఆకులు రాల్చింది
మల్ల కొత్త చిగుళ్ళకు
విద్య నేర్పడానికి

బడి గుండె
రొద బెడ్తాంటది
మంచి గురువులకు
వీడ్కోలిచ్చినప్పుడల్లా

ఎంత ఎదిగి
ఏడికో ఎగిరినా
ఊళ్ళె బడింజూస్తె
గుండె పసిదైతది



–వకుళ వాసు
9989198334

## కడగండ్ల బాపాలి

అహో !
నా హైదరాబాద్
దల్లాసు నగరమయ్యింది.
నీళ్ళల్ల నానినాని
తడిసి ముద్దలైన భవంతుల్నీ
వరదలు వాటేసుకుంటాంటే
కాలనీలు కన్నీళ్ళు పెడుతున్నవి

ఇగమేము నిలబడలేమని
నానిపోయిన భవంతులు
కుప్పకూలి పోతున్నై

గుండె పలిగి గూడు చెదిరిన
బతుకులన్నీ బేజారై
బజార్న పడ్డయి

నదులు నాట్యమాడుతాంటే
ప్రవాహాలు పరాచికాలాడుతున్నై

కట్ట తెగిన చెరువులు
ఇదే సందులమొందని
సంకలు కొడుతూ దుంకులాడుతున్నై.

కబ్జాసురుల పాపాల ఫలితం
అమాయకుల పాలిట కష్టం.
గద్దె కదలకుండా
అడుగు బైట పెట్టకుండా
మొద్దు నిద్రపోతున్న
పాలకులను తన్ని తట్టి లేపాలి.

వరదలకు బురదలో
కూరుకపోయి కన్నీరు
మున్నీరవుతున్న నగరవాసుల
కడగండ్ల బాపాలి

తలోచెయ్యేసి తగిన సాయం జెయ్యాలి.
అండగ మేమున్నామని
భరోసానివ్వాలి.



–నల్లెల్ల రాజయ్య
9989415571

## శివారు బతుకులు

మా అమ్మ ఇన్ని చీకటి ముక్కలు
తీసి కడుపుకుంపటిలో రాజేస్తుంది!
మా నాన్న ఇన్ని చెమటగింజలు
తెస్తే పేలాలు చేస్తుంది!
ఆకాశం నగ్నంగా మా ఇంటి పైకప్పై
కూర్చుంటుంది!
చుక్కలు కాసేపు మెతుకులై ఊరిస్తాయి
చందమామను వెన్నముద్దలా
తినేయాలనిపిస్తుంది!
ఎండ మా గూడెంపై ఎర్రదేరాలేసి
కాసేపు ఉడక పెడుతుంది!
సూరీడు నిప్పుకణికలా
మమ్మల్ని సలసలా రోజూ
పన్నెండు గంటలపాటు
మరగబెడుతుంటాడు!
గాలి ఎప్పుడూ గూండాలా
మా ఇంటిలో చొచ్చి మా సిల్వరు
బొరుసులను తిరగెసి,మా బట్టల్ని
ఎగరగొడుతుంది!
చినుకులు చిరుబాణాలై మా శరీరాలపైనుండి
దూసుకు పోతాయి!
ఆ గాయాలకు మా శరీరాలు కొంకర్లు
తిరుగుతాయి!
ఋతువులు మూడుకాలాలనూ
మా నెత్తిపై రుద్ది....
ఆరుకాలలలోనూ శిశిరాన్నే పండిస్తాయి!
నగరు శివారులో ఉన్నమా గూడెం ను
ఓటర్ల జాబితా వెలివేస్తుంది!
నగరంలో వెలుగులకు
మా చెమట చమురే కారణం!
నగరం చెట్టుములాలం మేము
అందుకే ఎవ్వరికీ కనబడం!
ఏ పథకమూ మాకు దరిచేరదు
ఏ సదుపాయం పాయలుగామారి
మామీద ప్రవహింపదు!
శివారులో ఉన్నవారికి దోమలేతోడు
ఈగలే పరివారం
నగర మురికి కాలువలు వెదజల్లే
దుర్గంధమే సుగంధం!
పలుకరించే పందులు
వెక్కిరించే పందికొక్కులు
నగరం చెత్త మా నెత్తిపై శతఘ్నుల్లా
మోహరిస్తాయి చెత్తశుద్ధి వాహనాలు!
ఏనరకానికీ ఇన్నిరకాల హింసలుండవు
జబ్బులు మా గుండైపై కూర్చొని జబ్బలు చరుస్తాయి!
ఊపిరులూదేస్తాయి!
ఈ పేదరికానికి మేమెలా కారకులమో
ఆ దేవునికైనా తెలుసో తెలీదో!
పుర్రెలనిండ వెర్రిగీతలు గీచి పడేస్తే
రాలిన పూలగా మారవూ
మా బతుకులు!?



–కిలపర్తి దాలినాయుడు
7780589336

## పద్యమకరందం

నమ్మకము నుంచ కలుగును
కమ్మని జీవిత పయనము కడవరకు నిలన్
నమ్మిన చోటున ఎవరును
వమ్మును చేయ వలదుసుమ బ్రతుకును నిల్పన్.
విశ్వకవిగా రవీంద్రుడు విశ్వమందు
నిలిచె గీతాంజలి రచన నిమ్మలంగ
వ్రాసి సాహిత్య నోబెలు బహుమతి వడసి
తాను మాతకు నిచ్చిన తనయుడతడు
జనగణ గేయము వ్రాసెను
జనులకు మోదము కలుగగ జాతీ గీతం
జనహృదియందున నిలిచెను
జనులెరిగిన కవివరుండ జగమే బొగడన్.
కలమే హలమై సాహితి
పొలమున సాగగ కవితల పొత్తము వచ్చెన్
అలుపెరుగక కవి వ్రాసెను
అలవోకగ పలునవలలు అవని తలమునన్



–జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

# "తల్లి మనసు"

(కథ)

**"ఎవరైనా తల్లిని పోగొట్టుకొని పుట్టిన శిశువులు ఉంటే వారికి నేనే స్వయాన నా స్తన్యాన్ని ఇవ్వాలను కుంటున్నానని చెప్పా, మీ అనుమతి కోసం ఆగా.."**

షంశాబాద్ ఏర్ పోర్ట్ ఔట్ గేట్ వద్ద వీల్స్ సూట్ కేస్ లాకుంటూ వంగిన నడుముతో టక్ వేసుకుని వస్తున్న ఓ పెద్దాయన కన బడ్డాడు. అతన్ని ఇదివరకు ఎక్కడో చూసిన అనుమానంతో అతని ముందు కెళ్ళి తీక్షిణంగా చూశా, తాను నన్ను గమనించడం లేదు. నా అనుమానం కరక్టే అతనెవరో కాదు గురునాథమేనన్న నిర్ధారణ కొచ్చి"సర్ గురునాధం సార్"అని పిలిచా.

నా పిలుపుకు అవాక్కయి "ఎవరా?" అని తన చలవ నల్ల కళ్లద్దాలు తీసి నావైపు తిరిగి చూశాడు ప్రశ్నార్థకంగా.

ఇది గమనించి "సర్ నమస్కారం. నేను ఎలక్ట్రిసిటీ లైన్ ఇన్స్పెక్టర్ విజయ్‌ని..."

ఓ నిమిషం పాటు ఆలోచించి "ఎవరూ?.. ఆ సులోచనమ్మ హస్బెండ్ వు కదూ..?" అన్నాడు అనుమానంగా

"అవును సార్ నేనే..",

"అబ్బో ఎన్నాళ్ళయింది.చాలా నాళ్లైంది కనీసం పాతిక సంవత్సరాలైంది కదా ! గుర్తు పట్టలా. అయినా కాస్త చత్వారం కూడా..."

"సార్ ఇప్పుడేనా రావడం.."

"అవును ఇప్పుడే గానీ, నీ పేరు విజయానందు కదూ ?.. సులోచనా మీ అబ్బాయి హర్షవర్ధన్ బాగున్నారా?"

"అందరం బాగున్నం సార్. మరి మీరూ బేబీ నందిత బాగున్నారా..?

"అందరం బాగే..." అతని మాట పూర్తవక ముందే

"అది సరే ఎక్కడి నుండి వస్తున్నారు సార్?" అని అడిగా

"అయ్యో నీకు తెలువదు కదూ ! అయినా నీకు చెప్పనే లేదు కదా ! నందితను మీ దగ్గరి నుండి తీసి కెళ్ళిన తర్వాత నేను సెకండ్ మ్యారేజ్ చేసు కున్నాను లే. ఆ తర్వాత పుట్టిన అబ్బాయే ఇప్పుడు స్టేట్స్ లో జాబ్ చేస్తున్నాడు, ఇప్పుడు అతని దగ్గరి నుండే వస్తున్నాను..." అతను చెప్పడం పూర్తవక ముందే

"సర్ మేడం రాలేదా ?, మరి బేబీ నందిత ఎక్కడ సర్".

"నా శ్రీమతి స్టేట్స్ లోనే ఉంది. నందిత ఇక్కడే మన గాంధీ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్.."

తన మాట పూర్తవక ముందే కూతూహాలంతో "అంటే నందితమ్మ ఇక్కడే.."

"అవును. ఇక్కడే ఉంది. తానిప్పుడు ఫేమస్ గైకొనలిస్ట్ తెల్సా?.." అని గురునాథం చెప్ప గానే,ఆ డాక్టరమ్మ పుట్టిన నాటి రోజులన్నీ నా కళ్ళ ముందు కదలాడ సాగాయి.

× × × ×

ఆ రోజుల్లో కరోనా వైరస్ తో జనమంతా భయంతో వణికిపోతున్నారు. ఎక్కడి కక్కడా లాక్ డౌన్. ప్రయాణాలు లేవు, ఒకరిని ఒకరు కల్సుకునేది లేదు. బంధు మిత్రులందరూ ఉండి కూడా ఏకాకి బతుకులే.

అప్పుడు నేను ఓ మారు మూల గ్రామంలో జూనియర్ లైన్ మెన్ గా ఉద్యోగం చేస్తున్నాను.నా సహ ధర్మచారిని సులోచన నిండు గర్భవతి. తనకు అనుకోకుండా ఏదైనా జరిగితే ఎలాగో అని భయ పడ్తూనే ఉన్నాను.నా భయంకు తగ్గట్టు నవమాసాలు నిండి పురుటి నొప్పులు రానే వచ్చాయి. చుట్టు పక్కల అందు బాటులో ఎక్కడ కూడా ప్రసూతి కేంద్రాలు లేవు. అన్నీ మూసివేయబడి ఉన్నాయి. ఉన్నదల్లా ఒక్కటే అదే జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి.

అక్కడ మొత్తం కరోనా కేసులే, వెళ్ళిన వారిని క్వారంటెన్ లేదా ఐశోలేశన్‌లో అడ్మిట్ చేసుకుంటున్నారని బాధ. సులోచనకేమో మొదటి కాన్పు. ఏం చేయాలో అర్థం కాక చివరికి తెగించి మా డిపార్ట్‌మెంట్ వెహికిల్‌తో జిల్లా ఆసుపత్రికి బయలుదేరాను. కరోనా భయంతో నా వెంబడి డ్రైవరు తప్పా మరింకేవరూ రాలేదు.తనకు పురుటి నొప్పులు ఎక్కువవుతునే ఉన్నాయి. బాధకు తట్టుకోలేక పోతున్నది. ఇదిగో అదిగో అంటే కనీసం గంట కన్నా ఎక్కువే అయింది. ఆస్పత్రికి చేరుకోవడానికి మరో అయిదు నిమిషాల్లో ఆసుపత్రికి చేరు కుంటామనేంతలో తను వ్యానులోనే మృత శిశువుకు జన్మ నిచ్చింది. ఇది చూసి నిర్ఘాంత పోయా. ఎలాగైతేనేం హాస్పిటల్లో అడ్మిట్ చేశా.

శిశువు పోయినందుకు ఇద్దరం ఎంతో దుఃఖ పడ్డాం. మా దుఃఖం చూసి "ఇంకా మంచిదే అయ్యింది.పెద్ద ప్రాణం పోయేడిది, ఊరుకోండి" అని ఓదార్చారు. ఆసుపత్రి సిబ్బంది.

అప్పటికీ రెండు రోజులు కావొస్తోంది.లాక్ డౌన్ మూలంగా బంధు మిత్రులు మమ్మల్ని పరామర్శించడానికి ఎవ్వరూ రాలేదు. ఒకనాటి ఉదయం నేను సులోచనకు టీ తాగిస్తున్నపుడు "ఏమండీ !..." మెల్లిగా ఏదో చెప్తున్నదల్లా ఆగి పోయింది.

ఇది గమనించి "ఏంటి సులోచనా ! ఏమైందీ ? ఏమైనా ఇబ్బందిగా ఉందా.. ?"

"లేదండీ !.."

"మరేంటీ ?... ఏమైంది అంత ధీనంగా..."

నన్ను మరింతగా దగ్గరికి పిలిచి "నా రొమ్ముల్లో ఉబికి వస్తున్న ముర్రు పాల నొప్పికి తాళ లేక పోతున్నానండీ.."అంటూ మెల్లిగా నా చెవిలో చెపుతోంది.

ఆవె మాటలకు నాకర్థూడా ఏం అర్థం కాలేదు."డాక్టరమ్మకు చెప్ప లేక పోయావా! ఏవైనా మెడిసిన్స్ ఇచ్చేదేమో..."

"మీరన్నట్టు రాత్రి డాక్టర్ మేడంతో చెప్పాను.."

"మరేమంది?.."

"మందులేం వాడొద్దట, అలా వాడితే భవిష్యత్తులో మళ్లీ తల్లినైతే పాలు రావట.." అని చెప్పగానే మళ్ళీ నేనే అడిగా "మేడం మరి ఎలా ?" అని అడిగితే

"ఏం లేదు, నీకు నీవే ఆ పొంగి వచ్చే పాలను చేత్తో పిండేసు కోవాలి, లేదంటే తల్లి లేని శిశువులకు గానీ, ఎవరైనా తల్లులకు పాలు లేకపోతే గానీ ఇవ్వ వచ్చు." అని చెప్పింది.

"మరి నీవేమ్ డిసైడయ్యావు.."అని అడిగా.

"వీటన్నింటి కన్నా ఎవరైనా తల్లిని పోగొట్టుకొని పుట్టిన శిశువులు ఉంటే వారికి నేనే స్వయాన నా స్తన్యాన్ని ఇవ్వాలను కుంటున్నానని చెప్పా, మీ అనుమతి కోసం ఆగా.."

"సులోచనా! నీవెంత గొప్ప మనసున్న మాతృమూర్తివి. నిజంగా నీవు దేవతవు, చక్కని ఆలోచన. నిజంగా అమ్మ మనసంటే ఇదే గ్రేట్. నీకు వచ్చిన ఈ అద్భుతమైన ఆలోచనతో రెండు మహా ఫలితాలు ఉన్నాయి. ఒకటి శిశువును పోగొట్టుకున్న నీ వ్యధ దూరమవు తుంది. రెండోది తల్లిని పోగొట్టుకున్న పసికందులకు స్తన్యాన్నిచ్చి ఆదుకొని వారికి అమ్మ లేని లోటు తీర్చి ఒక గ్రేట్ తల్లిగా నిలిచిపోతావు. నీ నిర్ణయం అవెూఘం సులోచనా !'' అంటూ ఆవె నుదురునుస్పర్శిస్తున్నంతలో...

"సార్ మేడం విజిటింగ్ కొస్తున్నారు" అని వార్డ్ సిస్టర్ చెప్పగానే నేను బయటకి వచ్చేశా.

అలా సులోచన హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయిన తర్వాత మాకు మరో సంతానం అయ్యేంత వరకు కూడా ఆ పాపను మా వద్దే ఉంచేశారు గురునాథం వాళ్లు. సులోచన కోరుకున్నట్టుగానే తల్లి పోగొట్టుకున్న పసిపాపకు పాలు పట్టి పెద్ద చేసిన ఆ పాపే ఈ నందిత. ఇలా అలనాటి విషయాలన్నీ నేను నెమరు వేసుకుంటున్నంతలో "విజయ్ ! నేను వెళ్తాను. అవునూ నందిత మిమ్మల్ని చాలాసార్లు గుర్తు చేసిందయ్య, మీ అడ్రస్ లేక మిమ్మల్ని కలువలేకపోయాం. ఫోన్ నెంబర్ ఇవ్వండి. ఇంటికి చేరు కోగానే బేబీతో ఫోన్ చేయిస్తా" అని గురునాథం అడగగానే

తనకు నా ఫోన్ నంబర్ ఇచ్చేశా. తాను వెళ్లిపోగానే. నా డ్యూటీ అయిపోయి ఇంటికి వెళ్లి సులోచనతో గురునాథం కలిసిన విషయం చెప్పా. ఆ విషయం విని తాను కూడా ఎంతో సంబర పడిపోయింది. తాను కన్న బిడ్డకోసం తపించినట్టుగా నందిత ఫోన్ కోసం చకోర పక్షిలా ఎదిరి చూడ సాగింది. సులోచన.

ఎంతైనా ఆడ మనసు కదా. అనురాగానికి ఆప్యాయతకు పొదరిల్లు అమ్మే(ఆడదే) కదా.



–దారం గంగాధర్
సెల్:9848384777

## ఎక్కడుంది కరోనా? ఏం చేస్తోంది కరోనా?

అదిగో కరోనా,
కసితో కత్తులు నూరుతోంది,కరోనా
కాలసర్పమై చాటుమాటుగా
కాటు వేస్తోంది ...

చేతికి చిక్కినవారందరిని
కాటికీడుస్తోంది కరోనా
మరణమృదంగం
వినిపిస్తోంది,మందులేని కరోనా...

చిందులేస్తూ శవాలతో
విందు చేసుకుంటోంది కరోనా
విశ్వమంతా విస్తరిస్తూ
కరాళ నృత్యం చేస్తోంది కరోనా...

వెక్కిరిస్తూ మనచుట్టే
నక్కినక్కి తిరుగుతోంది కరోనా
ఉగ్రరూపం దాల్చి అదిగో
అగ్రరాజ్యాలను అల్లాడిస్తోంది కరోనా...

అదిగో రాక్షసిలా రాబందువులా
రాజ్యమేలుతోంది కరోనా
గుండెలమీద కూర్చొని
గునపాలు గుచ్చుతోంది కరోనా....

నిప్పులా కాల్చివేస్తూ
పెనుముప్పులా పొంచివుంది కరోనా
కత్తులు నూరుతూ
కుత్తుకలు తెగనరుకుతోంది కరోనా...

ఎత్తుకుపై ఎత్తులేస్తూ
ప్రజలను చిత్తుచిత్తు చేస్తోంది కరోనా
విశ్వంపై విరుచుకుపడుతూ
కాలకూటవిషం చిమ్ముతోంది కరోనా...

సైన్యాధ్యక్షులకు సైతం
సవాలు విసురుతోంది కరోనా
అణుబాంబులు తననంతంచేయలేవని
అవి ఆరిపోయిన అగ్గిపుల్లలని
అవహేళన చేస్తోంది కరోనా...

లెక్కపెట్టలేనన్ని శవాలను
రాబందువులా పీక్కుతినే కరోనా
రక్షసి, రెక్కలు విరిచెయ్యాలి
ఉగ్రవాదిగా మారిన కరోనాపై
ఉక్కుపాదం మోపాలి....

ఉక్కుసంకల్పంతో కరోనాను ఉరితియ్యాలి
ఈ మాయదారి మహమ్మారి
కరోనా గుట్టు కనిపెట్టాలి, దాన్ని మట్టు పెట్టాలి
కలిసి అందరం
ఈ కరోనా భూతాన్ని ఖతం చెయ్యాలి



–పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## సగటు మహిళ

ఇది నా ప్రొఫెషన్
ఇవి నా అభిరుచులు
ఈ సమయం నా కోసం
ఇది అందరి ఆలోచనా విధానం.
ఉన్నాయా గృహిణి కి ఇవన్నీ
అందరి సమయాను గుణంగా మారిపోతుంటాయి
ఆమె సమయ పట్టిక
రోజు సవరణలతోనే సరాగాలు.
ఆమె కంటూ ఒక సమయం పెట్టుకుని
ఇష్టమైన పనిలో ఆనందం పొందాలని అనుకోకుండా..
దొరికిన సమయంలో తన మనసుకు రెక్కలు తొడిగి
కాసేపైనా విహరించాలని అనుకుంటే.
ఎగిరే రెక్కలను చిదిమి..
ఇదంతా గొప్ప విషయం కాదని
ఎద్దేవా చేస్తుంటే వికలమవదా మనసు
చూర్ణం లా రాలి పడ్డ విరిగిన రెక్కలు.
అందరి కోసం అన్ని పనులను
వాయిదా వేసుకోవడమే తెలుసు
ఆ పిచ్చి మనసుకు ..
తనకోసం ఏదో కావాలనే తపనే ఉండదేమో!
అయినా గుర్తింపు లేదు ఎవ్వరికి
యంత్రాల మధ్య యాంత్రిక జీవనం!
ఒక్క సారి మనసులోకి తొంగి చూస్తే తెలుస్తుంది...
అందులో ఎన్ని పూల పరిమళాలు ఉన్నాయో!
మరెన్నో చినుకుల మధురిమల పలకరింపులు ఉన్నాయో!.
నాట్య మాడే ఒక మయూరి
పాట పాడే ఒక కోయిల
కవన రచనలు చేసే మొల్ల
ఇంకా ఎన్ని ఉన్నాయో చూస్తే కదా తెలిసేది !.
ఇష్టమున్న ప్రవృత్తిని స్వీకరించి..
స్వేచ్ఛగా ఎగుర నీయం డి కొంతైనా సమయ మిచ్చి ఆమెకు..
పుట్టుకతో అన్ని హక్కులు
సంక్రమించే ఉన్నాయి కదా ఆమెకు కూడా!
అయినా కోరుతుంది కొంత సమయం కావాలని ..
మీరిచ్చేది ఏంటని ప్రశ్నిస్తే!.
ఆ ప్రశ్నించడం రాక కాదు కదా!
ఎవ్వరి మనసు చివుక్కు మనకూడదని..
తానే చిరాకులు పరాకులు
భరిస్తుంది చిరునవ్వుతో!
సహకరించండి కొంతైనా!

–లక్ష్మి మదన్
9959186838

## కాని కాలం..!

ఏమి కాలమిది ?
ఎసోంటి కాలమిది ?

నోటికాడి అన్నం ముద్ద
సేతికాడ్కి వచ్చిన పంట
ఆరుగాలం పొలాన్ని నమ్మి ఏసిన పంట
గిప్పుడు నేలసూపులు సూసేసింది
రాత్రింబవళ్లు కాపుకాసిన పంట
రైతన్నను నట్టేట ముంచేసింది

ఎన్ని కలలు గన్నడో
గీపంట సేతికొస్తే
సేసిన అప్పులన్నీ తీసేయాలని

ఎంతమందికి సెప్పుకున్నడో
పెద్దపిల్ల పెండ్లి సేయాలని
సిన్నోడిని పట్నంల
పెద్దసదువులు సదివిస్తానని

గీ వాన గిట్ల అన్యాలం సేస్తదని
జీవితంల అమాసచీకట్లు నింపుతదని
రైతన్న కల్లో కూడా అనుకోలేదు

రైతు కలలు గిపుడు కల్లలై
ప్రకృతిని ప్రశ్నిస్తున్నవి
బతుకుపై ఆశలన్నీ ఆవిరై
నిరాశలో ముంచెత్తుతున్నవి

అతివృష్టి రైతన్ననిపుడు
ఉక్కిరిబిక్కిరి చేసేసింది
గొంతునే నులిమినట్లు
ఊపిరినే తీసేసినట్లు చేసేసింది

మన జాతికే ఎన్నముకై నిలిసినోడు
మానవజాతికే అన్నం పెట్టెటోడు

నాగలి ఇరిగిన సప్పుడులా
గిపుడు మట్టిని నమ్ముకున్న రైతు ఆగమాగం

మట్టినే నమ్ముకున్న రైతు బతుకిపుడు
బజారున పడ్డ పిడికెడు మట్టి
ఏసిన పంటకై ఎదురుసూసిన
రైతు కండ్లు దింపుడుకల్లేలు

రైతు గుండె గిపుడు ఏమని కొట్టుకోవాలె
సినుకు కోసం ఎదురు సూడాలనా
అతిగా సినుకులేవీ పడకుండా సూడాలనా

ఎంత కష్టపడ్డా రైతన్నకు
గిట్టుబాటు పైసలు ఆమడదూరం
ఎప్పుడూ హామీల వానకు
కొట్టుకుపోయే తుపానుగండం

గా అల్పపీడనమేదో రైతు గుండెల్లోనే
గునపమై గుచ్చుకుంటున్నది
వాయుగండమై అతని మెడకే
సుట్టుకుని ఉసురు తీస్తున్నది

రైతుకు తమ మొగాలు ఎట్ల సూపాలని
కరిగెట్లలోని ఒతా
దిగాలుగా నేలసూపులు సూసినవి
గా సేన్లే ఉరితాళ్ళుగా రైతన్నను ఎక్కిరిస్తున్నవి

రైతన్న బతుకిపుడు ఎడతెగని కన్నీటికట్ట
ఎవరూ కాపాడలేని ఒంటరి అడియాసల పెట్ట



– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

# పాలపుంత

కవి, రచయిత, పాత్రికేయులు
నియోగి వెలువరించిన
111 మంది సాహితీవేత్తల పరిచయాలు గల
"అక్షర నక్షత్రాలు" పుస్తకానికి
కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత,
ప్రముఖ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి రాసిన
ముందు మాటలు.






- రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
సెల్: 9440222117

**"చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా**
**గతమెంతో ఘనకీర్తి గలవోడా"** (వేములపల్లి శ్రీకృష్ణ)

సోదరులు నియోగిగారు రాసిన ఈ పుస్తకమంతా చదివిన తర్వాత నాకు ఈ పాట గుర్తుకు వచ్చింది. "అక్షర నక్షత్రాలు" ఈ పుస్తకం. 111 మంది ఆధునిక తెలుగు రచయితల జీవిత, పాండిత్య, జీవితాల పరిచయ సమాహారం, ఒక్కొక్కరినీ ముచ్చటగా మూడు పుటలలో క్లుప్తంగా ఆవిష్కరించారు నియోగిగారు. ఇంతమంచి పని చేసిన ఆయనకు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు.

20వ శతాబ్దంలో మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి (ఆంధ్రరచయితలు) ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ (ఆంధ్ర కవయిత్రులు) ఆంధ్ర శేషగిరిరావు (ఆంధ్ర విదుషీమణులు) టేకుమళ్ల కామేశ్వరరావు (నా విజ్ఞ్మయమిత్రులు) మొదలైన వాళ్లు ఇలాంటి రచనలు చేశారు. నియోగిగారిది 21వ శతాబ్ద గ్రంథం. ఇది 21వ శతాబ్ది పాఠకులకు ఉద్దేశించిన గ్రంథం. ఈనాటి యువ పాఠకులు, రచయితలు, విమర్శకులు, సమీక్షకులు, పరిశోధకులు ఈ గ్రంథాన్ని చదవడం అవసరం.

ఈ గ్రంథ రచనలో నియోగిగారు చాలా ఉదారంగా వ్యవహరించారు. తన అభిరుచికి, తన భావజాలానికి రుచించిన రచయితల్నే ఎన్నుకుని రాయకుండా, రచయితలయిన వాళ్లందరినీ సమానంగా స్వీకరించి రాశారు. చరిత్రకు చరిత్రగా పాఠకుల ముందుంచారు. ఈ పుస్తకంలో 111మంది ఆధునిక తెలుగు రచయితలను ఒక్కసారిగా మనం కలుసుకుందాం. ఇది ఆధునిక తెలుగు రచయితల పాలపుంత.

ఈ పుస్తక రచనకు నియోగిగారు ఒక లక్ష్యం పెట్టుకున్నారు. ఒక ప్రణాళిక వేసుకున్నారు. రచయితలను కుప్తంగా పరిచయం చేసి పాఠకులలో ఆ రచయితలను చదవాలి అనే ఉత్సుకతను కలిగించడం లక్ష్యం. సాహిత్య పఠనోత్సాహ కల్పన, రచయిత ఉద్దేశం. రుచిచూపించి, తక్కినది మీరే తెలుసుకోండి అన్న సూచన చేయడం ఈ పుస్తకంలో కనింపించే శిల్పం. రచయిత స్థలకాల పరిచయం, జీవిత వివరాలు చెప్పడం, రచనలను పేర్కొనడం, రచయితలు సాధించిన విజయాలు చెప్పడం, ఆయా రచయితల సాహిత్య విశిష్టతను కొన్ని వాక్యాలలో చెప్పడం ఈ పుస్తకంలోని ప్రణాళిక.

ఈ ప్రణాళికను నియోగిగారు స్పృహలో ఉండి చక్కగా అమలు చేశారు. ఈ పుస్తకాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తే మనకు చాలా విశేషాలు తెలుస్తాయి. ఈ పుస్తకంలో 19వ శతాబ్దం ద్వితీయార్థం. 20వ శతాబ్దం ద్వితీయార్థం మధ్య 120 ఏళ్లలో పుట్టిన రచయితలు మనకు దర్శనమిస్తారు. 20వ శతాబ్దం ప్రారంభం, 21వ శతాబ్దం ప్రారంభం మధ్య మరణించిన వాళ్లు మనకు కనిపిస్తారు. మొత్తం మీద ఇది నాలుగు తరాల తెలుగు రచయితల పరిచయ వేదిక. నియోగిగారు పరామర్శించిన రచయితలలో 1854లో పుట్టిన వేదం వేంకట రాయశాస్త్రిగారు అందరి కన్నా పెద్దవారు. 1964లో పుట్టిన కలేకూరి ప్రసాద్‌గారు అందరి కన్నా చిన్నవాడు. వీళ్ళలో నూరేళ్ళు బతికినవారు లేరుగాని, 90 యేళ్ళకు మించిన బతికిన గట్టి పిండాలు వున్నారు. గడియారం రామకృష్ణశర్మ, బోయి భీమన్న వంటివారు 94 ఏళ్లు బతికారు. రాయప్రోలు సుబ్బారావు, అవంత్ససోమసుందర్ వంటివాళ్లు 92ఏళు బతికారు. అతి తక్కువ కాలం బతికిన అల్పాయుష్కులు ఈ గ్రంథంలో ఉన్నారు. రంగినేని సుబ్రహ్మణ్యం 29ఏళ్లకే కన్నుమూశారు. బసవరాజు అప్పారావు 33ఏళు జీవించగా, అలిశెట్టి ప్రభాకర్‌కు 37ఏళ్లు బతికారు. చెరబండరాజు, సాహు 38ఏళ్లకే తనువు చాలించగా, శిష్టా ఉమామహేశ్వరరావు 40 ఏళ్లు మాత్రమే జీవించగలిగారు.

ఈ గ్రంథంలో మనం గుర్తించవలసిన అదనపు సొగసు ఒకటుంది. అది చాలామంది రచయితలు, 20 ఏళ్లలోపు రచనారంగంలోకి ప్రవేశించడం ఉదాహరణకు దేవులపల్లి కృష్ణశాస్త్రి తొమ్మిదేళ్లకే రచన ప్రారంభించారు. పురిపండ అప్పలస్వామి 15ఏళ్ల వయసులో, శ్రీపాద కృష్ణమూర్తి, రావూరి భరద్వాజులు 16 ఏళ్ళ వయసులో, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ 15 ఏళ్ళ వయసులో, శ్రీశ్రీ 18ఏళ్ల వయసులో (ఈయన ఎనిమిదేళ్లప్పుడే కంద రచనా ప్రయత్నం చేశారంటారు) ఇందిరాదేవి 18ఏళ్ల వయసులో, మధునాపంతుల 19ఏళ్ల వయసులో రచనలు ప్రారంభించారని ఈ పుస్తకం తెలియజేస్తున్నది. ఇలాంటి వాళ్లు ఇంకా ఉన్నారు. ఈ పుస్తకం చదవండి తెలుస్తుంది.

ఈ గ్రంథంలో మనకు అన్ని సామాజిక నేపథ్యాల వాళ్లు కనిపిస్తారు. తొలినాళ్లలో బ్రాహ్మణులు అధికంగా రచనలు చేశారు. క్రమక్రమంగా దళిత బహుజనులు, గిరిజనులు రచనారంగంలోకి ప్రవేశించారు. ముస్లిం ఉద్యమం మొదలు కాకముందే మగ్దూం మొహిద్దీన్, ఉమర్ అలీషా వంటి రచయితలుండడం, దళితవాదం మొదలుకాకముందే గుర్రంజాషువా, కుసుమ ధర్మన్నలు ఉండటం మనం గమనించవచ్చు. ఇందిరాదేవి వంటి మహిళలూ కనిపిస్తారు. ఇది ఎలా సాధ్యమైంది? సామాజిక ఉద్యమాల వలననే, సామాజిక మార్పుల వలననే.

నియోగిగారు పరామర్శించిన రచయితలలో కేవలం రచయితలు చాలా తక్కువమంది. ఈ రచయిలందరికీ ఏదో ఒక భావజాలముంది. అంతేకాదు వీళ్లలో అత్యధికులు విభిన్న ఉద్యమాలలో పాల్గొన్నారు. అరెస్టులయ్యారు. జైలుశిక్ష అనుభవించారు. కాళోజీ 25ఏళ్ల వయసులో సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. నిజాం వ్యతిరేకోద్యమంలో పాల్గొన్నారు. విశ్వనాథ సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడానికి బి.ఎ.చదువు మానేశారు. దాశరథి, కాళోజీ రామేశ్వరరావు, సుద్దాల హనుమంతు, బూర్గుల రామకృష్ణారావు, వట్టికోట ఆళ్వారుస్వామి మొదలైన వాళ్ళు తెలంగాణ విమోచణోద్యమంలో పాల్గొన్నారు. కేసులను ఎదుర్కొన్నారు. పోలీసులు దెబ్బలు తిన్నారు. జైలు శిక్షలనుభవించారు. వురిపండా అప్పలస్వామి, గడియారం రామకృష్ణశర్మ, గరిమెళ్ల సత్యనారాయణ, తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, బెజవాడ గోపాలరెడ్డి మొదలైనవాళ్లు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో విభిన్న దశలలో పాల్గొని నిర్బంధాలను, శిక్షలను అనుభవించారు. అవంత్స సోమసుందర్, అనిసెట్టి సుబ్బారావు వంటి వాళ్లు కమ్యూనిస్టులుగా నిర్బంధాలను అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం కూడా స్వపరిపాలనలో జ్వాలాముఖి, చెరబండరాజు, శివసాగర్, రావిశాస్త్రి వంటి వాళ్లు జైలు శిక్షలనుభవించారు. ఈ రచయితలకు నిబద్ధత, నిమగ్నత ఎలా ఉంటుందో వీళ్లను చదివి తెలుసుకోవచ్చు. ఈ నియోగిగారి గ్రంథం ఇలాంటి వాళ్లను ఇంకా చాలా ముందిని చూపిస్తుంది.

ఈ గ్రంథంలో మనకు పరిచయమయ్యే రచయితలు అనేక వృత్తులు, వ్యాపారాలలో ఉంటూ రచనలు చేసినట్లు తెలుస్తుంది. పాత్రికేయులు, న్యాయవాదులు, అధ్యాపకులు, వంటి వాళ్లు రచయితలైనట్లు మనం గుర్తిస్తాం. దివాకర్ల, సినారె, పల్లాదుర్గయ్య, పి. యశోదరెడ్డి విశ్వవిద్యాలయ అచార్యులైన రచయితలు, సురవరం ప్రతాపరెడ్డి వంటి పాత్రికేయులు, చిలుకూరి నారాయణరావు, జయంతి రామయ్యపంతులు, మానవల్లి రామకృష్ణ కవి వంటి పరిశోధకులు, కొమర్రాజు లక్ష్మణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి చరిత్రకారులు రచయితలుగా కూడా వెలుగొందారు. బి.ఎన్.రెడ్డి వంటి ఇంజనీర్లు, ధేనువకొండ శ్రీరామమూర్తి,శంకర శ్రీరామారావు, పి. కేశవరెడ్డి, వంటి డాక్టర్లు రచయితలయ్యారు. అంతేకాదు, జ్ఞానపీఠ పురస్కారం పొందిన రావూరి భరద్వాజ ఒకప్పుడు ఫౌంటెన్ పెన్నులు సేల్స్‌మన్‌గా పనిచేశారు. అలిశెట్టి ప్రభాకర్ ఫోటోగ్రాఫర్, సుద్దాల హనుమంతు అటెండర్‌గా పనిచేశారు. భూమాగౌడ్ గీతకార్మికుడయిన రచయిత. ఇలాంటి వాళ్లు ఇంకా కొందరిని మనకు చూపించారు నియోగిగారు.

ఆవంత్స సోమసుందర్, వాసిరెడ్డి సీతాదేవి, దిగంబర కవులు వంటి వారి పుస్తకాలు నిషేధానికి గురైన వాస్తవాన్ని కూడా ఈ గ్రంథం తెలియజేస్తుంది. అంతేకాదు, పెన్నూగన్నూ రెండూ పట్టిన రావెళ్ల వెంకటరామారావు, శివసాగర్ వంటి వాళ్లను కూడా మనం ఈ పుస్తకంలో కలుసుకుంటాం. జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న ముగ్గురు తెలుగు రచయితలు మనల్ని పలకరిస్తారు. కేంద్రసాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వంటి సంస్థల నుండి పురస్కారాలు అందుకున్న పుట్టపర్తి, జాషువ వంటి వాళ్లు అనేకులున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి కళాప్రపూర్ణ పురస్కారం అందుకున్న వాళ్లు అనేకులున్నారు. పురస్కారాలను తిరస్కరించిన రావిశాస్త్రి లాంటివారున్నారు.

నెలకు 800 రూపాయల ఆదాయం వచ్చే న్యాయవాద వృత్తిని వదిలేసి పత్రికారంగంలో స్థిరపడిన సురవరం ప్రతాపరెడ్డి, పెద్దలిచ్చిన ఆస్తిని సాహిత్య ప్రచురణకు ఖర్చు పెట్టేసిన సోమసుందర్ వంటి వాళ్లనూ మనం ఎలా అర్థం చేసుకుందాం.

నన్నయ్య తిక్కన ఎర్రన ముగ్గురు కలిసి అనువాదం కలిసి అనువాదం చేసిన మహాభారతాన్ని 600 ఏళ్ల తర్వాత ఒక్క చేత్తో సంపూర్ణంగా అనువదించిన శ్రీపాదకృష్ణమూర్తి తెలుగువారు, శత్రువులు ఇంటికి వచ్చిన అతిథ్యమిచ్చే వ్యక్తిత్వం ఆయనది. ఈ గ్రంథమంతా చదవండి మన రచయితలు రచనలు చేయడమే కాకుండా ఎన్ని సాహిత్య సంస్థలను నెలకొల్పారో తెలిసి ఆశ్చర్యపోతాం.

రామాయణ కల్పవృక్షంలో వేయిపడగలులో నియోగిగారు విశ్వనాథ వ్యక్తిగత జీవిత ప్రతిధ్వనులనూ గుర్తించారు. శ్రీరామునికి 36ఏళ్ల వయసులో సీతావియోగం జరగగా, విశ్వనాథకు 36ఏళ్ల వయసులో భార్యావియోగం జరిగిందట. తన వియోగ బాధతోనే రాముని సీతావియోగ బాధను బలంగా చిత్రించారంటారు నియోగి. మునిమాణిక్యం నరసింహారావు కూతురు చనిపోతే ఆ బాధ నుండి తేరుకోడానికి ఆయన రచనలు చేశారట. ఆయన మొదటి భార్య కాంతం. ఆమె ఆయన రాసిన 40 రచనలలోనూ కనిపిస్తుందట.

వేదంవేంకట రాయశాస్త్రిగారు గొప్ప సమయపాలకులట. ఈ గ్రంథంలోని వారిలో మగ్దూం మోహిద్దీన్, కొమర్రాజు వేంకటలక్ష్మణరావు వంటి అనేకులు చాలా చిన్న వయసులోనే తండ్రులను పోగొట్టుకున్నారు. కందుకూరి మరణించిన గదిలోనే కొమర్రాజు కూడా కన్నుమూశారని నియోగి గుర్తించారు.

విశ్వకవి రవీంద్రునితో కృష్ణశాస్త్రి, బెజవాడ గోపాలరెడ్డి వంటి వారికి ప్రత్యక్ష సంబంధాలుండడం ముదావహం. ఈ గ్రంథంలోని రచయితలలో అనేకులు బహు భాషావేత్తలున్నారు. అలాగే బహు కళాపారీణులు ఉన్నారు. పుట్టపర్తి నారాయణాచార్యులకు 14 భాషలు తెలుసని ప్రసిద్ధి, కొమర్రాజు, పురిపండా, దాశరథి, సినారె సదాశివ మొదలైన వాళ్లకు అనేక భాషలలో అభినివేశముంది.

పుట్టపర్తి నారాయణాచార్యులు తన శివతాండవ కావ్యాన్ని తానే నృత్యం చేస్తూ గానం చేసేవారు. అలిశెట్టి ప్రభాకర్ ఫోటోగ్రాఫర్. సి. నారాయణరెడ్డి గజళ్లు స్వయంగా పాడారు. అద్దేపల్లి కూడా సుద్దాల మనుమంతు బుర్రకథలు చెప్పారు. గరిమెళ్ల స్వాతంత్ర్యోద్యమ గీతాలను ఆలపించేవారు. ఇలాంటి బహూకళా పారీణులు ఈ గ్రంథంలో ఇంకా ఉన్నారు.

ఈ గ్రంథంలోని అనేక మంది రచయితలు ఆధిపత్య కులాలలో, సంపన్న కుటుంబాలలో పుట్టినా, వాళ్లు వాటి ప్రభావాల నుంచి దూరమైన శ్రామిక కులాల జీవితాలను, పేదల జీవితాలను వస్తువులుగా చేసుకుని రాశారు. ఈ రచయితలలో అనేకులు గొప్ప అనువాదకులున్నారు. ఈ పుస్తకం చదవండి కనిపిస్తారు. అంతేకాదు, ఈ రచయితలు ఎన్ని పత్రికలు స్థాపించి నిర్వహించారో తెలిసి ఆశ్చర్యపోతాం. నియోగి వాటి వివరాలు కష్టపడి సేకరించారు.

నియోగిగారు ఈ 111 మంది రచయితలు ఒక్కొక్కరు ఎన్ని పుస్తకాలు రాశారో చెప్పారు. కొన్నింటి పేర్లు కూడా ఇచ్చారు. వాటిలో మనం ఎన్ని చదివామో పరిశీలించుకుంటే మనం చాలా మందిమి చెప్పడానికి వెనకడుగు వేస్తాం. కొన్నివేల గ్రంథాలున్నాయి. వీటిని సంపాదించడం ఎలా?

నియోగిగారు రచించిన ఈ పుస్తకం పాక్షికంగానైనా ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర. ఈయనను చాలా మంది నిలదీయవచ్చు. అక్షర నక్షత్రాలు వీళ్లేనా ఇంకెవరూ లేరా? అని. దండిగా ఉన్నారు. ఆయన ఇప్పటికి ఈ పని చేశారు. ఈ కృషి కొనసాగుతుంది. ఈ పని చేసినందుకు ఆయనను అభినందిద్దాం. ఈయన గ్రంథం రాకుంటే, కనీసం ఇరవై మంది విస్మృత రచయితలు, విస్మృతులుగానే ఉండిపోయేవారు. ఇందుకైనా నియోగిగారిని అభినందించాలి. ఈ గ్రంథం హిందీ, ఆంగ్ల భాషల్లోకి వెళ్లగలిగితే మన సాహిత్యం, మన రచయితలు ఇతర భాషలవారికి పరిచయం కావడానికి వీలవుతుంది. సోదరులు నియోగిగారికి మరోసారి శుభాకాంక్షలు.

**ప్రతులకు:** నియోగి
సెల్: 9553097319

## మార్పు రావాలి

విజ్ఞానం పెరిగింది కానీ
విజ్ఞుడు కాలేదు మనిషి
మారుతున్నది కాలం కానీ
మారడంలేదు ఇంకా మనిషి.

బట్ట కట్టడం నేర్చిన మనిషి
ఈనాడు
బట్టలు విప్పి ఆడుతుంటే
పండితుడైన మనిషి
ఈవేళ
పశువుగా ప్రవర్తిస్తుంటే
విద్యనేర్చిన మనిషి
నేడు
విలువలను పాతర వేస్తుంటే
నాగరికుడైన మనిషి
అనాగరికుడై పోతుంటే
మారింది కాలం గానీ
మారడం లేదు ఇంకా
మనిషి అంటున్నాను.

మనిషిలోంచి
మానవత ప్రవహిస్తే
మార్పు
మనిషిలోంచి
మంచితనం పరిమళిస్తే
మార్పు
మనిషి సాటి
మనిషి కన్నీరు తుడిస్తే
మార్పు
మనిషి చీకట్లను
చీల్చేస్తే
మార్పు
మనిషి వెలుగులోకి
పయనిస్తే మార్పు
మారుతున్న కాలంతో
మనిషి మారితేనే
నిజమైన మార్పు
మార్పురావాలి
మనిషి మనిషి చేసేదిగా
మార్పు రావాలి మానవాళిని
వెలుగులోకి నడిపేదిగా
విజ్ఞానం పెరగాలి
విశ్వ శ్రేయాన్ని తెచ్చేదిగా
మార్పు రావాలి
మానవాళిని
మానవతా ప్రపంచంలోకి
నడిపించేదిగా
మార్పు రావాలి
మార్పు రావాలి!



– డా|| తిరునగరి
సెల్:9392465475

## తెల్లకొలనులో..నల్లకలువలు

ఐ కాంట్ బ్రీత్
అగ్రరాజ్యాన్ని వణికిస్తున్న నల్లజాతి నినాదం
శ్వేతసౌధం కమ్ముకున్న నీలిమేఘాలు
ట్రంప్‌ను బంకర్‌లోకి
పంపించిన నిరసన జ్వాలలు
నల్ల జాతీయభావ పునాదులమీద ఏర్పడి
జాత్యహంకార భావనలతో రగిలిపోతున్న అమెరిక
నాకు ఊపిరి ఆడటం లేదు.. ప్లీజ్ వదలండి
నిరాయుధ ఆఫ్రో అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్
వేదనా భరిత ఆవేదన.

పెడరెక్కల సంకెళ్లతో నేలరాల్చి
మోకాలితో మెడపై నొక్కిపట్టిన తెల్లపోలీస్ చిత్తము
కరిగించలేని అతని మరణ యాతన
ఆ బహిరంగ హత్యను
మరో ముగ్గురు తెల్లపోలీసులు తిలపిస్తున్న చోద్యం
లోకానికి చూపిన సోషల్ మీడియా
ఇంతటి ధారుణ విద్వేషణం
ఇరవై డార్ల నోటు నకిలీదన్న సంశయం
ఒక జాతిపై మరొక జాతిలో
ఇంతటి అసహనం అనాగరికం
జార్జ్‌ఫ్లాయిడ్ ఒక్కడే కాదు
కోట్లాది మంది నల్లజాతీయులు
స్వేచ్ఛా వాయువులు పీల్చలేని దుస్థితి.

ఒకజాతి సామాజిక స్వేచ్ఛ, ప్రశాంతతను
నశింపజేసి, విభేదాలు సృష్టిస్తున్న
ఆదిపత్య భావన అంతరించిన
దాస్యశృంకల బానిసత్వానికి విముక్తి
రంగును బట్టి కాక, మనుషుల గుణగణాలను
ఉజ్జాయింపు వేసే తరుణ మాసన్నమయి
నల్ల జాతీయుల హృదయాల్లో
వసంతాలు పూచిన రోజున
తెల్లజాతి కొలనులో
నల్లజాతి కలువలు వికసిస్తాయి.
(అమెరికాలో ఒక తెల్ల పోలీస్ అధికారి
నిరాయుధుడైన ఆఫ్రో అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్‌ను
బహిరంగంగా మొదిలితో నొక్కి హత్యచేసిన ఘటన)

–కసిరెడ్డి జలంధర్‌రెడ్డి
సెల్: 9603499248

## నేటి యువతరం

విశాలమైనది మన విశ్వం
అత్యద్భుతమైనది భూభాగం
మంచి ప్రవర్తన కలిగిన యువతే
మార్చగలదు ఈ ప్రపంచ భవితం.

అక్షరములతో చెలిమి చేయుచూ
ఆయుధములుగా అవతరించుతూ
అవరోధాలను అంతం చేసే
శక్తి యుక్తుల జ్ఞాన దళం
లక్ష్య ఛేదనలో క్షిపణి విధం.

చదువు సంధ్యలలో వారే సాటి
ఆటపాటలలో కూడా మేటి
ప్రజా పాలకధికార సేవకులు
అన్ని పదవులనలంకరించే
రేపటి భారత ఉజ్వల భవిష్యత్
వారధులూ, సారథులూ వారే..!

మారిన కాలం, పెరిగిన వేగం
జరిగిన విద్యార్జనకాటంకం
సెల్ ఫోనులలో చిక్కి యవ్వనం
ఆకర్షణలనే అలజడిలోబడి
కాలం విలువను కోల్పోతుంది.

యువ శక్తిని నిర్వీర్యం చేసే
మత్తు పానియం, మాదక ద్రవ్యం
అసాంఘిక అశ్లీల కృత్యములు
మగువల స్నేహం, మరో ప్రపంచం
విద్యాలయాల సరిహద్దు లోని
ఉచ్చులలోబడి బానిసలయ్యి
బలియౌతున్నది నేటి యువతరం
కాపాడాలి కలిసి అందరం.
రేపటి సమాజ శ్రేయసు కోసం
బాధ్యతతో నడవాలి నవతరం.



–తాడిచెర్ల రవి(తార)
8919800447

## మృదువైన పలుకులు

మృదువైన పలుకులు
అమృతాన్ని చిలుకు
తేట తేనియ లొలుకు
మనసు భావన తెలుపు

కఠిన వాక్కుల ఘాటు
కలచి వేయును హృదిని
తెప్పించును కంట నీరు
ఎదుటి వారికి చేటు చేయు

ముక్కు సూటి తనమనే
ముసుగు కప్పుకొని
విసిరేస్తా మాటల తూటాలనంటే
గాయమవుతాయి పలువురికి

మంచి పలకరింపులు
పన్నీటి చిలకరింపులే
చిరునవ్వే మది దర్పణం
కలుషితం కారాదెప్పుడు

పుట్టుకతో ఏడ్చినా
నవ్వుతూ బ్రతకాలి
నాలుగు కాలాలు పుడమిన
నాణ్యమైనది నవ్వే



–లక్ష్మి మదన్
9959186838

## చూపు

చూసే చూపులో కూడా
కొన్నిసార్లు నిజం లేదు
ఊహల పొరలన్ని కంటి చూపును
కప్పేస్తునే ఉన్నాయి.

అది నిజాన్ని చూస్తూనే
అబద్దాన్ని ఊహించుకొని
అదే నిజమనే ఊహలోనే ఉంది.

చిమ్మ చీకటిలో కూడా
తాను ఏదో దృశ్యాన్ని
ప్రత్యక్షంగా చూస్తున్నాననే
భ్రమలోనే కాలం వెల్లదీస్తుంది.

మాయమాటలను నమ్మి
ఆశలకు లొంగిపోయి
తనకు తానే మోసపోయి
నిజాన్ని సైతం చూడలేక
చీకటి ప్రపంచాన్నంతా
తానే ఏలుతున్నట్లు నమ్మేస్తుంది.

ఊహ అంతా అబద్ధమని
చీకటి వెలుతురు వేరు వేరని
చూసే చూపును నిజంవైపే మళ్ళిస్తానని
ఆ మెదడు ఎప్పుడు సంకల్పిస్తుందో..



–పోలీస్ భీమేశ్
9505255218

## స్వతంత్ర భరతావని ఎలా వుంది ?

స్వాతంత్ర్యం పొందినట్టి భరతావని ఎలావుంది ?
ఒక్కసారి పరికించు నిదానంగ గమనించు

మేధావుల మెదడులన్ని మెకాలే విధానంలో
భారతీయతను మరచి భావదాస్యమును పొందగ
మాతృభాషనే మరచి పరభాషను నేర్చుకొనగ
మన సంస్కృతి ఎక్కడుంది మన ధర్మం ఏమైంది ?

గద్దెనెక్కె లక్ష్యముతో పెద్దలు యుద్ధాలు చేస్తు
ఓట్లకు నోట్లను పంచి ఓటర్లను కొనుక్కొనే
రాజకీయ నాయకులకు స్వాతంత్ర్యం వచ్చింది
అవినీతి మహామహులకు స్వాతంత్ర్యం వచ్చింది

ప్రజలకోసమని చెప్పిన ప్రజాస్వామ్యమెక్కడుంది ?
విధి విధానములు లేని విచ్చలవిడి తనం పెరిగి
స్వార్థపరుల చేతిలోన భరతభూమి నలుగుచుండ
ప్రజల ఆశలన్నిగూడ ఆవిరయ్యి పోవుచుండె

అడుగడుగున మోసాలు అంతటా విలాసాలు
భారతీయ పౌరులంత బాధ్యతలను మరిచారు
క్లబ్బులల్లో పబ్బులల్లో విశృంఖల విజృంభన
నాగరికత మాయమయ్యి ఆటవికత పెరిగి పోగ

గాంధీజీ కలలుగన్న గ్రామరాజ్యమేమైంది ?
రాక్షసులు లేనియట్టి రామరాజ్యమెక్కడుంది ?
ఆడపిల్లలకు రక్షణ ఎక్కడుంది, ఎక్కడుంది ?
వివేకుడు కలలు గన్న నవభారతమేమైంది ?



–బండిరాజుల శంకర్
9948050608

## పుడమి తల్లి కన్నీరు కారుస్తోంది

సిరి లొలికించే రతనాల భూమి
నేడు శోక దేవతలా మారిపోయింది
మణి మాణిక్యాలను
కురిపించే పుడమి తల్లి
నేడు శోకసంద్రంలో
మునిగిపోయింది
నాడు కాంతిపుంజాలతో
మిల మిల మెరిసే
ధరణి నయనాలు
నేడు కన్నీటి చారికలతో
తడిసి ముద్దయినాయి.
నాడు రతనాలొలికించే
భరతభూమి నేడు
గంజినీళ్లకు సైతం
ఆరాటపడుతోంది.
కరుణను కురిపించే ధాత్రి
నేడు ఓ కర్కశ చేతిలో
బంధీగా మారిపోయింది
అనుకోని అతిథిలా వచ్చిన
ఓ వైరస్ లక్షల ప్రాణాలను తీస్తూ
వీర విహారం చేస్తోంది.
నాడు మహనీయులు
నడయాడే భరతభూమి.
నేడు వేల విగత జీవులను
చూసి దుఃఖితురాలవుతోంది
ఓ వైరస్‌కు భయపడిన
మానవజాతి చీకటిగదుల్లో
మ్రగ్గుతోంది
సూర్య చంద్రులు చూపు
తారాడే నేల
తన ఎనలేని బిడ్డలను
కోల్పోతున్నందుకు
శోకదేవతలా కన్నీరు కారుస్తోంది.
సుగంధాలను కురిపించే
ప్రకృతి మాత
నేటి దుర్గంధాన్ని భరించలేక
నాశికా పుటలకు
మాస్కులు తొడుగుతోంది.
నేటి మానవావళి
ఆసుపత్రుల పాలైంది
నాడు పాడి పంటలతో
తులతూగిన పుడమితల్లి
నేడు శవాల గుట్టల పాలై
కన్నీరు కారుస్తోంది
ఈ వైపరీత్యానికి అంతం ఎప్పుడు?



–రాయవరపు సరస్వతి
9885656356

## అభివృద్ధి చెందుతూ..

ఏంతోచడంలేదు
ఎడారిలో ఒంటరితనంలా
మసకబారిన మనసు

బీదరికమే దేశాభ్యున్నతా
మెతుకు దొరకని మొహాల్లో
దుఃఖపు సూర్యోదయాలు

ధనమున్నది దాచుకోడానికేనా
కొంతైనా ధర్మం దాని పరమార్థం కాదా
కాలంచేసినపుడు ఏంతీసుకెలతాం

మలమలమాడే కడుపులో
రగిలే ఆకలి ఆర్తనాదాలు
చావుకు చిరునామా కేకలేనా

రైతుకూలిలందరు రాజులైతరంట
అధికారమేలేని అంధలాలిక్కడ
నీళ్ళు పారే పొలాలెవరో మరి

అభివృద్ధి ఫలాలెక్కడో
బీదవాడెవడు కోటలెక్కలేదు
స్విస్ బ్యాంకుల్లో నల్లధనమెవరిదో

సర్కారాసుపత్రిలో ఆరోగ్యముండదు
బడిలైతే వసతులుండవు
ఇవి సక్కగుంటే మాటెందుకింటవ్

నాయకుల మాటలగారడీలు
ఓట్ల మార్కెట్లో నిన్ను కొనేవరకే
అమ్ముడుపోయే బతుకులకలవాటాయే

నాయకుడెవరైనా వాళ్ళ మాటలు వారివేనాయే
మంచిచేసేందుకు నీ సుట్టమా
ఎవరైనా ఐదేండ్ల నాయకుడేనాయే

స్వాతంత్ర్యానికి సైతం
వయసుమీదవడి
ఊతంకోసం ఎదురుచూస్తోంది

మా ముత్తాతపట్టినుండి మారనిదొక్కటున్నది
పుస్తకాల్లో భావితరాలైనా
మారిస్తాయేమో చూడాలి

స్వాతంత్ర్యదేశాన సంబరాలనేకం
ఇదెప్పుడైనా ఒకటే మాట
అభివృద్ధి చెందు'తూ'న్న దేశమని



–సి. శేఖర్ (సియస్సార్)
9010480557

## గుడ్డ ముక్కైతే చాలు

అక్షరం అటుఇటు అయితే ఏంటి
భావం గుండెను ఆత్మీయంగా
అల్లుకుంటే చాలు.....
పాదంలో పదం తడబడితే ఏంటి
అర్థంలో అపశృతిలేకుండా
మూతబడిన హృది కవాటాలను
తెరిపిస్తే చాలు...
అక్షరం ఆకారం వంకరైతే ఏంటి
అభాగ్యుని ఆవేదనను భుజాన
ఎత్తుకొని ఊరేగిస్తే చాలు....
మాటలలో కోటలు దాటకుంటే ఏంటి
మట్టిలో మగ్గిన మంచితనంపై
కాసిన్ని అక్షరాలను చిలకరించి
మానవత్వమై చిగురింపచేస్తే చాలు
చెవుల్లో చిల్లులు పడేటట్లు గళంలో
బలం లేకుంటే ఏంటి? ..
ఆ అక్షరం.. ఎదుటి వారిలో దుఃఖమై
ఉబికే కన్నీటిని ఓదార్చే
చిన్న గుడ్డ ముక్కైతే చాలు
ఇవన్నీ ఉన్నా స్పందించే హృదయం
లేకుంటే ఏంచేస్తాం ఇరుకైన
తత్వాలు దుడ్డుకర్రలా
అడ్డుకాలు వేస్తే చేసేదేముంది
ముక్కుమూసుకొని అడుగును
అంగలుగాచేసి
మురికిని దాటేసి పోవటం తప్పితే..



–కొప్పోలు యాదయ్య
9494273703

## వనితా నీకు నమోస్తు

వెయ్యి అడుగు వెయ్యి
భరతమాత బిడ్డవై అడుగు వెయ్యి
రాణి రుద్రమ స్ఫూర్తి తో అడుగు వెయ్యి
వీర వనితవై అడుగు వెయ్యి
అనురాగం లో అమ్మ వై అడుగు వెయ్యి
అరుణ తార వై అడుగు వెయ్యి
ఆప్యాయతలో చెల్లి వై అడుగు వెయ్యి
ఆలంబనలో అక్క వై అడుగు వెయ్యి
సౌందర్యం లో లహరివై అడుగు వెయ్యి
విజ్ఞాన సరస్వతి వై అడుగు వెయ్యి
కరుణ లో కామాక్షి వై అడుగు వెయ్యి
సంధ్యా కాంతుల్లో శ్రావణి వై అడుగు వెయ్యి
సూర్యా కాంతుల్లో కిరణమై అడుగు వెయ్యి
వెన్నెలలో జాబిలి వై అడుగు వెయ్యి
నింగిలో ధృవతారలా అడుగు వెయ్యి
పుడమిలో పున్నమి లా అడుగువెయ్యి
గాలి గమకానివై అడుగు వెయ్యి
సంద్రంలో నావలా అడుగు వెయ్యి
ఆది పరా శక్తిలా అడుగు వెయ్యి



–చిటికెన కిరణ్ కుమార్
9490 84 1284

## సమాజమా... ఆలోచించు

అక్షరాలతో జ్ఞానాన్ని అందించి
అంధకారంలో ఉన్న జీవితాలకు
వెన్నెల వెలుగులు ఇచ్చేటోళ్లం.
నల్లని మేఘాల్లాంటి
నల్లబల్లపై , తెలుపు రంగుల
పదాలతో , వాన జల్లులాంటి
చినుకులు కురిపించే
విద్యా సంపదను అందించేటోళ్లం.
పుస్తకములో ఉన్న విజ్ఞాన సంపదను,
మల్లెపూల తీగలు అల్లినట్లు,
పర్వతాలపై నుండి నీటిదారలు పారినట్లు,
పాఠాలను పదిలంగా చెప్పేటోళ్లం.

పదిరూపాయల జీతానికి
వెలకట్టలేని శ్రమదోపిడి జరుగుతున్న
వృత్తినే నమ్ముకొని బతుకుతున్న వెర్రివాళ్ళం.
చదువులమ్మ వృక్షానికి చెదలేదో పట్టుకుంది.
ఎండిన ఆకుల్లాగా రాలుతున్నాయ్
ప్రై"వేటు" బతుకులు.
బతుకుభారమై బజారుణపడుతున్న
కన్నెత్తి చూడడం లేదు పాలకులు.
ఏ పాపం ఎరుగని బడి పంతుళ్ళు
పదో పరకో కూలీకి కదులుతున్నారు.
నాడు ర్యాంకుల పంటలకోసం
దినరాత్రులు దారపోసిన వారు....

నేడు పొట్టగడవడం కోసం...
పడిగాపులు కాస్తున్నారు..
ఓ కనికరం లేని కాల(స)మా(జ)మా
ఒక సారి ఆలోచించు....
గురువుకు వచ్చిన కష్టాలను గుర్తించి
అండగా నిలువు.....



–అశోక్ గోనె
సెల్. 9441317361

**నేటినిజం చందా వివరాలు**

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం||రాలకు రూ.700/-, 10 సం||రాలకు రూ 1200/- మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.
లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660,
Gandhi Nagar Branch,Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.
'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.

## కొత్తగొంతులో పాతపాట

చుట్టూ ఉన్న మురిపించే అందాలను
ఏరి కోరి ఎన్నుకుని సుందరమైన
కవితా మాలను అల్లాలనుకొన్నాను
సున్నిత పదాలతో
సుతారంగా అలంకరించి
పద్యకన్నియకు సొబగులు
అద్ది కవిత్వం షోకేసులో
ఆనందంగా ప్రదర్శించాలనుకున్నా

పుడమిని కప్పి విప్పారిన పచ్చదనాన్ని
విరబూసిన పూల సోయగాలను
మైమరిపించే పదశిల్పంతో
నగిషీలను అద్ది
మురిసి పోదామనుకున్నా

పద్యంలో గొప్ప అందాలను ఇమిడ్చి
సరికొత్తపాటను అల్లాలనుకున్నపుడెల్లా
కంటి ముందు కనిపించే
పరిమళాలను పంచి జాలిగా
వాలి నేలరాలిన నిన్నటిపూల విలాపం
ప్రకృతికి పచ్చదనాన్ని తొడిగి
మోడై గాలికెగిరిన ఎండుటాకులు
నలువేపులా కన్నీటి కొలనులైన
నిర్భాగ్యపు ఆకలి కళ్ళు
నన్ను నిలదీస్తూ ఎదురుగా
తెరలా నిలిచి నిలదీస్తుంటే....
అంతవరకు అల్లుకున్న పదాలన్నీ
మంటలై నన్ను దహిస్తూ
నా పాటను, నన్నూ అచేతుడ్ని చేసి
అపురూపంగా అల్లుకున్నకవితలో
నా అంతరాత్మ ప్రతిరూపమై
కోటి గొంతుకలై పాత పాటనే
కొత్త కవితగా ఆలపిస్తున్నాయి



-డా. కె. దివాకరా చారి
9391018972

## బహుదూరపు బాటసారి

నడుస్తున్న నే నడుస్తున్న ఒంటరిగా
జీవన ఎడారిలో బహుదూరపు బాటసారిలా
అడుగులు తడబడుతున్న
ఏదారి కనుచూపు మేరలో కనపడకున్న
గమ్యం గగనమేనా శ్రమ వ్యర్థమేనా
ఎన్ని ఎత్తుపల్లాలు చూడాలో
ఇంకెన్ని కష్టాల ఇసుక తిన్నెలపైన నడవాలో
దూరం తరగడంలేదు వయోభారంమీదపడుతున్నా
బంధాలు అనుబంధాలు అగమ్యగోచరంగా
ఆప్యాయతలు అనురాగాలు స్వార్థపూరితంగా
రక్తసంబంధాలు మరిచిపోయిన జ్ఞాపకాలుగా
మానవతా విలువలు వలువలుగా తీసివేస్తుంటే
ఏమిచెప్పలేక, ఏమీ చెయ్యలేక
శిలగా నిలబడి ఉన్నా
కలగా మిగిలిపోతున్నా
నావారే నాకు పరాయివారై
నన్నే మోసం చేస్తుంటే
ఎవరికి చెప్పాలి నా వేదన
వినేవారేరీ? వినిపించడానికి
చేరదీసే వారేరీ? ఓదార్చడానికి
నన్ను నన్నుగా కొత్తగా పరిచయం చేయడానికి
గతం,వర్తమానం మరిచి పోలేక
భవిష్యత్తును ఊహించలేక
అంతేలేని మదిలోని ఆవేదన!
అందుకే ఇది నా అరణ్యరోదన!!



-వైద్య మధుకర్
చరవాణి:8125892580

## హృదయ స్పర్శ

మొహమాటపు పలకరింపులు
పైపైన కృత్రిమ నవ్వులు
పొడి పొడి సంభాషణలు
నేటితరంలో సర్వసామాన్యం !

నిజమైన ఆత్మీయ పలకరింపు
మనసు పొరలను కదిలిస్తుంది !

ఆప్యాయతతో నిండిన మాటలు
గుండె గదిలోని తడిని తడిమి చూస్తాయి !

హృదయాంతరాలలో నుండీ
పలికే పలుకులు పంచదార
చిలుకలవలె మనసుకెంతో
మాధుర్యాన్ని అందిస్తాయి !

అనురాగంతో కూడిన సంభాషణ
గుండెలోతుల్లో నుండీ వచ్చే మాటలు
ఎదుటివారి హృదయాన్ని స్పృజించి
వారి మదిలో కదలికలు కలిగిస్తాయి !

దేహసౌందర్యం చూపులకు
ఆనందాన్నిస్తుంది
కానీ. ...
మనోసౌందర్యం మనసుకు
హాయినిస్తుంది !

భౌతిక సౌందర్యం ఎంత ఉంటేనేం
మానసిక సౌందర్యం లేని
మనిషి జీవితం వ్యర్థం !!!



-లక్ష్మి పద్మజ దుగ్గరాజు
9866328747

## అమ్మ కోసం

ఆత్మీయతకు, అనురాగాన్ని
అభిమానాన్ని, మమకారాన్ని
మృదువుగా మురిపించి, కరుణించి
కడుపులో దాచుకొనే కమ్మనైన
హృదయానందాన్ని రంగరించి
ప్రేమ అనే అమృతాన్ని పంచేదే
"అమ్మ ......."
ప్రపంచంలో ని తల్లులందరూ
స్పందించిన రక్తమే " సూర్యోదయం"
దేవతలందరూ అమృతాన్ని ఆస్వాదించి
అమరత్వాన్ని పొందితే అటువంటి అమృతాన్ని
ప్రేమ రూపంలో భూమి మీదకు
"అమ్మ" అనే దేవతను పంపిన అమ్మ
కన్న గొప్పేమీ కాదు.... " బ్రహ్మ "
అమ్మ తన కడుపును మాడ్చుకోని
మన కడుపు నింపుతుంది.
తన రక్తాన్ని పాలుగా మార్చి మన ఆకలిని
అమృతంగా ఇస్తుంది .
తన సహనాన్ని సహసంగా ఎదుర్కొంటోంది.
అందుకే అమ్మను " మాతృదేవోభవ" అన్నారు.
మన హృదయాకాశంలో నిరంతరం వెలిగే
సూర్యుడి మన అమ్మ
తన ఒడిని బడిగా చేసి భాషని, బంధాలను
సర్వస్వం నేర్పిన భాషా శాస్త్రం అమ్మ
అందుకే అమ్మ కు ఇవే
నందన వందన భందన
వేవేల కోటి కుసుమాల దండాలు.??



-దేశిని శ్రీధర్
849818284

# మానసికోల్లాసానికి, వ్యక్తిత్వ నిర్మాణానికి అమృత గుళికలు "పెద్దల మాటలు"






10,016 సూక్తుల ఉద్గ్రంథం "పెద్దల మాటలు" సంకలన కర్త సిరిగాద శంకర్. పాశ్చాత్య, ప్రాచీన, ఆధునిక, సాహితీవేత్తలు, శాస్త్రజ్ఞులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, రాజకీయ కోవిదులు, సామాజిక సేవాతత్పరులు వివిధ సందర్భాల్లో ఉటంకించిన విలువైన మాటలను సూక్తులుగా అభివర్ణిస్తు 650కి పైగా పుటలలో నిక్షిప్తం చేసి మనకు అందిస్తున్నారు శంకర్. మహా మహుల ఆలోచనలు, అనుభవాల సారమే ఈ సూక్తులు. మానసికోల్లాసానికి, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే ఈ సూక్తులను చదివి ఒంట బట్టించుకోగలిగితే, ఆచరణలోకి తేగలిగితే విలువలతో గూడిన అత్యుత్తమ సమాజం పరిఢవిల్లుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. జాతి, సమాజ, దేశాభివృద్ధికి దోహదపడే అనర్ఘ రత్నాల్లాంటి సూక్తులతో స్ఫూర్తి పొంది, నేటి యువత తమ వ్యక్తిత్వ నిర్మాణానికి సోపానాలు నిర్మించుకోవచ్చు.

సూక్తి అంటే మంచి మాట. పెద్దలు చెప్పిన సద్దిమూట. వారి అనుభవాల ఊట. శైశవ దశ నుండే పిల్లలకు ఔషధంలా చెవుల్లో నూరి పోస్తే బంగారు భవిష్యత్తు దిశగా వారి ఎదుగుదల సాగుతుంది. పాఠకుల సౌకర్యార్థం ఎంతో శ్రమకు ఓర్చి సూక్తులన్నింటినీ అకారాది క్రమంలో పేర్చి అందిస్తున్నారు సిరిగాద.

సిరిగాద శంకర్ బాలసాహితీవేత్త. కథ, నవల, కవిత్వం ప్రక్రియల్లో పలు గ్రంథాలు వెలువరించడమే గాక ఆధ్యాత్మిక రచనలు కూడా చేసిన సృజనకారుడు. ప్రతి ఏటా తన తండ్రి సిరిగాద నరసయ్య గారి పేరిట ఓ ప్రముఖ సాహితీవేత్తకు పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరిస్తున్న సాహిత్యాభిలాషి.

నందిని సిధారెడ్డి, పత్తిపాక మోహన్‌గారలు పీఠికలందించిన ఈ గ్రంథాన్ని మహాకవి డా॥సి. నారాయణరెడ్డిగారికి అంకితమిచ్చారు సంకలనకర్త శంకర్.

కొన్ని సూక్తులు పదే, పదే పునరావృతమైనా.. మంచి మాట ఎవరు చెప్పినా వినాల్సిందే, ఎన్నిసార్లు చెప్పినా ఆస్వాదించాల్సిందే, ఆచరించాల్సిందే. మనస్సుకు బలంగా హత్తుకు పోవాలని సూక్తుల పునఃశ్చరణ జరిగి వుండవచ్చు.

వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్నా, పెద్దా అందరూ చదవాల్సిన, దాచుకోవాల్సిన ఉద్గ్రంథాన్ని అందించిన సిరిగాద శంకర్ ప్రయత్నం అభినందనీయం, ప్రశంసనీయం.

**ప్రతులకు:** సిరిగాద శంకర్
ఇ.నెం. 4-94/ఎ, కాకతీయ నగర్ కాలనీ
దేవునిపల్లి, కామారెడ్డి జిల్లా-503 111
సెల్: 9493301985



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

పుస్తక సమీక్షలు

# శ్రీ హనుమత్ సహస్ర పద్య రత్నావళి..

వృత్తిపరంగా మూడు దశాబ్దాలకు పైగా విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులుగా సేవలందించి.. రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచుకుని విశ్రాంత జీవనాన్ని కొనసాగిస్తున్న పద్యకవి అడపాల నరసింహారెడ్డిగారు ' శ్రీ హనుమత్ సహస్ర పద్య రత్నావళి' పేరుతో ఓ పద్యకావ్యాన్ని వెలువరించారు. మాతృభాష తెలుగు పట్ల మక్కువ చూపే ఆయన ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సమయంలోనే అనేక మంది తమ శిష్యులకు ఛందోరీతులను తెలియజేశారు. అధ్యయనం పట్ల సృజన పట్ల ఆసక్తి చూపే ఆయన హనుమంతునిపై అపారమైన భక్తితో "జయహో హనుమా" అంటూ ద్విశతి కందపద్య కృతిని మొట్ట మొదట వెలువరించారు. అంతటితో తృప్తి నొందక.. మళ్లీ ఒక వేయి కంద పద్యాలతో 'శ్రీ హనుమత్ సహస్ర పద్య రత్నావళి' కావ్యాన్ని ప్రకటించారు.

హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ప్రాంతం లో ఉన్న దుర్గానగర్ కాలనీ వాస్తవ్యులుగా ఉంటూ.. ఆ కాలనీ ఆంజనేయనేయస్వామి దేవాలయ కమిటీ కోశాధికారిగా సేవలందిస్తూ నిత్యం హనుమంతుని స్తుతిస్తూ తరిస్తున్నారు. నలభై ఏళ్ల క్రింద ఆయన ప్రియశిష్యునిగా వెలుగిందిన ఆచార్య మసన చెన్నప్పగారి సాహిత్యంపై సమగ్ర అధ్యయనం చేసి ఆయన మీద ఓ గ్రంథాన్ని సమగ్ర అధ్యయనం చేసి ఆయన మీద ఓ గ్రంథాన్ని ప్రచురించి తమ ఔదార్యాన్ని, ప్రేమను చాటుకున్నారు.

**ఎక్కడున్నావని**
**యెరుగుదు నిన్ను?**
**దిక్కులెల్ల నేను తిరిగితి స్వామి!**
**అక్కడా ఇక్కడా అందందు వెతికి**
**నిక్కముగా నేను నీవున్కి గంటి!** అంటూ స్తుతిస్తూ ప్రారంభమైన ఈ కావ్యంలోని వేయి కంద పద్యాల్లో కవి అడపాల నరసింహారెడ్డిగారు హనుమంతునిపై భక్తి శ్రద్ధలు ప్రకటిస్తూ.. హనుమంతుని వ్యక్తిత్వాన్ని.. సంస్కారాన్ని.. వినయాన్ని.. కర్తవ్య దీక్షను.. సామాజిక స్పృహ వంటి అంశాలను అందంగా ఆవిష్కరించారు.

**రానా రానే రానా!**
**రానని నేనను రారా! రమ్మన రానా!**
**నానా నోరే నిన్నని**
**నా నోరా రెనుగ నీట వాన్పర హనుమా!** అంటూ రాసిన పద్యంలో అనుప్రాసాలంకారంకు పట్టం కడుతూ కవి తమ రచనా ప్రతిభను ప్రదర్శించారు.

**పుట్టించు వాడె దేవుడు**
**గిట్టించునతడె, రచించు, గిరులన్, తరులన్**
**చిట్టి అడవులన్, జలముల**
**మట్టిని, వాయువులనిచ్చి మనడే హనుమా!**
అంటూ రాశారు.

ఇలా హనుమంతుని గుణ గణాలతో రూపుదిద్దబడిన ఈ కావ్యంలో కవి అడపాల నర్సింహారెడ్డిగారు హనుమంతుని నిరంహకార లక్షణాన్ని... శ్రీరాముని పట్ల సీతపట్ల ఆరాధనా భావాన్ని అందమైన పదబంధాలతో పద్యాలను తీర్చిదిద్దారు. పరహితమే పరమావధిగా భావించిన మారుతి యొక్క సుగుణాలను విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు.

**సింధూర సేవ చేతుము**
**గంధమును గళమున పూసి కరములు మోడ్చన్**
**అందముగ తీర్చి దిద్దగ**
**చిందులు వేయుచు భజనము చేతుము హనుమా!**
అంటూ కవి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

**హనుమంతుని భజన చేస్తే ఒనగూరే ప్రయోజనాలను తెలుపుతూ ఇలా రాశారు.**
**హనుమని భజన మహిమనే**
**మని చెప్పుదు దుఃఖములను మార్చును వేగన్**
**మనసార దీవెనల నొస**
**గను కరుణ గలిగి సుజనుల కోర్కెలు దీర్చున్**
అంటూ రాశారు.

ఇలా ఇందలి పద్యాల్లో హనుమంతుని గురించిన అనేక విషయాలను ఔచిత్యవంతంగా నిక్షిప్తం చేసిన కవి అడపాల నరసింహారెడ్డిగారు శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ప్రతులకు: శ్రీమతి ఎ.భారతి
7-2-7/146, రోడ్ నెం.8
దుర్గానగర్ కాలనీ, భైరమల్‌గూడ
హైదరాబాద్-79
సెల్: 94903 54579






-దాస్యం సేనాధిపతి
సెల్: 9440526644

## ఊరి చివర గుడిసెలు

చాతుర్వర్ణ వ్యవస్థ నాలుగు పడగల
నాగుపాము బుస కొడుతుంది
కులం నిచ్చెనలు కూలి పోలేదు
"మనువాద సిద్ధాంతం" మాసిపోలేదు
కులపు జ్వాలలు ఆరిపోలేదు

ఉందామంటే గూడు లేక
పందామంటే నీడ లేక
దున్నుదామంటే శారడు చెక్క లేక
పొట్ట కూటి కోసం
సెప్టిక్ ట్యాంక్ లో మునుగుతున్నం
మురిగి కాల్వలో తేలుతున్నం
కాట్లో కాపురం చేస్తున్నం
అనాదినుండి బతుకు చక్రం ఈడుస్తున్నం

మా మగువలన్నా , మా నెలవంకలన్నా
అగ్రజులు కంట్లో కారం పోసుకుంటుర్రు
నాలుక తెగ్గోయడం, వెన్ను విరిచేయడం
ఏమిటీ ఉన్మాదం? ఎవడిచ్చిర్రి అధికారం ?
మీ తల్లి, చెల్లి, అక్క గుర్తుకురారా !
ఊరి చివర గుడెసెలపై ఇంత
ఉక్రోశం, ఉక్కుపాదం ఎందుకు?
సమాజంలో కలుపుమొక్కల్ని ఏరెయ్యాలి
బూర్జువాల బూజును దులిపెయ్యాలి
దళితులపై దాడులను ఆపెయ్యాలి
రాజ్యాంగానికి తూట్లు పొడవడం
మానెయ్యాలి
కులాల కంపును కడిగెయ్యాలి



-తాటిపాముల రమేష్
7981566031

# డా॥భీంపల్లి శ్రీకాంత్ 'పసిడీ నానీల' అద్భుత కవితా వెలుగులు






తెలుగు సాహిత్యంలో నాలుగు పాదాల కవితా రీతిలో, మలి రెండు పాదాలలో అంతర్గత భావాల అక్షర దివ్వెలను అంతరంగం లో వెలిగించే నానీలు, కవితాకాశంలో తళుకులీనే హృదయ స్పందనలు. 1997లో నానీల నాన్న డా॥ఎన్.గోపి సృజనాత్మక ఆవిష్కరణగా తెలుగు కవితా వినూత్న ప్రతిభా ప్రక్రియగా విలసిల్లుతున్న నానీలు పుంఖాను పుంఖాలుగా వెలువడుతున్నా, అన్నీ నిలబడేవి కావు. డా॥భీంపల్లి శ్రీకాంత్, కవితా రచనలోని తన ప్రావీణ్యాన్ని, పసిడి నానీలుగా మలుపు తిప్పటం ఆ ప్రక్రియకు జీవం అందించటమే. ఈ సంపుటిలో 56 పేజీలలో 168 నానీలు, మరో 56 పేజీలలో చిత్రకారుడు మహేష్, భావ సౌందర్యాన్ని రేఖాచిత్ర సదృశ్యంగా ప్రచురింప చేశారు. నానీలో కవి పొందు పరిచిన భావ రహస్యాన్ని ఒక చిత్రం ద్వారా గ్రహింప చేసే అవకాశం కల్పించటం యిందులో ప్రత్యేకత. కవిత్వం అందరూ అనుభవించి ఆస్వాదించి, పరవశించే ప్రక్రియ కాదు. డా॥శ్రీకాంత్ తొలి పలుకుల 'స్వాగతం'లో పేర్కొన్నట్టుగా పసి(డి) నానీలు పండాయోలేదో చదువరులే తేల్చాలి. సంపుటి రూపంలో వెలువరించిన ఈ నానీలు శ్రీకాంత్ కవితా పూదోటలో పూచిన పుష్ప సౌరభాన్ని వెదజల్లుతూ ఆకట్టుకొంటున్నాయి. "నానీల సేద్యం మొదలెట్టాడు పసిడి పంటను కలగంటున్నాడు" అన్న కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డి అభినందనలు అక్షర సత్యంగా ఈ సంపుటి రుజువు చేసింది. "వికసించింది కమలం కాదు కమలాప్తున్ని ప్రణయస్పర్శ" పుస్తకం ఒక జ్ఞానదీపం దాని వెలుగు పైకి కనపడదు" అంటారు అద్భుతంగా. ఈ నానీల ఇతివృత్తాన్ని పరిశీలిస్తే, అధిక సంఖ్యలో 'కవిత్వం, అక్షరాలు, పుస్తకం, కలం, చదువు, గురువు వంటి బాహ్య అంశాలున్నాయి. శ్రీకాంత్ ప్రతిభావంతమైన హృదయాన్ని కదిలించగల కవిగా సాహితీవేత్తగా సుపరిచితులు అయివుండీ, వస్తు వైవిధ్యాన్ని అంతగా పట్టించుకోలేదని అనిపిస్తుంది. "వాన రాకతో నేల నవ్వింది". "తడారిన గొంతు దాహం తీరింది", "కవి మనసు గాయపడింది కొత్త గీతమే దానిరి మందు "ఆమె ముందు మనసంతా విప్పాను అంతే ఇద్దరిలో ప్రేమ తుఫాను", "నానీలు ఏం చేస్తాయి జీవితాన్ని వడబోసి సారాన్ని వెలికితీస్తాయి" "వాకిలి పల్లె ముంగిలి అందరినీ కలిపే ప్రేమ జాబిలి". "ఈ రోజు గుండె తడిగా ఉంది కారణం తెలిసింది కవిత్వం రాశాను" ఆత్మానుభవం కవిత్వానికి ప్రాణం శ్రీకాంత్ ఆత్మాశ్రయంగా వెదజల్లిన నానీలు నిస్సందేహంగా కవి ప్రతిభా నైపుణ్యాన్ని వ్యక్తీకరిస్తున్నాయి. ప్రేమ, వేదన, సంఘర్షణ, సంక్షోభం, రుగ్మతలు, దైన్యం, మానవత, సామాజిక స్పృహ, అణచివేత వంటి అంశాలను నానీలుగా సృష్టించగలిగే కవితా హృదయుడైన డా॥భీంపల్లి శ్రీకాంత్ నుండి మరొక అద్భుత నానీల సంపుటి రావాలని కూడా ఆకాంక్షిస్తూ హృదయ పూర్వక అభినందనలు.

ప్రతులకు: డా॥భీంపల్లి శ్రీకాంత్
8-5-38, టీచర్స్ కాలనీ,
మహబూబ్‌నగర్-509 001
సెల్: 9032844017



-జయసూర్య
సెల్: 9440664610

## పాల పిట్టా ! పాలు పోవడంలే !

అంతా నీరు నీరు
పండగ పట్టాలు ఎక్కి ఎలా వస్తుంది
కట్టలు తెగిన చెరువులతో ఇండ్లూ కబ్జా
ఎన్ని అగరొత్తులు పెట్టినా
వరద వాసన ముందు
ముక్కుకు పరదా వేసుకున్నట్లే
పాల పిట్టా ! పాలు పోవడంలే !
పాలవాడు తలుపు కొట్టడంలే
పట్నమైనా పిల్లలకు పాల కరువే
ఛాయ తాగాలంటే పడవ పై చౌరస్తాకు
ప్రయాణం కావాల్సిందే !
ఉన్న బట్టలే నాని బురద బురద
కొత్త బట్టల కథ ఎక్కడిది
ఇంటి పైన ఒక్క హెలికాప్టర్ ఎగరలే --
పాలపిట్ట ఎగిరి ఎలా వస్తుంది !
మొగులైదంటే భయం మబ్బులు!
చుట్టూ వరద నీరు ఇంకలే
కన్నీరూ ఇంకలే !
ఇప్పుడు పిడుగులు వాన కాదు
పై నుండి ఆహార పొట్లాలు పడితే బాగుండు



- కందాళై రాఘవాచార్య
8790593638

## కరోనా! వెళ్ళిపోవా!

ఒకరు విషాదమై కూలబడుతున్న వేళ
ఓదార్చే చేతులం కాలేక,
ఒకరు ఆనందమై విరుస్తున్నపుడు
శ్రుతికలిపే గొంతులం అవలేక,
ఆపదల తాకిడికి అతలాకుతలమౌతున్న ఆత్మీయతలను
అనునయించ వీలుగాక,
కళ్ళముందు తగలబడుతున్న వసంతాలకు
అండగా నిలబడడం కుదరక,స్పర్శలు కోల్పోయి
మొద్దుబారుతున్న మనసులమౌతున్నాం,
స్పందనలు ఆవిరౌతున్న గుండెమూల్గులమౌతున్నాం,
సహకారమన్న పదం స్థాణువౌతున్నది
మమకారరాగం మౌనరోదనౌతున్నది..
కరోనా! మాలోని మనిషి మాయం కాకముందే
మము విడిచి వెళ్ళమ్మా!
బలహీనమౌతున్న మానవత్వం పట్టుతప్పిపోకముందే,
మాలోకం నుండి నడిచి పోవమ్మా!.
మా తప్పిదాలను ఒప్పుకుంటున్నాం
మా తీరును మార్చుకుంటున్నాం
మాకు సంఘజీవనం ప్రసాదించమ్మా!
మమతలప్రపంచంతో
సహజీవనం అందించమ్మా!



-డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

## సంఘర్షణ

ఏముంది మధ్యన ?
అలిగలిగి వెళ్ళి పోతున్న ఆత్మీయతని
తోడుకొచ్చి పెట్టుకోవడం తప్ప

విభేదించడమే..విసుగుల్ని విసిరేయడమే విజయమా ?
గుండెలపైన రవంత అభిమానం
రెపరెపలాడి ఎంతకాలమైంది !

చిటపటలను ఎంతని కాచుకునేది
చిరునవ్వుల కింద..చీరాకుల నెంత సేపని దాచేది?

ఎప్పుడు వాడిపోతుందో
ఉండీలేనట్టున్న పచ్చదనాల పాశం
అనుబంధపు వేరు దిగింది అంతంతమాత్రమే
ఎందులో చెరిసగమో.. ఎప్పటికీ తేలదు

భావాల ఎడబాటు ఏడిపిస్తుందేమో..
నచ్చచెప్పినా..నీరు కారిపోతుందా ఎద

కేజీల కొద్దీ నిబ్బరాన్ని..
సంచుల కొద్దీ సంయమనాన్ని
వెంటబెట్టుకు తిరగుతూనే...

కొత్త కొత్త సర్దుబాట్లు
ఉన్నపళంగా ఊపిరి పోసుకుంటున్నా..

ఎక్కడో హృది అడుగున చిల్లు పడిన భావన
సంఘర్షణల సుడిగాలేదో..
విలవిలలాడించిన భావన

బంధమేదో భళ్ళున పగిలినట్టుగా...
భయపెడుతూనే ఉంటుంది

మనసు పై దాడులకు నిరసనగా
కలలు కదిలెళ్ళిపోతుంటే..
పట్టి ఆపలేనితనమేదో..కుంగదీస్తుంది

ఈ మధ్యలో..
పదేపదే పగిలే..ఓరిమి ముక్కలను
ఏరుకుంటూ...అతికించుకుంటూ..

కాపురమూ.. కమ్ముకున్న పొగ మంచులాంటిదే..
అపురూపంగా..అలరించినట్టే..ఉంటుంది
అగుపించని అవరోధమౌతుంది

ఆఖరికి ఒకే అనుభవ పాఠం..
అన్యోన్యతంటేనే అందంగా ఏకీభవించడం !

-దారల విజయ కుమారి
9177192275

## వర్షాన్ని మోస్తున్నా

నా కనుల సంద్రంలో
ఇండ్లు పారుతున్నాయి.
మనుషులు తెప్పల్లా తేలుతున్నారు .

వాహనాలు ఈదుతున్నాయి
గాలి క్రిమి పాట పాడుతోంది.

జీవితం అంత సజావుగా లేదు
వేలాడే శూన్యాన్ని
కాళ్ళకి సంకేళ్లుగా వేసి
నాల్గు గోడల ప్రపంచాన్ని రుచి చూపింది .

ఫేను రెక్కల్లో జీవితాన్ని తిప్పుకుంటూ
తెరల వెనుక చూపులు పరచుకుంటూ
మసక మసక గా దృశ్యం లేస్తోంది .

కళ్ళనిండా వర్షాన్ని మోస్తున్నా
రెప్పల పై తెప్పలు అలా వెళుతుంటే
నిర్లిప్తంగా ఆకాశానికి చూపులు అతికి
చేతులు ఆపన్న హస్తాలుగా ముడిపెట్టుకున్నాం .
మునిగిపోతున్నా ఎదురీదుతున్నాం .



-గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601

## నేటి నిజాలు



# సాహిత్య ప్రయోజనం తెలిసిన కవి

**నవంబర్ 1న ఆవిష్కరణ జరుగనున్న బహుగ్రంథకర్త డా॥ కుర్మాచలం శంకరస్వామి రాసిన "మబ్బుల మాటు" కవితా సంపుటికి ప్రముఖ కవి, విమర్శకులు డా॥ అమ్మంగి వేణుగోపాల్, ఆచార్య శ్రీమతి సూర్య ధనంజయ్ రాసిన ముందు మాటలు... -సంపాదకులు**

డాక్టర్ కూర్మాచలం శంకరస్వామి బహుగ్రంథకర్త మధ్య తరగతికి తన కవిత్వంలో పెద్ద పీట వేసినవాడు ముందుగా మంచి పాఠకుడు కావటం వల్ల తాను చదివిన పుస్తకాలలోని సారాంశాన్ని వంట పట్టించుకొని కవిత్వంలో ప్రకటిస్తుంటాడు. కష్టసుఖాల సారాంశమే జీవితం అనుకుంటే, ఆ జీవితానుభవ జ్ఞానం శంకరస్వామికి అవసరమైన దాని కంటే ఎక్కువేవుంది. అందుకే ఆయన అక్షరాలు స్వానుభవ సాక్షాత్కారాలు, ఆధ్యాత్మిక సాహిత్యం కూడా చదివినవాడు కావటం వల్ల భగవద్గీత వంటి గొప్పగ్రంథాలలోని నీతిని, తాత్వికతని కూడా ప్రదర్శిస్తుంటాడు. ఆయన గతంలో రచించిన పుస్తకాలకు 'ముందుమాట' రాసే గౌరవం నాకు దక్కింది. ఈ పుస్తకానికి కూడా 'ఏమైనా రాయండి సార్' అని అడిగినప్పుడు కాదనలేక పోయాను.

'మబ్బులమాటు' అన్న పేరే ఎంతో అర్థవంతమైనది. అసలైనదెప్పుడు చాటుమాటునే వుంటుంది. సూర్యుడు ఒక్కొక్కప్పుడు మబ్బులమాటున వుంటాడు చంద్రుడు కూడా చాటుమాటున వుంటాడు, కోకిల కూడా కొమ్మల్లో దాక్కునే వుంటుందన్నది కవితాత్మకంగా కూడా సత్యమే.

**'బండరాళ్ళ మాటున**
**గుండె మ్రోతలున్నట్టు**
**మండు టెండ మాటున**
**చల్లని నీడలున్నట్టు (మబ్బుల మాటు)**

అన్న స్వభావోక్తితో కూడిన చిత్రీకరణ వెనుక అగాధమైన భావాలున్నాయి. ఇవి అలంకారాలే కాదు. ప్రతీకలు కూడా, ఒక్కోసారి అభివృద్ధే వినాశనానికి దారులు వేస్తుంది.

**'ఈ నాడు**
**సిరిముల్లెల్లాంటి పల్లెలు పట్టణాలై**
**పసందైన పట్టణాలు కాంక్రేట్ జంగల్లై' (ఆకుపచ్చ యజ్ఞం)**

మనిషికి సమస్యలను సృష్టిస్తున్నాయని అంటున్నాడు 'సిరిముల్లెల్లాంటి పల్లెలు' అనటం ఎంతో కవితాత్మకంగా వుంది. గాంధీగారు గ్రామ్ స్వరాజ్ పథకాన్ని అమలు చేస్తే పల్లె స్వయం పోషకమై కవి ఊహించినట్లు సిరిముల్లె' లవుతాయి అన్నారు. శంకరస్వామిది కూడా అదే అభిప్రాయం. మనం పెద్దల మాట వినలేదు, వారి బాటన నడువలేదు అందుకే ఈ సమస్యలు వచ్చి పడుతున్నాయి దీనికి విరుగుడు తెలంగాణ ప్రభుత్వం అమలులో పెట్టినట్టు 'హరితహారం' ఒక్కటే

**'మధురజ్ఞాపకం' అన్న కవితను చూడండి.**
**'సుమధుర స్వప్నాల**
**రాగాలను ఆలపింపజేసేది పుట్టినూరే '**

ఇది 'నాస్టాల్జియా'కు సంబంధించిన కవిత. పుట్టిన ఊరిలో పెరిగివుంటే ఆ కాలవ్యవధికి సంబంధించిన స్మృతుల్లో కవి అన్నట్లు – 'ఇత్తడి చప్పుళ్ళకు పుత్తడి జ్ఞాపకాలు' ఈ పాదం ఒక గాఢమైన కవితా చింతన నుండి వెలువడింది. పాఠకుణ్ణి అనుభవైక వేద్యమైన లోలోతుల్లోకి తీసుకువెళ్తుంది.

మన తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరను గూర్చి, సమ్మక్క సారాలమ్మలను దేవతలుగా పూజించే మహోత్సవం గూర్చి శంకరస్వామి అల్లిన కవిత 'వనదేవతల వైభవం'' విశ్వాసాలు, మహిమలు, ప్రకృతి, స్త్రీశక్తి – అంతా ఒక్కటైన చిరస్మరణీయమైన సందర్భాన్ని శంకరస్వామి కవితామయం చేశాడు.



హైదరాబాదు ఆధునిక చరిత్రలో భాగమైన 'నుమాయిష్'' (ఎగ్జిబిషన్) కూడా శంకరస్వామికి కవితా వస్తువైంది.

**'అందాన్ని పెనవేసుకున్న**
**సామాన్య ప్రజల బంధాన్ని**
**కాపాడుకుంటూ కనువిందు చేసే**
**వస్తు ప్రదర్శనాలయం**
**ఈ భాగ్యనగర్ ఎగ్జిబిషన్ '**
**(వన్నెతగ్గని)**



అంటూ నుమాయిష్‌ను సౌందర్య దృష్టితో, సామాన్యజనుల అనుబంధాల దృష్టితో వర్ణించి ఆ మహోత్సవానికి న్యాయం చేకూర్చాడు.

మన ప్రాచీన విద్యావిధానంలో గురువు విద్యార్థిని భౌతికంగా దండించేవాడు. గోడ కుర్చీ, కోదండం – వంటి వాటిని నిర్భయంగా అమలు చేసేవాడు. తద్వారా గురువు సమాజం మీద ఒక ఆధిపత్యం స్థాపించుకునేవాడు. ఈ హృదయ విదారకమైన దండనలను తట్టుకోలేక బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకు దూరమైన ఉదంతాలెన్నో వున్నాయి. కొట్టకుండా బోధించి జ్ఞానామృతాన్ని పంచటంలో సంస్కారం వుంది. శంకరస్వామి ఈ ఆధునిక విద్యావిధానాన్ని సమర్థిస్తున్నాడు అందుకే

**' ఇప్పుడు మనకు కావల్సింది**
**మర్ధనం కాదు గుణవర్ధనం**
**దేహశుద్ధి కాదు ఆత్మశుద్ధి' (గుణమర్ధనం)**

అన్న అక్షర సత్యాలను పంచుతున్నాడు.

'ఆత్మవంచనేల' అన్న కవితలో మనకు కవిగా శంకరస్వామి అసలు రూపు కనిపిస్తుంది.

**'ఊపిరి ఉన్నంతవరకు పోరాడకుండా**
**నూరేళ్ళ ఆయుస్సు మున్నాళ్ళ ముచ్చట చేసి**
**మరుగున పడితే ఎట్లా?**

ఈ సంసారం ఈ పిల్లలు, ఈ ప్రేమలు ఈ పెండ్లిళ్ళు ఈ పరీక్షలు ఈ సంపాదన సహజమే. వాటికి భయపడి ప్రయోజనం లేదు. చీకటిని భయపెట్టే మిణుగురులా వెలగలేమా? అంటున్నాడు. నీడలాగా మరణం వెంటాడుతూనే వుంటుంది. మానసికంగా బలహీనుడైనవాణ్ణి లొంగదీసుకోవటమే మృత్యువు స్వభావం 'మిణుగురు' కున్నట్టే మనిషికి స్వయంగా ప్రకాశించే శక్తి వుంటే మృత్యువు దరిజేరదు అందుకే ఆత్మవంచన స్థానంలో ఆత్మవిశ్వాసం నింపుకొని ముందుకు సాగాలన్నది శంకరస్వామి సందేశం.

శంకరస్వామి స్త్రీ పక్షపాతి ఆ రకంగా స్త్రీవాద తాత్వికతను గౌరవించినవాడు. ఇందుకోసం 'అతివల అంతరంగాల్లోని ఈతిబాధలు, కవితానీతి బోధలు' అన్న ఆరవ విభాగాన్ని సృష్టించాడు అసలీ పుస్తకంలో ఇట్లూంటి మరికొన్ని విభాగాలు కూడా వున్నాయి. అంటే కవి సంపాదకుని పాత్రను కూడా పోషించాడన్న మాట స్త్రీలకు సంబంధించిన ఈ విభాగంలో పై కవితతో పాటు మరో తొమ్మిదింటిని సృష్టించాడు. వీటిలో 'వెన్నెల పొద్దాగదు' అన్న శీర్షిక కొత్తగా వుంది. 'పొద్దు' అంటే సూర్యుడు 'వెన్నెల పొద్దు' అంటే 'వెన్నెలవేళ' అనే అర్థంతో పాటు వెన్నెల సూర్యుడు అన్న అర్థంకూడా చెప్పుకోవచ్చు అట్లా చంద్రుణ్ణి సూర్యునితో సమానంగా నిలిపాడు.

' ఆకాశంలో సగం అవనిలో సగభాగమైన
ఆడజాతిని అమృతమూర్తులను..
ఎంత కర్కశంగా వ్యవహరించినా అంతం చేయలేరు '

అంటున్నాడు, ఎంతో ఆత్మవిశ్వాసంతో 'వెన్నెల పొద్దాగదు' అని భరోసానిస్తున్నాడు.

'శిశుర్వేదన' నాటకీయ శిల్పంతో సాగిన కవిత
'అమ్మా – అమ్మా పిలుస్తున్నది నేనేనమ్మా
దిక్కులు చూస్తావేందమ్మా
నీ కడుపులోని పిండాన్నమ్మా'

అంటూ మొదలవుతుంది. తల్లిలోని భ్రూణహత్యావాంఛను తొలగించటానికి– 'నిన్ను మీ అమ్మ ఇలాగే చేస్తే నీవు ఉండేదానివా?' అని వారిస్తుంది. గర్భస్థ శిశువును 'కర్కశంగా చంపటం పాపం' అని కరుణరసం చిప్పిల్లేలాగే మనవి చేస్తుంది. మనస్సు మార్చుతుంది ఇదే సాహిత్య ప్రయోజనమని నిరూపిస్తుంది !



**– డా॥ అమ్మంగి వేణుగోపాల్**
తెలంగాణ తొలి కాళోజీ నారాయణరావు
పురస్కార గ్రహీత
ప్రముఖ కవి, సద్విమర్శకులు
9441054637, 7981457092

# దాగినదేదో తెలిసింది

డా.కూర్మాచలం శంకర స్వామి గారు సాహిత్యంలో ప్రత్యేక పంథాను అనుసరిస్తూ, మంచి గుర్తింపును పొందారు. వారి కవిత్వం, గేయాలు, వ్యాసాలు సమాజం పట్ల ఎంతో బాధ్యత కలిగిన సాహిత్య రూపాన్ని ప్రతిబింబిస్తాయి. విద్యాబోధన, సృజనాత్మక సాహిత్యం రెండింటిలోనూ విజయపథంలో సాగుతూ చక్కని సమతుల్యతని ప్రదర్శిస్తున్నారు. కవిత్వాన్ని చదవడం వేరు.రాయడం వేరు. మొదటిది అందరూ చేయగలరు. రెండవది కొందరే చేయగలరు. కవిత్వం చదివేందుకు భాషా పరిజ్ఞానం ఉంటే చాలు. కానీ, రాయాలంటే భాషకి భావుకతని జోడించి అందంగా అల్లడం తెలియాలి. ఈ విషయంలో కూర్మాచలం గారి కలం బాగా రాటు తేలిందని వారి కవితలను చదివితే మనకు తెలుస్తుంది. సంపుటిలోని కవితల్ని చదవగానే హృదయానికి తాకేలా ఉన్నాయి. కవితలకి తగినట్లే చక్కని శీర్షికలు కుదరడంతో ఆ కవితలకి మరింత వన్నెలద్దినట్లు అయింది. కవితా సంపుటి శీర్షిక సైతం చదవగానే హాయిగొలిపేలా ఆసక్తిగా ఉంది. ''మబ్బుల మాటు'' ఏముందో చూడాలనే ఆసక్తి సహజంగానే అందరికీ ఉంటుంది. కురవడానికి సిద్ధంగా ఉన్న మబ్బుల నిండా నీరు ఉంటుంది. తెరవడానికి సిద్ధంగా ఉన్న ఈ మబ్బుల మాటు పుస్తకంలోనూ పాఠకుల హృదయ ఫలకాలపై కురవడానికి కవితలు నిండి ఉన్నాయి. చల్లగాలి తాకగానే మేఘం వర్షించినట్లు సహృదయ పాఠకుడు పుస్తకం తెరవగానే కవిత్వం గుబాళిస్తుంది. ఇందులోని కవితల్లో మానవునిలోని ప్రేమ, త్యాగం, స్వార్థం, ఈర్ష, బాధ, ఆనందం వంటి అనేక భావాలు ఇమిడి ఉన్నాయి. ఇవి ప్రపంచంలోని ఎందరో మానవుల మనసు పొరల మాటున దాగిన భావాలను వ్యక్త పరిచిన కవితలు కాబట్టే ప్రతీకాత్మకంగా కవి మబ్బుల మాటు అన్న శీర్షికను పెట్టారేమో. సంపుటిలోని మధుర జ్ఞాపకం, ఇంటి దీపం, కల చెదిరింది, అతడు సల్లగుండాలే కవితలు కవిలోని సున్నితత్వానికి, మానవులపై ప్రేమకి అద్దం పడుతున్నాయి. కవితల్లో కవి చూపించిన వస్తువైవిధ్యం ఈ సంపుటి విలువని, ఆకర్షణని పెంచాయి. ఒకే విధమైన వస్తు ప్రీతితో కవితలు పొందుపరిస్తే పాఠకుడికి ఆసక్తి సన్నగిల్లుతుంది. కానీ ఆ అవకాశం ఇందులో లేదు. విభిన్న అంశాలతో సమకాలీన సమాజాన్ని చిత్రించారు కూర్మాచలం. దీంట్లో ప్రతి కవిత కవికి బిడ్డ వంటిదే. ఒకటి బాగుంది ఇంకొకటి బాగా లేదు అని చెప్పలేం. అయితే కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, సినారే వంటి కవితా దిగ్గజాలు వారి జీవితంలో ఎన్నో కవితలు రాసినప్పటికీ వాటిలో కొన్ని మాత్రమే పాఠకుల గుండె తెరలపై నిలిచి పోయాయి. అట్లా వీరి కవిత్వంలోనూ అమ్మ గురించి రాసిన కమ్మదనం కవిత, బాల్యం గురించి రాసిన మధుర జ్ఞాపకం, చెట్ల గురించిన ధరణి పట్టువస్త్రాలు, రైతు గురించిన అతడు సల్లగుండాలే, స్త్రీల గురించిన మోక్షమెప్పుడో, పుస్తకం గురించి రాసిన జ్ఞానదీపం వంటి కవితలు గుర్తుండి పోతాయి. మూగబోయిన పల్లెలు కవితలో ''పల్లెవెలుగు బస్సులు మోసుకొచ్చిన / వలస పక్షుల కోలాహాలాల సవ్వడి'' వంటి వాక్యాలు పుస్తకం మూసిన తరువాత కూడా మనల్ని వెంటాడుతూనే ఉంటాయి .

ఈ కవితల్లో కూర్మాచలం సమాజ హితాన్ని గురించి ఎక్కువగా మదన పడినట్లుగా కనిపిస్తోంది. గుణ మర్దనం అనే కవితలో'' ఇప్పుడు మనకు కావాల్సింది/ దండించే చేయి కాదు దండం పెట్టే చేయి కావాలి/ మర్దనం కాదు గుణ మర్దనం చేయాలి " అంటారు. అట్లానే ఇంకో కవితలో ఇగురం (పద్ధతి) లేకుంటే ఎలా ఉంటదో చెబుతూ "ఇగురం లేనమ్మ మొగరం వెనక్కి వెళ్లి దాక్కున్నట్లు" అంటూ కవిత్వంలో సామెతలను జోడించడం వారి కవితా శక్తిని తెలుపుతుంది. గత్మెల్ల బతుకు అనే కవితలో అందని ద్రాక్షల కోసం ఆశపడి అటు ఉట్టికి ఇటు స్వర్గానికి కాకుండా పోతివి" అనే కవితా పంక్తుల్లో అత్యాశ పడే మనుషుల పరిస్థితిని కవిత్వీకరించారు. ఇందులోని కొన్ని కొన్ని కవితలు చదువుతున్నప్పుడు సుమతి శతకం మనకు గుర్తుకు వస్తుంది. మొత్తంగా కూర్మాచలం గారి కవిత్వం ప్రకృతిని, సమాజాన్ని, మానవులను, మానవ సంబంధాలని ఒకే కాన్వాస్ పై కవిత్వం అనే కుంచెతో భిన్న చిత్రాలు గీసినట్లు అందంగా పొదిగింది. ఈ కవిత సంపుటి ద్వారా అందమైనటువంటి గురుశిష్య సంబంధం మరొక్కసారి సాహితీలోకంలో వెల్లివిరిసినట్లు అయింది. గురువు జ్ఞాన కాంతిని కురిపించే నిండైన వెన్నెల లాంటి వాడు. శిష్యుడు చకోర పక్షిలా మారి దాన్ని స్వీకరించాలి. అప్పుడే జ్ఞానార్జన జరుగుతుంది. భారతదేశంలో గురుశిష్య బంధానికి చాలా ఉన్నతమైన స్థానం ఉన్నది. దానిని మరోసారి రుజువు చేసింది ఈ గ్రంథం. డాక్టర్ కూర్మాచలం గారి శిష్యుడైన చిరంజీవి మోత్యా నాయక్ ఈ గ్రంథం వెలువడటానికి ఆర్థిక సహకారం అందించటం విశేషం. ఇంత చిన్న వయసులోనే అతడికి అంత మంచి సహృదయత ఉండటం మెచ్చుకోదగిన అంశం. మరో గొప్పవిషయం ఏమిటంటె గురువు శిష్యునికి పుస్తకాన్ని అంకితమివ్వడం. ఈ ఘనత ఇద్దరికి దక్కుతుంది. ఈ గురుశిష్యుల బంధం ఇలాగే కొనసాగుతూ ఎల్లప్పుడూ నలుగురికి ఆదర్శంగా నిలవాలి. డా.కూర్మాచలం గారు జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. ఎంతో విషాదాన్ని దుఃఖాన్ని మోశారు. అయినా ఎప్పుడూ వారు తమ ఆత్మవిశ్వాసాన్ని ధైర్యాన్ని కోల్పోలేదు. కాలం మనసుకు చేసిన గాయాలను కలంతో కవిత్వాన్ని పూసి మాన్పుకున్నారు. ఈ లక్షణం ఈ నాటి యువత ఆదర్శంగా తీసుకొని పాటించాల్సిన అవసరం ఉంది . చిన్న చిన్న విషయాలకే కుంగిపోతున్న విద్యార్థులకు ఇటువంటి వారి జీవితం ద్వారా స్ఫూర్తిని చైతన్యాన్ని పొందాలి. డా.కూర్మాచలం శంకర స్వామి పట్టుదలతో, నిరంతర కృషితో అనుకున్నవి సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటికే శంఖారావం, కొత్త వేకువ కోసం, మానవతా గీత గేయ సంపుటాలు, సుజ్ఞానగీత, అంతర్గీత, చేతనగీత, సంపుటాలు తెలుగులో సంక్షేమమ చైతన్యగీతాలు – పరిశోధనా గ్రంథం, శ్రీకర శతకాలతో తనదైన బాణీని సృష్టించుకొని మానవత్వపు వాణిని కవిత్వంలో వినిపిస్తూ సాగుతున్నారు. వారి సృజనాత్మకత ప్రయాణం ఎల్లవేళలా విజయమార్గాన పయనించాలని కోరుకుంటున్నాను. మబ్బుల మాటు అనే చక్కని కవితా సంపుటిని వెలువరిస్తున్నందుకు వారికి శుభాకాంక్షలు. మంచిని కాంక్షించే మనిషిని ప్రేమించే వారి కవిత్వం నిత్యం ఇట్లానే వెలగాలని ఆశిస్తూ...అభినందనలు.



**– ఆచార్య శ్రీమతి సూర్యా ధనంజయ్**
9849104187

## రైతు కంట కన్నీరు కాదు... రక్తం కారుతుంది.....

ఆరుగాలం శ్రమించే రైతన్న
అష్టకష్టాలతో అగమౌతున్న బతుకన్న
ఆనందంతో విత్తు నాటావు
అగమ్య గోచరంగా నేల రాలిన పంటతో అగోరిస్తున్నవు
ఆరాటంగా వ్యవసాయం పోరాటంగా బ్రతుకాయె
అధిరోహించి ధాన్యపు గింజ ఓలిస్తే
రైతు అస్థి పంజరమాయే
అద్భుతం మన వ్యవసాయం అన్న
ఓ ప్రభుత్వమా !
అగమౌతున్న రైతన్న కు భరోసా ఇవ్వలేని
మా దరిద్రమా !
అవసరానికి ఆదుకోలేని ప్రభుత్వమా
ఆలోచించు నీ కంచంలో మేతుకులకు
ప్రతిరూపం ఎవరో ఎరుగుమా
అసురుల హస్తాలలో విషవలయమైన విక్రయాలు
ఆపద్భాందవులులేని అస్థిపంజర నేస్తాలు
అడుగడుగునా మరణ మృదంగ మృత్యువు కేకలు
ఆదుకునే వారు లేక ఆర్తనాదాలు బతుకులు
అన్నం మెతుకులు మార్చే తన బతుకును
ఆవిరైన రక్తపు చెమటతో నేల తల్లికి
అద్దెను సొగసును
అడ్డంకులెన్ని వచ్చినా వదలని సేద్యం
ఆలోచించడానికి అది కష్ట సాధ్యం
అవసరమే నీ కాయ కష్టం అందరికి
ఆరోగ్యంగా నీవు ఉంటేనే అందుతుంది
కొందరికి
అలల లాంటి ఆటు పోటులతో వ్యవసాయం
ఆగిన గుండె కు లేదు సాయం
అకాల వర్షాలకు రైతు కంట కన్నీటి జలపాతాలు
ఆమోదం లేని బతుకుకు పారుతున్న
నెత్తుటి ప్రవాహాలు
అమ్మకానికి రైతు ధాన్యానికి లేదు మద్దతు ధర
ఆకలి మంటలతో అస్థి పంజరమైన
రైతు కు లాభం ఏ మేర
అనిర్వచనీయమైన నీ కష్టానికి చేద్దాం సలాం
ఆయురారోగ్యాలకై రైతన్న జీవితాలకు
భరోసాను ఇద్దాం.



**-దేశిని శ్రీధర్**
9849818284

## వంతెన

నది అవసరమే
ఊరువుల పైభాగాన్నీ
ఉదరం క్రింది భాగాన్నీ
కలిపే కటిలా
ఇటువైపు అటువైపు
నది ఈ తీరాన్నీ ఆ తీరాన్నీ కలిపే
వంతెనా అవసరమే
నదికి
దప్పిక రక్కసి పీచమడచడం తెలుసు
తన వీపుమీద వాహనాలు మోయడమూ తెలుసు
వంతెనకి
దూరాన్ని మింగేసి
మనుషుల్ని చేరువచెయ్యడమూ తెలుసు
వంతెన వెన్నుమీద పడేజాడలు రెండే
ఒకటి మనుషుల అడుగులది
మరోటి వాహన చక్రాల టైర్లది



**–మాధవీసనారా**
8639491246

## కలిసిరాని 2020

భయం పూసుకొని
చీకటి చేమురును రుద్దుకొని
ఇరవై ఇరవై వత్సర గడపలో
కష్టాల ముగ్గులను వేసిందో!

భూచక్ర బొంగరంలా
చైనా గోడలను దాటి
మౌన యుద్ధంలా కనబడని
'కరోనా' గాలి ప్రపంచమంతా
మనుషుల మీద నాట్యం చేసిందో!

లాక్ డౌన్లతో బతుకంతా
అంధకారం చేసిందో
శ్రామిక కార్మిక అన్నదాత
సామాన్య ప్రజల మనసులకు
భౌతిక ముసుగు వేసిందో!

రోజువారీ జీవితాలు
నెలవారీ జీతాలు
వ్యాపార సరళిపై
కొవిడ్ 19 రూపంలో
శ్మశాన దారులోకి నెట్టిందో!

మందులేని రోగం
అంటూ వ్యాధిలా
ఏలా ? ప్రబలిందో తెలిసేలోపే
పరిశోధన కాలంలో
ఎంతమంది హృదయాలు
భయంమాటున బతుకులను
దాటవేస్తున్నరో!

కష్టాలన్నీ కూడగట్టుకొని
పేదోడి గుడిసె వాలితే
నయం చేయని రోగం సోకి
కాటికి పంపలేని దుస్థితి
దోస్తీల కాచుకొని ఉండబట్టె!

కలిసిరాని కాలం ముంగిట
అడుగు పడని నిరుపేద
బతుకు చక్రాలు
ఎన్నో.. మరెన్నో..
కరోనా కాటుకు
బలికావాల్సిందేనా..!!



**-పగిడిపల్లి సురేందర్ పూసల**
8074846063

# సెల్‌ఫోన్లపై కవుల స్పందన



## సెల్ ఫోన్

గుర్రాలతో పావురాలతో కబురంపే రోజుల నుంచి
పోస్ట్ మాన్ ఉత్తరాల కోసం ఎదురు చూపులు!!

అంతర్జాలం రాకతో
సప్త సముద్రాల అవతల ఉన్న పేగు బంధాలతో
క్షణాలలో ముచ్చట్లు!!
అరచేతిలో వైకుంఠం
అంతర్జాలంతో అందరికీ గాలం!!

చరవాణి ఇప్పుడు
మనుషుల మనసుల ఆకర్షణ మంత్రం!!
పట్టుకుంటే వీడని నేస్తం!!
బువ్వ తినాలంటే
చందమామ రావే పాటకు దూరమై
సెల్లు పాటలకు చేరువైన చిన్నారులు
సర్వప్రపంచాన్ని గుప్పిట్లో ఉంచుకుని
రాజ్యమేలుతున్న మహారాణి!!

ఏ బిల్లులు కట్టాలన్నా
ఒకప్పటి చాంతాడంత క్యూలకు చెల్లు చీటీ
ఉన్న చోటనే చరవాణితో భేటీ
సకల లావాదేవీలకు ఆలవాలం!!
ప్రపంచాన్నే శాసిస్తున్న
చరవాణి ఇప్పుడు
అందరి రాణి!!

కానీ
సెల్లు రాకతో పతనమైన విలువలు
నీలిచిత్రాల నీలినీడలలో ఛిద్రమౌతున్న బాల్యం !!

పదహారేళ్ళ వయసుకే ప్రేమలు
అవునంటే పెళ్లిళ్లు
కాదంటే అడ్డంగా నరకడాలు
కొండొకచో పెద్దల నిర్వాకంతో
ఉరికొయ్యలను ముద్దాడే ప్రేమపక్షులు!!

చరవాణితో
జాగరూకత ఉంటే అందలం!!
తేడాగా వాడితే పాతాళం!!

**-పరిమి వెంకట సత్యమూర్తి,**
9440720324

## కాలయాపన

సెల్ ఫోన్ తో కాలయాపన కూడదు
సాంకేతిక పరిపక్వతయే సెల్ ఫోన్
ఒకప్పుడు పిల్లలకు సెల్ఫోన్ వద్దన్నారు
నేడు సెల్ ఫోన్ లో పాఠాలు బోధిస్తున్నారు
చంటి పిల్లలకి సైతం
సెల్ఫోన్ ఉంటేనే
నోటిలో ముద్ద దిగుతుంది
ఏడుపు ఆగుతుంది
అరచేతిలో ఫోను
ప్రపంచమే గుప్పిట్లో
నాడు పనులు చకచకా సాగాయి
నేడు నోటి లెక్కలు సైతం అరచేతిలో దర్శనం
చరవాణితో సంబంధబాంధవ్యాలు దూరం
నట్టింట్లో అందరూ కూర్చున్నా
అందరి చూపులు నెట్ ఇంట్లోనే
పాలపిట్ట వచ్చే ఉత్తరాలు మాయమయ్యే
సుడిగుండాలు వచ్చే ముఖాముఖి మాయం
ముఖ పుస్తకంతో పుస్తకాలు కనుమరుగాయే
చిరిగిన చొక్కా అయినా తొడుక్కో
మంచి పుస్తకం కొనుక్కో..నాడు
నేడు ఒంటి పైన చొక్కా లేకున్నా
అరచేతిలో సెల్ఫోన్ ఆభరణం
నాడు ప్రభాతే కర దర్శనం
నేడు సెల్ ఫోన్ తోనే శుభోదయం
అర్ధరాత్రి అపరాత్రి ల్లు ఆన్లైన్లోనే
చెడును చేయాలి దూరం
మంచికే వాడాలి ఈ హస్త భూషణం

**– ఇమ్మడి రాంబాబు,**
9866660531

## చోద్యం

కందము: చేతిలో పిల్లను మరతురు
నాతితొ సరసము విడుతురు నమ్మగ నిజమే !
చేతిలొ సెల్లును మరవక
చూతురు మైమరచి పోయి చోద్యము గాదే!

**-ధర్మపురి వేంకటేశ్వర్లు,**
9866645822

## సెల్లు ఫోను - సొల్లు ముచ్చట్లు

ప్రతి ఆవిష్కరణ
ప్రజలకు మేలుకు మార్గం వేయాలి
సెల్లు ఫోన్ రాక సొల్లు కబుర్ల వేదికైంది
స్మార్ట్ ఫోనుకు ముందు
సెల్ ఫోన్లో వ్యర్థమాటల కాలక్షేపం
స్మార్ట్ ఫోన్ ఆగమనంతో
చిత్ర విచిత్రాలూ
మనో వికారాలూ
మనుషులూ
మనోవ్యాకులతలూ
ఒక ఇంట్లోనే ఉన్నా
ఒకరికొకరు అగోచరజీవాలే
ఒకరి మంచి చెడ్డలు
ఇంకొకరికి అవ్యక్త విషయాలే
ఇంటికి ఎవరొచ్చినా
సెల్ ఫోన్ ఒక జత కళ్లకు చిరునామానే
సమాజమే కాదు
తమకు తామే అజ్ఞాత వ్యక్తులు
అలారం పిలుపు నుండి
అర్ధరాత్రి దాకా
ప్రతి నిమిషమూ చేతిలో ఫోనే
వేరే పనిలో ఉన్నా మనసులో ఫోనే
సాహిత్యమూ
చరిత్ర
శాస్త్రవిజ్ఞానమూ
ఇప్పుడు టచ్ మి నాట్ మొక్కలు
పుస్తకాలు బందు
సెల్లే పసందు
చెత్తతో కాలక్షేపం ముప్పు
ఎన్నటికీ కాదు ఒప్పు

**- ఎన్.అరుణ జ్యోతి,**
ఫోన్: 9966181561



## వ్యసనాల వయ్యారి

చరవాణి లీలలు...మాయలు
ఎన్నని చెప్పను
ఏమని చెప్పను
చిన్నగా ఉన్నా చిన్నది కాదు
వన్నెచిన్నెల వయ్యారి

చేతిలో చరవాణి
జేబులో ఆకాశవాణి
వ్యసనాల మహారాణి
మాయల వయ్యారి
మనసు దోచిన మయూరి

అందివచ్చిన సాంకేతికత
అన్ని అనర్థాలకు మూలమదే కదా
గుప్పిట్లో ఉండాల్సింది
అందర్నీ గుప్పిట్లో పెట్టుకుంది
సమయాన్ని వృథా చేస్తుంది
తానే ప్రపంచమై కూర్చుంది

వాట్సప్ లు
ఫేసుబుక్ లు
చాటింగ్ లు
మీటింగ్ లు
ర్యాగింగులు
రేటింగ్ లు
యువతకు పెడదోవలు
సమాజానికి పట్టిన చీడ

విలువైన కాలాన్ని
విచిత్రంగా హరిస్తుంది
చరవాణిని వ్యసనంగా చేయకు
బానిసై బతుకకు
విజ్ఞాన సాధనం
అజ్ఞానంగా వాడకు
అవసరం మేర వాడుకో
అందరి మన్ననలు అందుకో

**–గాజుల భారతి శ్రీనివాస్,**
9849788108

## మోగి భయపెట్టే మొబైలు

గ్రూపులెక్కువయ్యి
మెసేజ్ ల మోత మోగిస్తూ
గోస పెడుతోంది ఫోను.
నాలోని భాగమేనంటోంది మేను.

ఇష్టమున్న వాటికీ
కష్టమైన వాటికీ
చిరాకొచ్చే వాటికీ
చిర్రెత్తుకొచ్చే వాటికీ
కీర్తి ఖండూతులకీ
భజనపరులకీ
దండం ఆశించే వాటికీ
కోదండమే నయమనిపించే వాటికీ
వారికి నచ్చిన వాటికీ
నాకసలే నచ్చని వాటికీ
వంటలకు, వడ్డనలకూ
రంగులకూ రుచులకూ
తిన్న దానికీ పన్నదానికీ
ఉన్నదానికీ లేనిదానికీ
శుభాలకూ అశుభాలకూ
ఎవరో పుట్టిన దానికీ
ఎవరో చచ్చిన దానకీ
చచ్చినట్టు నచ్చిందనే వాటికీ
ముఖ స్తుతులకూ
మొహమాటాలకూ
ఇంకా ఎన్నెన్నో వాటికి
అలుపూ సొలుపు లేకుండా
మోగుతూనే ఉంటుంది...

ఫోనెత్తలేక
ఎత్తక పోతే
యింట్లో వాళ్ళకు సమాధానమివ్వలేక
ఎత్తి భరించే గుండె బలం లేక
సతమతమౌతున్నాను..
ఎవరూ చూడకుండా బోరున ఏడుస్తున్నాను..
పిచ్చి వాడిలా రోడ్లెంబట తిరుగుతున్నాను.
దయ్యం పట్టిన వాడిలా మారిపోయాను....

ఐనా.. నా ప్రాణాన్ని ఫోన్ లోనే దాచి ఉంచాను..
నా ప్రాణం కంటే పదిలంగా చూసు కుంటాను...
వచ్చే మెసేజీలను కళ్లు తేలేసి చూస్తూనే ఉన్నాను..

**-జి. వెంకటేశ్వర్లు,**
9490918014

## మిసిమిపెట్టె

సెల్లు లేకపోతె ఇల్లైన దాటడు
హస్తభూషణంబు యతనికిపుడు!
సెల్లు లేక పోతె ఘొల్లుమంటుంటాడు
మనిషి నడతకెపుడు మార్గదర్శి!.

తగులుతెరలరంగు
తాదాత్మ్యతనుపెంచు
మాట భాగ్యమేమొ నోటలేక!
సెల్లులోన చూస్తు వల్లుమరచుటాయె
ఎవరినాప తరము ఎవరికెరుక?.

వార్తజేరవేయు యవనిలో ఏడున్న
రింగుచేస్తె చాలు చెంగుగాను!
బంధు మిత్రులకును బాగోగు పరవశం
కుశలమురిపమెచ్చు కూర్మి కురియు!.

నెట్టుజూసుకుంటు నిఖిలంబు తాతిర్గు
బస్సురైలులోన బడిలొ నైన!
సెల్లుసొల్లుకాదు కళ్ళకానందిని
పొద్దు పుచ్చువాడె పోకిరోడు!.

దేశమేదియైన దీప్తిగా పెళ్ళిళ్ళ
వేడుకలనుజూసె వీలుగలదు!
హద్దుమీరుటేల?అహముపెంచగనేల?
ఖర్చు తక్కువెంచె మర్మమిప్పు!.

అవసరాలకొరకు యవనిలో చెడిపోకు
సెల్లు ఫోను వాడు చెలిమిపంచు!
చేతిలోనహృదియు చేజార్చకెప్పుడు
బతుకు వృద్ధిదిద్దు భాగ్యమదియె!.

దూరమున్నప్రజల చేర్చేటి యంత్రము
ముద్దుముచ్చటిచ్చు మోములకును!
ఎదుటివారి మనసు ఎంచక్కగాగెల్చు
విజయమిచ్చునీకు విశ్వమందు!.

స్మార్టు ఫోనులందు చక్కని టైపుతో
కవిత పద్యములను కలముతీరు!
కవితగానమెంచి కవులను మెప్పించి
కానుకలను గెల్చుకర్మ నియతి!.

ప్రాంతభాషయాస భావుకతనునేర్పి
ఒక్కచోట చేర్చు చక్కగాను!
నీతినియమమెంచి నిత్యసత్యాలతో
మేలుకొరెచిన్న మిసిమిపెట్టె!

**-డా.పాండాల మహేశ్వర్**
99121 80054



## నాటి సభలు, సమావేశాలు...
అక్టోబర్ 22 నుండి అక్టోబర్ 28 వరకు

### జ్ఞాపకాలు అక్టోబర్ 22


అక్టోబర్ 22, 2018న రవీంద్రభారతిలో డా॥ రాధశ్రీ షష్టిపూర్తి సందర్భంగా 12 గం॥ల నిర్విరామ కావ్య కవితామృత ధారణకుగాను డా॥ రాధశ్రీ దంపతులను సత్కరిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, సాక్షి పాత్రికేయ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. దిలీప్ రెడ్డి, సాధన నరసింహారావు తదితరులు.



సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

### జ్ఞాపకాలు అక్టోబర్ 23


అక్టోబర్ 23, 2013న త్యాగరాయ గానసభలో 12గం॥లు నిర్విరామ ప్రసంగం చేసిన డా॥ ద్వా.నా.శాస్త్రిని సన్మానిస్తున్న తెన్నేటి సుధాదేవి, రుద్రరాజు పద్మరాజు, బైస దేవదాసు, జస్టిస్ సముద్రాల గోవిందరాజు, వంశీ రామరాజు, డా॥సి. హెచ్. వెంకటాచారి, బింగి నరేందర్ గౌడ్, డా॥ కళా వేంకట దీక్షితులు.



అక్టోబర్ 23, 2018న సాహితీవేత్త కొడవటిగంటి కుటుంబరావు జయంతి సభలో నివాళులర్పిస్తున్న అతిథులు బైస దేవదాసు, డా॥ వద్దెపల్లి కృష్ణ, కళా వి.యస్. జనార్ధన మూర్తి, శ్రీనివాస్, సుజాతమూర్తి తదితరులు.

### జ్ఞాపకాలు అక్టోబర్ 24


అక్టోబర్ 24, 2014న త్యాగరాయ గానసభలో కేతవరపు రాజ్యశ్రీ, రచన "నా లండన్ యాత్ర" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై శోభా పేరిందేవి, అభినందన భవానీ, త్రినాథరావు, డా॥పోతుకూచి సాంబశివరావు, సుధామ, దుర్గ.


అక్టోబర్ 24, 2014న త్యాగరాయ గానసభలో "నా లండన్ యాత్ర" పుస్తకావిష్కరణలో కేతవరపు రాజ్యశ్రీని సన్మానిస్తున్న త్రినాథరావు, బైస దేవదాసు, డా॥పోతుకూచి సాంబశివరావు, సుధామ, దుర్గ, అభినందన భవాని.

### జ్ఞాపకాలు అక్టోబర్ 25


అక్టోబర్ 25, 2014న నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో వట్టికోట ఆళ్వారుస్వామి శతజయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారి. వేదికపై గంటా జలంధర్‌రెడ్డి, వట్టికోట శ్రీనివాసులు, పరాంకుశం వేణుగోపాల్ స్వామి, కపిలవాయి లింగమూర్తి, దిలీప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బైస దేవదాసు.



అక్టోబర్ 25, 2014న నాంపల్లిలోని తెలుగు విశ్వ విద్యాలయంలో వట్టికోట ఆళ్వారుస్వామి శతజయంతి సందర్భంగా గ్రంథావిష్కరణలో గంటా జలంధర్‌రెడ్డి, పరాంకుశం వేణుగోపాలస్వామి, ఎలనాగ, దిలీప్‌రెడ్డి, కపిలవాయి లింగమూర్తి, డా॥కె.వి. రమణాచారి, మధుసూధన్‌రెడ్డి, గున్న రాజేందర్‌రెడ్డి, బైస దేవదాసు.

### జ్ఞాపకాలు అక్టోబర్ 26


అక్టోబర్ 26, 2018న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2017 కీర్తి పురస్కారాల ప్రదానోత్సవంలో పత్రిక రచనకుగాను "తాపి ధర్మారావు స్మారక పురస్కారం"ను నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు ప్రదానం చేస్తున్న సినీగీత రచయిత చంద్రబోస్, ఉప కులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల, శ్రీమతి సురభి వాణీదేవి.


కీర్తి పురస్కార సభలో స్పందన తెలియజేస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

### జ్ఞాపకాలు అక్టోబర్ 27



అక్టోబర్ 27, 2018న కళా లలిత కళావేదికలో పొత్తూరి సుబ్బారావు కవితా సంపుటి "స్తబ్దత నుండి సమరం వైపు" ఆవిష్కరణలో గుదిబండి వెంకటరెడ్డి, పెద్దూరి వెంకటదాసు, వై. రామకృష్ణారావు, పొత్తూరి సుబ్బారావు, ఆవిష్కర్త డా॥కె.వి. రమణాచారి, డా॥వోలేటి పార్వతీశం, కళా వి.యస్. జనార్ధనమూర్తి, రమణ వెలమకన్ని, బైస దేవదాసు, పి.వి.జి.కె.మూర్తి.



అక్టోబర్ 27, 2018న కళా లలిత కళావేదికలో పొత్తూరి సుబ్బారావు కవితా సంపుటి"స్తబ్దత నుండి సమరం వైపు" పుస్తకాన్ని నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు అంకితం ఇస్తున్న రచయిత పొత్తూరి సుబ్బారావు. వేదికపై గుదిబండి వెంకటరెడ్డి, పెద్దూరి వెంకటదాసు.

### జ్ఞాపకాలు అక్టోబర్ 28


అక్టోబర్ 28, 2013న త్యాగరాయ గానసభలో 12గం॥లు నిర్విరామ ప్రసంగం చేసిన డా॥ ద్వా.నా.శాస్త్రిని సన్మానిస్తున్న తెన్నేటి సుధాదేవి, రుద్రరాజు పద్మరాజు, బైస దేవదాసు, జస్టిస్ సముద్రాల గోవిందరాజు, వంశీ రామరాజు, డా॥సి. హెచ్. వెంకటాచారి, బింగి నరేందర్ గౌడ్, డా॥ కళా వేంకట దీక్షితులు.



అక్టోబర్ 28, 2018న సాహితీవేత్త కొడవటిగంటి కుటుంబరావు జయంతి సభలో నివాళులర్పిస్తున్న అతిథులు బైస దేవదాసు, డా॥ వద్దెపల్లి కృష్ణ, కళా వి.యస్. జనార్ధన మూర్తి, శ్రీనివాస్, సుజాతమూర్తి తదితరులు.

### జ్ఞాపకాలు అక్టోబర్ 28


అక్టోబర్ 28, 2007న కరీంనగర్‌లో శరత్ సాహితీ కళా స్రవంతి సభలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న డా॥ రావిరంగారావు, సబ్బని లక్ష్మీనారాయణ, రాధేయ, కందాళై రాఘవాచార్య, సంకేపల్లి నాగేంద్రశర్మ తదితరులు.



అక్టోబర్ 28, 2007న శరత్ సాహితీ కళా స్రవంతి సభలో 'నాగేంద్రశర్మ కథలు' పుస్తకం ఆవిష్కరణలో డా॥ రావిరంగారావు, ఆవిష్కర్త బైస దేవదాసు, నాగేంద్రశర్మ, సంకేపల్లి, సబ్బని లక్ష్మీనారాయణ, వి.పి. చందన్‌రావు.

# సెంటిమెంట్‌తో ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు

**డబ్బులు వెదజల్లి గెలవడమే లక్ష్యంగా సాగుతున్నారు**
**దుబ్బాక కోసం ఎతం ఖర్చుచేస్తున్నారో చెప్పాలి: రేవంత్**

సిద్దిపేట,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): అధికారంలోకి వచ్చాక కూడా అవసరాన్ని బట్టి ఇంకా తెలంగాణ సెంటిమెంటును రగిలిస్తూ ప్రజలను సిఎం కెసిఆర్ మభ్యపెట్టాలని చూస్తున్నారని కాంగ్రెస్ ఎంపి రేవంత్ రెడ్డి అన్నారు. దుబ్బాకలో అభివృద్ది జరగేలదని టిఆర్ఎస్ ప్రచారంతోనే తేలిందన్నారు. అభివృద్ది జరిగితే హరీష్ రావు అదే పనిగా ఇక్కడే మకాం వేసి ప్రజలను ఎందుకు మభ్యపెడతారని అన్నారు. మరోవైపు ఏ ఎన్నికలనైనా డబ్బు వెదజల్లి గెలవాలన్నదే టిఆర్ఎస్ వ్యూహమని అన్నారు. ఎన్నికలు, సెంటిమెంట్, డబ్బు, వలసలు కేసీఆర్ వ్యూహంలో ముఖ్యమైనవిగా గుర్తించాలని అన్నారు. ప్రజలు మభ్య పెట్టి అనేకాకానేక పథకాలతో ఇంతకాలం మోసం చేశారని ప్రజలు గుర్తించారని అన్నారు. ఉద్యమ సమయంలోనైనా, అధికారంలోకి వచ్చిన తర్వాతైనా సెంటిమంట్‌ను అడ్డం పెట్టుకుని ప్రజలను బురిడీ కొట్టించే పాలన సాగుతోందని అన్నారు. 2004 జనరల్ ఎలక్షన్ తర్వాత 2006 కరీంనగర్ ఉపఎన్నిక, 2008 బైఎలక్షన్, 2009 జనరల్ఎలక్షన్స్, ఆ తర్వాత 2014 ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చేదాకా ఎన్ని ఉపఎన్నికలు జరిగాయో ఒకసారి గుర్తుచేసుకుంటే టిఆర్ఎస్ ఎలా వ్యవమరించిందీ అర్థం అవుతుందన్నారు.

ఉద్యమ సమయంలో అన్ని పార్టీలను నమ్మించి, ఉద్యమకారులను నమ్మించి తరవాత ఎలా మోసం చేశాడో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కోదండరామ్ లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి వారినే వేధించే తత్వం కెసిఆర్‌దని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం ఖర్చు చేయడమే కాకుండా, ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికల్లో కూడా భారీగా డబ్బు ఖర్చు చేశారని రేవంత్ అన్నారు. డబ్బులతో ప్రజలను మభ్యపెట్టవచ్చుని గుర్తించి ఎన్ఇనకలను దనరాజకీయాలు చేయడం కెసిఆర్‌కు చెల్లిందన్నారు. పెద్ద మొత్తంలో ఖర్చు చేసి గెలవడానికి డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వ డబ్బును వృదా చేసి, ఎన్నికల్లో ఉపయోగించుకోవడం ప్రజలు గుర్తించారని అన్నారు. అంతేకాదు అధికారాన్ని, పోలీసులను అడ్డం పెట్టుకొని ఎన్నికలను తమ కనుసన్నల్లో నడిపిస్తున్నారని మండిపడ్డారు. అన్ని ఎన్నికల్లో గెలిచి ప్రజలు మాతో ఉన్నారని, ప్రతిపక్షాలతో ప్రజలు లేరని చెప్పడం కూడా అలవాటు చేసుకున్నారని మండిపడ్డారు. మా పాలనను ప్రజలు అంగీకరిస్తున్నారు చూడండని వాదించడం కేసీఆర్‌కు అలవాటైంద న్నారు. దుబ్బాక ఎన్నికలో కూడా ఎంత ఖర్చయినా గెలవాలనే వ్యూహంతో ముందుకు పోతున్నట్లు కనపడుతోంది. ఇతర పార్టీల వారిపై సామ, దాన, బేధ, దండోపాయాలు ఉపయోగించి తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. కేసీఆర్ పాలనను చూసి ప్రజలు ఓట్లేస్తారుఅనే టీఆర్ఎస్ నాయకులు ఎందుకు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్నారో చెప్పాలన్నారు. హైదరాబాద్ వరదలతో అతలాకుతలం అయితే కనీసం నగరంలో పర్యటించకుండా దుబ్బాక మీద దృష్టి సారించారని అన్నారు. పాలన పక్కనపెట్టి ప్రజలను గాలికి వదిలేసి దుబ్బాక ఎన్నిక ముఖ్యమని భావించినట్లు కనపడుతోందన్నారు. ఒకవైపు అకాల వర్షాలకు పంటలు నష్టపోయి రైతులు లబోదిబోమని ఏడుస్తుంటే కేసీఆర్‌కు చీమకుట్టినట్లు లేదన్నారు.

# అన్‌లాక్ 5 నిబంధనలతో మళ్లీ ఆంక్షలు

**-పాఠశాలలు తెరిచేందుకు సన్నగిల్లిన అవకాశాలు**

హైదరాబాద్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): కరోనా కేసులు తక్కువగా కనిపిస్తున్నా దేశంలో దాని ప్రభావం మాత్రం తగ్గలేదు. అలాగే వ్యాక్సిన్ కూడా ఇంకా ప్రయోగ దశలోనే ఉంది. ప్రజలు కూలీనాలీ కోసం గడపదాటి బయటకు వస్తున్నా మిగతా వారు రావాలంటే భయపడుతున్నారు. పిల్లలు కూడా స్కూళ్లు తెరిస్తే వచ్చేందుకు సిద్దంగా లేరు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలను స్కూళ్లకు పంపడానికి పి÷-పుడే సిద్దంగా లేరు. దీంతో రాష్ట్రంలో పాఠశాలలు ఇప్పట్లో తెరుచుకునే పరిస్థితి లేదు. ప్రబుత్వం కూడా ఈ విషయంలో తొందరపాటు ప్రదర్శించడం లేదు. అన్‌లాక్ నిబంధనల పొడగింపుతో స్కూళ్ల పునః ప్రారంభంపై సందిగ్ధత నెలకొంది. అన్‌లాక్ 5 నిబంధనలను నవంబర్ నెలాఖరు వరకు పొడగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. వాస్తవానికి గతంలో నవంబర్ 2 నుంచి స్కూళ్లు ప్రారంభించాలని ఎపి అధికారులు యోచించారు. పది రోజుల కిందట జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో.. దసరా తర్వాత మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనకు వచ్చారు. అయితే కేంద్రం జారీ చేసిన అన్‌లాక్5 నిబంధనల్లో పాఠశాలల ప్రారంభంపై రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవచ్చని, అయితే కేంద్రం పేర్కొన్న నిబంధనలను పక్కాగా అమలు చేయాలని పేర్కొంది. క్షేత్రస్థాయి పరిస్థితులు అంచనా వేసిన తర్వాత విద్యాసంస్థల పునః ప్రారంభంపై నిర్ణయం తీసుకోవాలని, ఆన్‌లైన్,దూరవిద్యా బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేసింది. తల్లిదండ్రుల లిఖితపూర్వక అనుమతితోనే విద్యార్థులను పాఠశాలలకు అనుమతించాలని, హాజరును తప్పనిసరి చేయకూడదని స్పష్టం చేసింది. ఇప్పుడు కరోనా కేసులు తగ్గుముఖం పట్టకపోవడంతో అవే నిబంధనలను మరో నెల రోజులపాటు పొడిగించడంతో నవంబర్ మొదటివారంలో పాఠశాలలు ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించట్లేదు. ఇంజనీరింగ్ వంటి సాంకేతిక, వృత్తివిద్యా కోర్సుల తరగతులను డిసెంబర్ 1 లోగా ప్రారంభించుకోవచ్చని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) పేర్కొన్న సంగతి తెలిసిందే. డిగ్రీ తరగతుల ప్రారంభంపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మొత్తంగా పాఠశాలల ప్రారంభంపై ఇరు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఇంతవరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఎపిలో నవంబర్ 2 నుంచి ప్రారంభిస్తామని చెప్పినా సాధ్యం కాకపోవచ్చని అంటున్నారు.

# దుబ్బాకను ఎందుకు వెనకబడేశారు?

హైదరాబాద్, అక్టోబర్28(ఆర్ఎన్ఎ): దుబ్బాక అభివృద్ధి బాధ్యత తనదే అంటున్న మంత్రి హరీష్ రావు ఇంతకాలం ఈప్రాంత ప్రజలను ఎందుకు మభ్యపెట్టారన్నది తెలియచేయాల్సి ఉంది. ఇంతకాలం సిద్దిపేటకే పరిమితమైన మంత్రి పక్కనే ఉన్న దుబాక విషయంలో ఉప ఎన్నికలు రాగానే ఎందుకు ప్రేమ పుట్టుకుని వచ్చినట్లు అన్నది ప్రజలకు తెలియ చేయాలి. దివంగత రామలింగారెడ్డి ప్రతిపాదించిన అనేకానేక పనులు ఎందుకు పెండింగ్‌లో పడ్డాయో మంత్రిగా తెలపాలి. సిఎంగా కేసిఆర్ అని నియోజకవర్గాలను అభివృద్ధి చేయమని, నిధులు విడుదల చేస్తూ వచ్చారు. ఈ దశలో దుబ్బాకకు విడుదలైన నిధులను సిద్దిపేటకు మళ్లించారని కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస రెడ్డి చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా మంత్రి హరీష్ రావుదే. ఆరేళ్లుగా అక్కడ ఎలాంటి అభివృద్ధి జరిగిందో చెప్పాలి. కళ్యాణలక్ష్మి చెక్కులు, పెన్షన్ల పంపిణీ అభివృద్ధి కిందకు రావు. ఉపఎన్నికల ద్వారా సెంటిమెంటును రగిలించి ఇతర పార్టీలను ఇరుకున పెట్టి రాజకీయంగా లబ్ది పొందే వ్యూహాన్ని ఇంకెంతకాలం అనుసరిస్తారన్నదే ప్రశ్న. సాధారణ ఎన్నికలు మొదలు, ఉప ఎన్నికల వరకు అన్ని ఎన్నికల్లో డబ్బు ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఇకపోతే సిద్దిపేట ఎపిసోడ్ ..కనువిప్పు కావాలి. ప్రజలను మద్యంలో ముంచెత్తి, డబ్బు విచ్చలవిడిగా పంచి ఓటర్లను ఓట్లు వేసే యంత్రాలుగా మార్చు కొంటున్న తీరు ఇంకెంత కాలం అన్నది అన్ని పార్టీలు ఆలోచన చేయాలి. డబ్బులతో రాజకీయం చేయడం, అధికారంలోకి రాగానే డబ్బులు సంపాదించడం అన్న తీరులో సాగుతున్న పాలనకు చరమగీతం పాడాలి. ఓటర్లు కూడా డబ్బులకు ప్రలోభపడకుండా స్వతంత్రంగా ఓటేయడం అలవాటు చేసుకోవాలి. డబ్బులకు లొంగితే రాజకీయ పార్టీలు మనపై స్వారీ చేయడం ఖాయం. 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి సెంటిమెంటు పనిచేసింది. ఆ తర్వాత జరిగిన ఏ ఎన్నికను పరిశీలించినా డబ్బు ప్రభావం చాలా బలంగా ఉందని అర్థం చేసుకోవచ్చు. ఉద్యమపార్టీ కూడా ఇతర రాజకీయ పార్టీలకు భిన్నం కాదన్న విధంగా పాలన సాగిస్తోంది. ఏ ఎన్నిక చూసినా డబ్బు ప్రభావం ఏ స్థాయిలో ఉందో ఓటర్లు అందరికీ తెలుసు. ఏ మేరకు డబ్బులు పంచుతున్నారో ప్రజలకే బాగా తెలుసు. ఒక్కో ఓటును ఎంతకు అమ్ముకుం టున్నారో వారికే తెలుసు. రాజకీయ వలసలను విపరీతంగా ప్రోత్సహించి డబ్బు, పదవి ఆశ చూపించి లేదా బెదిరించి ఇతర పార్టీల వారిని తమ పార్టీలోకి చేర్చుకోవడం దేశ వ్యాప్తంగా చూస్తున్నాం. ఇందుకు ఫలానా పార్టీ అని చెప్పడానికి లేదు. అన్ని పార్టీల్లోనూ ఇదే సంస్కృతి అలవడింది. ప్రత్యర్థి పార్టీని బలహీనపర్చి, వారి క్యాడర్‌లో నిరాశానిస్పృహలను నింపడం ద్వారా లబ్ది పొందాలన్న రాజకీయాలు ఇప్పుడు దేశం యావత్తూ సాగుతున్నాయి. ఎన్నికలైన తర్వాత ఓటేసిన వారిని పట్టించుకున్న దాఖలాలు కనారావడం లేదు. అవినీతి లేకుండా పాలన చేస్తున్నామని కేసీఆర్ పదేపదే చెబున్నా ఇటీవలి అనేకానేక ఘటనలు చూస్తుంటే అవినీతి ఊడలు ఎంతగా దిగాయో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కూడా పైసలు పెట్టనిదే పని జరగడం లేదు. అధికారులు లంచాలకు మరిగారు. ప్రజల బాధలను పక్కన పెట్టారు. రెవన్యూలో జరిగిన తతంగం ఇందుకు ఉదాహరణ. దుబ్బాక అభివృద్ధి మాట అలా ఉంచితే.. ప్రాజెక్టుల పేరుతో బలవంతంగా పేద రైతుల భూములను బెదిరించి లాక్కున్నారు. ఎన్నో కోర్టు కేసులు నడిచాయి. ఎందరో వీధిన పడ్డారు. మరెందరో ఆక్రోశం వెళ్లగక్కి పోలీసు కేసులను ఎదుర్కొన్నారు. సిద్దిపేట, గజ్వేల్‌లో భూములు కోల్పోయిన వారికి ఇస్తున్న నష్టపరిహారానికి దుబ్బాకలో భూములు కోల్పోయిన వారికి ఇస్తున్న నష్ట పరిహారంతో వారు మళ్లీ గంటెడు భూములు కొనుక్కోలేక పోయారు. ఇకపోతే వారికి భూమికి భూమి ఇచ్చి ఉంటే కొంతయినా ఊరట దక్కేది. నీటి పేరుతో వారిని వంచించడం ఎంతవరకు మంచిదన్నది పాలకులు ఆలోచన చేయాలి. ఇటీవలి పరిస్థితులు చూస్తే పంటలు చేతికి వచ్చేసరికి వర్షాలకు నీటమునిగి నష్టం వస్తే రైతులను పలకరించిన నాథుడే లేకుండా పోయాడు. రామలింగారెడ్డి బతికి ఉన్నంత కాలం నియోజకవర్గం అభివృద్ధికి నిధుల కోసం నిరంతరం పోరాడారు. ఫలానా పనులు కావాలని అడిగే వారు. అప్పుడు దుబ్బాక విషయంలో ఇదే హరీష్ రావు ఎలాంటి హామీ లేదా ప్రకటన చేయలేదు. ఇప్పుడు సుజాత గెలిస్తే ఇస్తామని, దుబ్బాకను అభివృద్ధి చేస్తామంటే నమ్మ వచ్చా అన్నది సమస్య. అమాయకమైన ఎమ్మెల్యేలు అనేకమంది ప్రజల ప్రక్షాన ప్రశ్నించ డంలేదు. సమస్యల సాధన కోసం పోరాటం చేయడంలేదని ప్రజలు గుర్తించారు. ప్రతిపక్షాలు గెలిస్తే అభివృద్ధి జరగదని చెప్పే హరీశ్‌రావు.. రామలింగారెడ్డి ఉన్నప్పుడు ఎందుకు దుబ్బాక అభివృద్ధికి నోచుకోలేదో చెప్పాలి. సుజాత గెలిస్తే తాను బాధ్యత తీసుకుని దుబ్బాకను అభివృద్ధి చేస్తానంటున్న హరీశ్ .. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రిగా ఉంటూ ఎందుకు అభివృద్ధి చేయలేదో కూడా సమాధానం చెప్పాలి. కానీ ఆయనవద్ద సమాధానం లేదు. సిఎంగా కెసిఆర్ అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇస్తున్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నారు. అయినా దుబ్బాక వెనకబడిందని ఇప్పుడు హరీష్ రావే అంగీకరిస్తున్నారు. మొత్తానికి ఇప్పుడు అధికార, విపక్ష పార్టీల హామీల జడిలో దుబ్బాక ఉపఎన్నికల ప్రచారం వేడెక్కింది. మరో నాలుగు రోజుల్లో ప్రచారం కూడా ముగుస్తుంది. టీఆర్ఎస్ తరపున మంత్రి హరీష్‌రావు అన్నీ తానై ప్రచారం సాగిస్తున్నారు. దుబ్బాక ఉప ఎన్నికలో భారీ మెజారిటీ కోసం టిఆర్ఎస్ పావులు కదుపుతోంది. కాంగ్రెస్ నాయకులంతా దుబ్బాకలోనే మకాం వేశారు. ప్రభుత్వంపై లెక్కలేనన్ని ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ పరిస్థితి కూడా ఇంతే. వీరందరి ఆరోపణలు, విమర్శలకు దుబ్బాక గడ్డ నుంచే టిఆర్ఎస్ నేతలు జవాబిస్తున్నారు. మొత్తంగా ప్రజలు ఎవరికి ఓటేయాలన్నది వారే నిర్ణయించుకోవాలి. డబ్బుల మాయలో పడితే తరవాత అడిగే దిక్కు ఉండదు. ఎన్నికల్లో ఇది అనుభవ పూర్వకంగా తెలుసుకుంటున్న ప్రజలు విజ్ఞత ప్రదర్శిస్తేనూ ప్రజాస్వామ్యం మనుగడ సాగించగలదు.



కవిసంధ్య
సాహిత్య సాంస్కృతిక సంస్థ
యానాం
శిఖామణి
సాహితీ పురస్కారం
2020
30 అక్టోబరు 2020 శుక్రవారం సా. 5.00 గం.లకు జూమ్ వేదిక పై
పురస్కారగ్రహీత శ్రీ శీలావీర్రాజు
ముఖ్య అతిథి శ్రీ మల్లాడి కృష్ణా రావు
సభా ప్రారంభకులు శ్రీ మండలి బుద్ధప్రసాద్
పురస్కార ప్రదానం శ్రీ కె.శివారెడ్డి
విశిష్ట అతిథి డా. దీర్ఘాశి విజయ్ భాస్కర్
అధ్యక్షులు శ్రీ దాట్ల దేవదానం రాజు
పురస్కార ప్రస్తావన డా. శిఖామణి
ఆత్మీయ అతిథులు । డా.వరుగు భాస్కర్ రెడ్డి । శ్రీ మధునాపంతుల సత్యనారాయణ మూర్తి । డా.యాకూబ్ । డా.ప్రసాద మూర్తి । శ్రీ విజయ్ కోగంటి
శీలావీ సాహిత్య విశ్లేషణ
శ్రీ సుధామ - కవిత్వం । శ్రీ వాసిరెడ్డి నవీన్ - వచన సాహిత్యం
శ్రీ వెంటపల్లి సత్యనారాయణ - చిత్ర కళ । శ్రీ అనిల్ డ్యానీ - దీర్ఘ కావ్యాలు
కవి సంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు
। డా. ఎస్వీ.రాఘవేంద్ర రావు (పద్య కవిత్వం)
। విద్వాన్ జ్యోతి చంద్ర మౌళి (జానపద,శాసన పరిశోధన)
। డా.దిలావర్ (వచన కవిత్వం)
। శ్రీ పెనుగొండ లక్ష్మీ నారాయణ (సాహిత్య చరిత్ర)
। శ్రీ సంగెవేని రవీంద్ర (భాష-సంస్కృతి)
। శ్రీ మేడి శెట్టి తిరుమల కుమార్ (సామాజిక సేవ)
। శ్రీ విజయ చంద్ర (వచన కవిత్వం)
। డా.చల్లపల్లి స్వరూపరాణి (సాహిత్య విమర్శ)

ముప్వల చేతి కర్ర - తాత్త్వికత
ఆవిష్కరణ
ఆహ్వానం శ్రీ ముమ్మిడి శ్రీ వీర నాగ ప్రసాద్ (చిన్నారి)
సభా నిర్వహణ శ్రీ శ్రీరాం పుప్పాల , శ్రీ అనిల్ డ్యానీ
వందనసమర్పణ శ్రీ చెల్లి రవి


## కొత్తగా 1481 కేసులు.. నలుగురు మృతి

హైదరాబాద్,అక్టోబర్28 ( ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో గత 24 గంటల్లో కొత్తగా 1481 కరోనా కేసులు నమోదు కాగా.. నాలుగురు మృతి చెందారు. దీంతో ఇప్పటి వరకు తెలంగాణలో నమోదైన పాజిటీవ్ కేసుల సంఖ్య 2,34,1562కి చేం˘గా.. 1,319 మంది మరణించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 17,916 యాక్టివ్ కేసులు ఉండగా, చికిత్స నుంచి కోలుకుని 2,14,917 మంది డిశ్చార్జ్ అయినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం ఉదయం ఈ మేరకు బులిటెన్ విడుదల చేశారు. కొత్తగా జీహెచ్ఎంసీ పరిధిలో 279, మేడ్చల్ 138, రంగారెడ్డి 111, ఖమ్మం 82, నల్గొండ 82, భద్రాద్రి 79 పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

# కరోనా వ్యాక్సిన్‌పై కానరాని స్పష్టత

**ప్రయోగాలు సత్ఫలితం ఇస్తేనే మరింత ముందకు**
**తొలిరకం టీకాలతో సంపూర్ణ విజయం అసాధ్యం**
**యూకే టాస్క్‌ఫోర్స్ సంచలన వ్యాఖ్యలు**

లండన్,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాక్సిన్ కోసం ప్రయోగాల దశలో చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని అనుకుంటున్న సమయంలో సర్వత్రా దానిపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. అవి ఎంతవరకు పని చేస్తాయన్నది పరిశీలిస్తే తప్ప తెలియదని అంటున్నారు. అలాగే ఇప్పుడున్న కరోనాకు వ్యాక్సిన్ ఏ మేరకు పనిచేస్తాయో చూడాలంటున్నారు. యావత్తు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్‌ను అంతమొందించేందుకు ఉన్న ఏకైక మార్గం ప్రస్తుతానికి వ్యాక్సిన్ మాత్రమేనని భావిస్తున్నారు. వీలైనంత త్వరగా టీకా అందుబాటులోకి రావాలని ప్రతిఒక్కరూ ఆశిస్తున్నారు. గతంలో మరే వ్యాధికీ ఇంత త్వరగా టీకా రావాలని ఆశించిన దాఖలాలు లేవని చరిత్ర చెబుతోంది. ఈ తరుణంలో వ్యాక్సిన్ అభివృద్ధి కోసం యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో ఏర్పాటైన ప్రత్యేక కార్యదళం ఛైర్మన్ కేట్ బింగమ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరోనా వైరస్‌ను అరికట్టేందుకు అభివృద్ధి చేస్తున్న తొలితరం టీకాలు అసంపూర్ణంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. అసలు కరోనాకు పూర్తిస్థాయి వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందో.. లేదో.. కూడా చెప్పలేమన్నారు. ప్రస్తుతం అభివృద్ధిలో ఉన్న టీకాలు పూర్తిగా కొవిడ్‌ను అరికట్టకపోయినా.. లక్షణాలు, వ్యాధి తీవ్రతను తగ్గిస్తాయని తెలిపారు. అలాగే అందరికీ.. ఎప్పటికీ.. వ్యాక్సిన్ పనిచేస్తుందని కూడా చెప్పలేమన్నారు. ఇలాంటి పరిస్థితులకు ప్రతిఒక్కరూ సన్నద్ధమై ఉండాల్సిందేనని వివరించారు. ఈ మేరకు ప్రముఖ మెడికల్ జర్నల్ లాన్సెట్‌లో వ్యాక్సిన్ కోసం తాము చేస్తున్న కృషిని వివరిస్తూ ఓ కథనం ప్రచురించారు. ప్రస్తుతం అభివృద్ధిలో ఉన్న దాదాపు అన్ని వ్యాక్సిన్లు విఫలమయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించామని బింగమ్ తెలపడం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో సమర్థమైన, సురక్షితమైన టీకాను అందించడమే లక్ష్యంగా తమ బృందం పనిచేస్తోందన్నారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న అన్ని విధానాలను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. మరణాలు ఎక్కువగా 65 ఏళ్ల పైబడిన వారిలోనే ఉంటున్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో 65 ఏళ్ల పైబడిన వారిలో రోగనిరోధక శక్తిని పెంచే వ్యాక్సిన్ పైనే దృష్టి కేంద్రీకరించామన్నారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ తయారీ సామర్థ్యం ఏమాత్రం సరిపోదని బింగమ్ తెలిపారు. వేసవికాలంలో బ్రిటిష్ ప్రజల్లో యాంటీబాడీలు అత్యంత వేగంగా క్షీణిస్తున్నట్లు గుర్తించామని 'ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్' తెలిపింది. ఈ నేపథ్యంలో కరోనా సోకిన తర్వాత ఏర్పడే రోగనిరోధక శక్తి ఎక్కువ కాలం ఉంటుందని ఆశించలేమని వెల్లడించింది. మరోవైపు రెండో దశ కరోనా వైరస్ మరింత ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉందన్న అంచనాలతో బ్రిటిష్ ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు టెలిగ్రాఫ్ పత్రిక వెల్లడించింది. ఐరోపా దేశాల్లో కరోనా కేసులు మరోసారి విజృంభిస్తున్న విషయం తెలిసిందే. ఈ దశలో ప్రయోగాలు మరింత లోతుగా చేయాల్సి ఉందన్న అభిప్రాయం వస్తోంది.

# బీహార్‌లో రాక్షస పాలన

**-ముంగెర్ కాల్పులపై మండిపడ్డ తేజస్వి**

పాట్నా,అక్టోబర్28(ఆర్ఎన్ఎ): బీహార్‌లో రాక్షస పాలన సాగుతోందని, బ్రిటిష్ దయ్యర్‌లా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ మండిపడ్డారు. ముంగెర్‌లో చోటుచేసుకున్న పోలీసు కాల్పుల ఘటనపై ఆయన ఘాటుగా స్పందించారు. నితీష్ కుమార్ సర్కార్‌ను తప్పుపట్టారు. జనరల్ దయ్యర్ తరహాలో పోలీసు చర్యకు ఎవరు అనుమతిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారంనాడు ఓ ట్వీట్ చేశారు. బీహార్ తొలి విడత పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో తేజస్వి ఈ ట్వీట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఒక వ్యక్తి మృతికి కారణమైన ముంగెర్ పోలీసు కాల్పులను మేము ఖండిస్తున్నాం. ప్రస్తుతం డబుల్ ఇంజెన్ ప్రభుత్వం పాత్ర ఇందులో కచ్చితంగా ఉంది. జనరల్ దయ్యర్ తరహా కాల్పులకు అనుమతి ఇచ్చిందెవరో చెప్పాలని ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీని మేము అడుగుతున్నాం అని అన్నారు. ఈ ఘటనపై హైకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని తేజస్వి ఆ ట్వీట్‌లో డిమాండ్ చేశారు. గత సోమవారం రాత్రి దుర్గా నిమజ్జనానికి హాజరైన పలువు వ్యక్తులు, కొత్వాలి పోలీస్ సిబ్బంది మధ్య వాగ్యుద్ధం చోటుచేసుకుని పరిస్థితి అదుపు తప్పింది. కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ముంగెర్‌లో మంగళవారంనాడు భారీగా భద్రతా సిబ్బందిని మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనతో ప్రమేయమున్నట్టు భావిస్తున్న సుమారు 100 మంది వ్యక్తులను రాష్ట్ర పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. 12 ఖాళీ కార్ట్రిడ్జ్‌లను ఘటనా స్థలి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com